బుధవారం
31-01-2024
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 219
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam
www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

10న పీడీపీ ఆరవ మహాసభలు

వియన్నా: ది పార్టీ ఆఫ్ లేబర్ ఆఫ్ ఆస్ట్రియా (పీడీఏ) ఆరవ పార్టీ మహాసభలు ఫిబ్రవరి 10న అప్పర్ ఆస్ట్రియా రాజధాని లింజ్‌లో జరగనున్నాయి. 'ప్రజాశాంతి, సామ్రాజ్యవాదంపై పోరు' నినాదంతో మహాసభలు నిర్వహిస్తున్నట్లు పార్టీ ఓ ప్రకటనతో తెలిపింది. మహాసభలకు పార్టీ కేంద్ర కమిటీ హాజరై గత రెండేళ్లపై నివేదికలను సమర్పిస్తుంది. సభ్యులు వీటిపై చర్చలు జరుపుతారు. భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికలపైనా చర్చలు జరుగుతాయి. ఈ క్రమంలో కీలక నిర్ణయాలు, తీర్మానాలు జరగనున్నాయని ప్రకటన పేర్కొంది. పలస్తీనాపై పోరు, ఆస్ట్రియా ద్రవ్యోల్బణం వంటివి అజెండాలో ప్రధానంగా ఉన్నాయని, నూతన కేంద్ర కమిటీ, ఇతర ఫెడరల్ కమిటీలను కొత్తగా ఎన్నికకానున్నాయని కూడా వెల్లడించింది.

ఐదో జాబితాపై ఉత్కంఠ

- ఎంపీ అభ్యర్థులుగా ఎమ్మెల్యేలు
- మంత్రి రోజా, చెవిరెడ్డి, సింహాద్రి రమేశ్ పేర్ల పరిశీలన
- వైసీపీని వీడనున్న ఎమ్మెల్యే వసంత?

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: వైసీపీ ఐదో జాబితాపై ఇంకా ఉత్కంఠ కొనసాగుతోంది. ఇప్పటికే నాలుగు విడతలుగా జాబితాలను విడుదల చేశారు. పార్లమెంట్, అసెంబ్లీ ఇన్‌ఛార్జిల మార్పులపై సీఎం జగన్ అధ్యక్షతన పూర్తి స్థాయి కసరత్తు సాగుతోంది. ఎంపీ స్థానాలపై కొన్ని స్థానాలకు స్పష్టత రాగా, మిగిలిన స్థానాలపై దృష్టి సారించారు. ఈ విడత కొందరు ఎమ్మెల్యేలను ఎంపీలుగా అధిష్ఠానం పంపనుంది. ఇప్పటివరకు 68స్థానాల్లో మార్పులు, చేర్పులు చేపట్టారు. ఇందులో 58 అసెంబ్లీలు, 10 పార్లమెంట్ స్థానాలున్నాయి. సీఎంఓ నుంచి పిలుపురావడంతో మంగళవారం కొంతమంది సిట్టింగ్ ఎమ్మెల్యేలు, నేతలు క్యాంపు కార్యాలయానికి వచ్చి వైసీపీ ముఖ్యనేతలు వైవీ సుబ్బారెడ్డి, విజయసాయిరెడ్డి, సజ్జల రామకృష్ణారెడ్డిని కలిశారు. మొత్తం ఎంపీ స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేసేలా ఒకటి రెండు రోజుల్లో ఐదో జాబితాను ప్రకటించనున్నారు. ఈ జాబితాతో ఆగుతుందా?,మరో జాబితా ఉంటుందా? అనేది

- మిగతా 2 లో

జనసేనకు ఎన్ని సీట్లు?



- సర్దుబాటుపై చంద్రబాబు దృష్టి
- రా కదలి రా సభలకు తాత్కాలిక విరామం
- మరోసారి పవన్ కల్యాణ్‌తో భేటీ
- ఫిబ్రవరి మొదటివారంలో స్పష్టత

విశాలాంధ్ర బ్యూరో– అమరావతి: జనసేనతో సీట్ల సర్దుబాటును కొలిక్కి తెచ్చే అంశంపై టీడీపీ అధినేత చంద్రబాబు దృష్టి సారించారు. ఇందుకోసం ప్రత్యేకంగా 'రా.. కదలి రా' సభలకు ఆయన తాత్కాలిక విరామం ప్రకటించి మరీ కసరత్తు చేస్తున్నారు. ఇప్పటికే 17 పార్లమెంట్ స్థానాల్లో ఈ సభలు పూర్తయ్యాయి. వచ్చే నెల 4 నుంచి మిగిలిన చోట్ల నిర్వహించనున్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇప్పటికే రాష్ట్రంలో సగం నియోజకవర్గాలకు అభ్యర్థులు ఎంపిక ప్రక్రియ పూర్తి చేసింది. మిగిలిన నియోజకవర్గాలకు కూడా రెండు, మూడు రోజుల్లో ప్రకటించి ఎన్నికల ప్రచారంపై పూర్తిస్థాయిలో దృష్టి కేంద్రీకరించే పనిలో ఉంది. మరోపక్క 'సిద్ధం' పేరుతో సీఎం జగన్ భారీ బహిరంగసభలు ఏర్పాటు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో జనసేనతో

- మిగతా 2 లో

యుద్ధానికి సన్నద్ధం

అస్త్రశస్త్రాలతో అధికార, విపక్షాలు
రాష్ట్రపతి ప్రసంగంతో మొదలు...రేపు సభ ముందుకు బడ్జెట్
నేటి నుంచి పార్లమెంటు సమావేశాలు ప్రారంభం

న్యూదిల్లీ: పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు కొత్త భవనంలో బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఉదయం 11 గంటలకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగంతో సమావేశం మొదలవుతుంది. కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ గురువారం ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌ను లోక్‌సభలో ప్రవేశపెడతారు. ఏప్రిల్–మే నెలలో సార్వత్రిక ఎన్నికలు జరగనున్నందున ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రతిపాదిస్తారు. బడ్జెట్ సమావేశాలు ఫిబ్రవరి 9వ తేదీ వరకు జరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. కాగా, సార్వత్రిక ఎన్నికలకు ముందు జరిగే ఈ సమావేశాల కోసం విపక్షాలు అస్త్రశస్త్రాలతో సన్నద్ధమయ్యాయి. మోదీ సర్కారు వైఫల్యాలను ఎండగట్టేందుకు వ్యూహరచన చేస్తున్నాయి. ప్రతిపక్ష ఇండియా కూటమి భాగస్వామ్య పార్టీల నేతలు సమావేశమై ఉమ్మడి వ్యూహం గురించి చర్చించారు. మరోవైపు, ప్రతిపక్షాలను దీటుగా ఎదుర్కొనేందుకు అధికారపక్షం సైతం సర్వం సన్నద్ధమైంది. కాగా, పార్లమెంటు చివరి సమావేశాలు కావడంతో 146 మంది ఎంపీలపై విధించిన సస్పెన్షన్‌ను లోక్‌సభ స్పీకర్, రాజ్యసభ చైర్మన్ ఎత్తివేశారు. మరోవైపు, ఉభయసభలు సజావుగా జరిగేందుకు సహకరించాలని మోదీ ప్రభుత్వం ప్రతిపక్షాలకు విన్నవించింది. ఎన్నికల నేపథ్యంలో విధానపర ప్రకటనలు ఏమీ బడ్జెట్‌లో ఉండకపోవచ్చని తెలుస్తోంది. ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌కు పార్లమెంట్ ఆమోదం తెలిపితే ఏప్రిల్–జులైకి కావాల్సిన నిధులను ప్రో రేటా ప్రాతిపదికన భారత సంఘటిత నిధి నుంచి తీసుకునే అధికారం కేంద్ర ప్రభుత్వానికి ఉంటుంది. సార్వత్రిక ఎన్నికల తర్వాత కొత్త ప్రభుత్వం 2024–25 ఏడాదికి జూన్‌లో పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశ పెడుతుంది.

ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌లో ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధిని 50 శాతం పెంచే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. కిసాన్ సమ్మాన్ పథకం ద్వారా భూమి ఉన్న రైతులకు ఏడాదికి రూ.6 వేల పంట సాయాన్ని మూడు విడతలుగా అందిస్తున్నారు. ఇప్పుడు దానిని రూ.9 వేలకు

- మిగతా 2 లో

హోదా సాధనే లక్ష్యం

- సీఎం జగన్ కళ్లు తెరవాలి
- త్వరలో దిల్లీలో గళం వినిపిస్తాం: రామకృష్ణ
- మోదీ పాకిస్థాన్ ఏజెంట్: శ్రీనివాసరావు
- పెండింగ్ విభజన హామీలు అమలు చేయాలి: చలసాని
- రాష్ట్రవ్యాప్తంగా నిరసన దీక్షలు చేపట్టిన ఉద్యమకారులు

విశాలాంధ్ర బ్యూరో– అమరావతి: పదేళ్లు పూర్తి కావస్తున్నా రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీలు అమలు చేయకపోవడంపై ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తక్షణమే స్పందించాలని విపక్ష నేతలు డిమాండ్ చేశారు. మహాత్మాగాంధీ వర్ధంతిని పురస్కరించుకొని ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి అధ్వర్యాన మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా దీక్షలు చేపట్టారు. దీనిలో భాగంగా విజయవాడ లెనిన్ సెంటర్‌లో ఆంధ్రప్రదేశ్ ప్రజల హక్కుల ఆత్మగౌరవం దీక్ష జరిగింది. తొలుత సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి అనంతరం దీక్షలు ప్రారంభించారు. ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి ఎన్టీఆర్ జిల్లా కన్వీనర్ దోనేపూడి శంకర్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో రామకృష్ణ మాట్లాడుతూ పదేళ్లుగా ప్రత్యేక హోదా గురించి పోరాటం చేస్తున్నా కేంద్రం పట్టించుకోవటం లేదని విమర్శించారు. పార్లమెంట్‌లో ప్రత్యేక హోదాపై ప్రశ్నించినందుకు మోదీ ప్రభుత్వం ఎంపీ గల్లా జయదేవ్ కంపెనీపై ఈడీ దాడులు చేయించటం దుర్మార్గమన్నారు. అమర్‌రాజా కంపెనీలో 15 వేల మంది పని చేస్తుంటారని, వేల కోట్ల ఆస్తి కలిగిన వ్యక్తి స్వేచ్ఛగా మాట్లాడే పరిస్థితి లేకపోవటం బాధాకరమన్నారు. ప్రత్యేక హోదాపై మోదీ మాట మార్చలేదని, ఎవరో చిట్టీ రాసిస్తే తిరుపతి సభలో చదివారని బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు కిషన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను రామకృష్ణ తప్పుబట్టారు. ఆ మాత్రం తెలియని దద్దమ్మ పక్కన కూర్చోవాలా అని ప్రశ్నించారు. తమరి గురువు ఎం.వెంకయ్య నాయుడు పార్లమెంట్‌లో ఏపీకి ప్రత్యేక హోదా ఐదేళ్లు కాదు... పదేళ్లు కావాలని కోరిన విషయం గుర్తుందా అని మోదీని నిలదీశారు. చీటీ రాసిస్తే మాట్లాడటానికి మోదీ ఏమైనా చిన్నా చితకా నాయకుడా అని ధ్వజమెత్తారు. ప్రత్యేక ప్యాకేజీ తీసుకున్న చంద్రబాబును ప్రజలు దూరం పెట్టారని గుర్తుచేశారు. తమ పార్టీ తరపున పోటీ చేయటానికి వేల సంఖ్యలో దరఖాస్తులు వస్తున్నాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి చెప్పటం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. నోటా కంటే తక్కువ ఓట్లు

- మిగతా 2 లో

ఇమ్రాన్ ఖాన్‌కు
పదేళ్ల జైలు

సైఫర్ కేసులో ఖురేషికి కూడా
ఎన్నికలకు ముందు పీటీఐకి షాక్

ఇస్లామాబాద్: పాకిస్థాన్ మాజీ ప్రధాన మంత్రి ఇమ్రాన్ ఖాన్‌కు సైఫర్ కేసులో పదేళ్ల శిక్ష విధిస్తూ ప్రత్యేక న్యాయస్థానం తీర్పునిచ్చింది. విదేశాంగశాఖ మాజీ మంత్రి షా మహమూద్ ఖురేషీకి కూడా ఇదే శిక్ష విధించింది. అధికార రహస్యాలు బయట పెట్టినందుకు ఈ శిక్ష పడింది. దీంతో సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో పాకిస్థాన్ తెహ్రీక్ ఏ ఇన్సాఫ్ (పీటీఐ)కు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆ పార్టీ ఎన్నికల చిహ్నం రద్దు కాగా అభ్యర్థులంతా స్వతంత్రులుగా బరిలో దిగాల్సిన పరిస్థితి ఏర్పడింది. తాజా పరిణామాలపై పాకిస్థాన్ తెహ్రీక్ ఎ ఇన్సాఫ్ (పీటీఐ) అధికార ప్రతినిధి మాట్లాడుతూ 'ఇమ్రాన్ ఖాన్, షా మహమూద్ ఖురేషీకి సైఫర్ కేసులో పదేళ్ల జైలు శిక్ష ఖరారైంది' అని తెలిపారు. తాజా తీర్పును ఉన్నత న్యాయస్థానంలో సవాల్ చేస్తామని పార్టీ వర్గాలు తెలిపాయి. తాజా పరిణామంపై మానవ హక్కుల కార్యకర్త, రాజకీయ విశ్లేషకుడు తౌసీఫ్ అహ్మద్ ఖాన్ స్పందిస్తూ 'న్యాయాన్ని ఖూనీ చేశారు' అని అన్నారు. ఇంత అన్యాయం జరుగుతుండటం వల్ల ఆయనకు సానుభూతి, ప్రజాదరణ అనేక రెట్లు పెరగబోతోందన్నారు. గతేడాది ఆగస్టులో అరెస్టు అయిన ఇమ్రాన్ ఖాన్ ప్రస్తుతం జైల్లోనే

- మిగతా 2 లో

సమ్మె హక్కు కాపాడుకుందాం

2లో

ఇదీ లోకం!

పాపం ఈయనకి ఎలాగైనా సీటు కావాలట!

ఎంపీల సస్పెన్షన్
ఎత్తివేత

న్యూదిల్లీ: పార్లమెంటు శీతాకాల సమావేశాలలో 146 మంది విపక్ష ఎంపీలపై విధించిన సస్పెన్షన్‌ను బడ్జెట్ సమావేశాలకు ముందు ఎత్తివేశారు. 146 మంది ఎంపీల సస్పెన్షన్ ఎత్తివేసినట్లు పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషి వెల్లడించారు. అఖిలపక్ష సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ గత సమావేశాల్లో సస్పెండ్ అయిన ఎంపీలు బడ్జెట్ సమావేశాలకు హాజరవుతారని చెప్పారు. 'సస్పెన్షన్లు ఎత్తివేశాం. ఎంపీలపై సస్పెన్షన్ ఎత్తివేయాలని ప్రభుత్వం తరపున లోక్‌సభ స్పీకర్, రాజ్యసభ చైర్మన్‌కు విజ్ఞప్తి చేశాం. ఎంపీలకు అవకాశమివ్వాలని కోరాం. అందుకు వారు అంగీకరించారు' అని జోషి తెలిపారు. శీతాకాల సమావేశాలప్పుడు నిబంధనలు అతిక్రమించారన్న సాకుతో ప్రతిపక్షాల ఎంపీలను మోదీ సర్కారు నిర్దాక్షిణ్యంగా సస్పెండ్ చేసింది. బడ్జెట్ సమావేశాల ప్రారంభం రోజు బుధవారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఉభయసభలనుద్దేశించి ప్రసంగిస్తారు. ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ గురువారం మధ్యంతర బడ్జెట్ ప్రవేశపెడతారు. ఫిబ్రవరి 9 వరకు బడ్జెట్ సమావేశాలు జరుగుతాయి. సార్వత్రిక ఎన్నికల తర్వాత ఏర్పడే కొత్త ప్రభుత్వం పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెడుతుంది.

రూ.22,302 కోట్ల పెట్టుబడులు

ఇంధనరంగంలో 5,300 మందికి ఉద్యోగాలు
సీఎం జగన్ అధ్యక్షతన ఎస్ఐపీబీ ఆమోదం

విశాలాంధ్ర బ్యూరో– అమరావతి: ఇంధనరంగంలో రూ.22,302 కోట్ల పెట్టుబడులు పెట్టాలని రాష్ట్ర పెట్టుబడుల అభివృద్ధి బోర్డు(ఎస్ఐపీబీ) సమావేశం నిర్ణయించింది. దీనివల్ల దాదాపు ప్రత్యక్షంగా 5,300 మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని అంచనా వేసింది. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అధ్యక్షతన క్యాంపు కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశం వివిధ ప్రాజెక్టులకు ఆమోదం తెలిపింది. 3350 మెగావాట్ల సోలార్ ప్రాజెక్టులను రూ.12,065 కోట్లతో రాష్ట్రంలో ఏర్పాటు చేయనున్నారు. జేఎస్‌డబ్ల్యూ నియో ఎనర్జీ లిమిటెడ్ కంపెనీ అధ్వర్యాన వైయస్సార్ జిల్లా చక్రాయపేట వద్ద 400 మెగావాట్లు, సత్యసాయి జిల్లా ముదిగుబ్బవద్ద 1050 మెగావాట్లు, అనంతపురం జిల్లా కనగానపల్లె, రాప్తాడుల్లో 1050 మెగావాట్లు, అనంతపురం జిల్లా డి.హీరేహాళ్,

- మిగతా 2 లో

15 మందికి మరణశిక్ష

బీజేపీ నేత హత్య కేసులో కేరళ కోర్టు తీర్పు

అలప్పుజ: కేరళ లో రెండేళ్ల క్రితం సంచలనం సృష్టించిన బీజేపీ నాయకుడి హత్య కేసులో అలప్పుజ సెషన్స్ కోర్టు మంగళవారం తుది తీర్పు వెలువరించింది. ఈ కేసులో దోషులుగా తేలిన 15 మందికి మరణశిక్ష విధించింది. వీరంతా నిషేధిత పీఎఫ్ఐ సంస్థకు చెందిన కార్యకర్తలు. ఒక కేసులో ఇంత ఎక్కువ మందికి మరణశిక్ష విధించడం కేరళ చరిత్రలో ఇదే తొలిసారి. నిందితుల్లో 8 మందిపై హత్య అభియోగాలు, మిగతా వారిపై కుట్ర ఆరోపణలు రుజువైనట్లు కోర్టు తెలిపింది. వీరంతా శిక్షణ పొందిన కిల్లర్ స్క్వాడ్ అని, బీజేపీ నేతను ఆయన కుటుంబం కళ్లముందే అతి దారుణంగా చంపేశారని ప్రాసిక్యూషన్ పేర్కొంది. అత్యంత క్రూరమైన నేరంగా దీన్ని పరిగణించి దోషులకు గరిష్ఠ శిక్ష విధించాలని న్యాయస్థానాన్ని కోరింది. వాదనలు విన్న ధర్మాసనం... దోషులకు మరణశిక్ష విధిస్తూ తీర్పు వెలువరించింది. 2021 డిసెంబరు 19న అలప్పుజలో బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి రంజిత్ శ్రీనివాసన్‌ను హత్య చేశారు. పీఎఫ్ఐ, ఎస్డీపీఐ

- మిగతా 2 లో

నెతన్యాహును తొలగించాలి

- వెంటనే ఎన్నికలు నిర్వహించాలి
- గాజాలో కాల్పులు విరమించాలి - బందీలను విడిపించాలి
- ఇజ్రాయిల్ ప్రజల డిమాండ్ - రోడ్డెక్కిన వేలాది మంది
- రక్షణశాఖ కార్యాలయం ఎదుట ఆందోళన- ఉద్రిక్తత

టెల్అవీవ్: నెతన్యాహును తొలగించాలి, దేశంలో వెంటనే ఎన్నికలు నిర్వహించాలన్న నినాదాలు ఇజ్రాయిల్ దేశవ్యాప్తంగా మార్మోగాయి. గాజాలో మారణహోమాన్ని, కాల్పుల విరమణను తక్షణమే నిలిపివేయాలని, బందీలుగా ఉన్న తమ వారిని విడిచిపెంచి, సురక్షితంగా ఇంటికి చేర్చాలన్న డిమాండ్లు వినిపించాయి. ఇజ్రాయిల్ ప్రభుత్వం తీరకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా భారీ ఎత్తున ప్రదర్శనలు, ఆందోళనలు జరిగాయి. వేలాది మంది రోడ్లపైకొచ్చి తమ నిరసన, ఆగ్రహాన్ని వ్యక్తంచేశారు. టెల్ అవీవ్‌లోని హబీమా స్క్వేర్, హైఫాలోని హోరేవ్ సెంటర్, జెరూసలేం, కార్కుర్ జంక్షన్, బీర్ షేవా, రెహోవోట్, నెస్ ట్రిజోనా, కఫర్ సబా, సియాసారియా తదితర ప్రాంతాల్లో తక్షణమే ఎన్నికలు జరపాలన్న డిమాండు మార్మోగింది. టెల్ అవీవ్‌లోని హోస్టేజ్ స్క్వేర్, ఎయిలెట్‌లో భారీస్థాయిలో ప్రదర్శనలు జరిగాయి. గాజా ప్రజలకు ప్రదర్శనకారులు సంఘీభావం ప్రకటించారు. నిర్బంధంలో ఉన్న వారిని తక్షణమే విడిపించి ఇంటికి చేర్చాలని డిమాండ్ చేశారు. టెల్ అవీవ్‌లోని రక్షణ కార్యాలయం ఎదుట ధర్నా జరిగింది. తక్షణమే కాల్పులను విరమించాలన్న డిమాండ్‌తో కప్లన్ వీధి దద్దరిల్లింది. రోడ్డును దిగ్బంధించేందుకు ఆందోళనకారులు అనేకమార్లు యత్నించగా వారిని పోలీసులు అడ్డుకున్నారు. దీంతో అక్కడ ఘర్షణ జరిగి ఉద్రిక్తత నెలకొంది. ఐదుగురు అరెస్టుకు గురయ్యారు. బందీలను విడిపించాలంటూ జెరూసలేంలో

మహిళల ప్రదర్శనలను పోలీసులు అడ్డుకున్నారు. పారిస్ స్క్వేర్ దిగ్బంధనాన్ని భగ్నం చేశారు. మహిళా నిరసనకారులను పోలీసులు బలవంతంగా ఈడ్చుకొని వెళ్లడం, వారిని కాళ్లతో చేతులతో కొట్టడం వంటి దృశ్యాలతో వీడియో వైరల్ అయింది. పోలీసుల దెబ్బలతో ఓ మహిళ తీవ్ర వెన్ను నొప్పితో ఆసుపత్రిపాలయ్యారు. హైఫాలోని హోరేవ్ సెంటర్‌లో రెండు వేల మంది ఆందోళనకు దిగారు. నెతన్యాహును గద్దె దించాలని డిమాండ్ చేశారు. నెతన్యాహు మంకు పట్టు వల్ల సైనికులు, నిర్బంధానికి గురైన వారు తమ ప్రాణాలను కోల్పోతున్నారని, తక్షణమే ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నామంటూ నిరసనకారులు తెలిపారు. '113 రోజులకుపైగా పోరు కొనసాగుతోంది. 1400 మంది ప్రాణాలు కోల్పోయారు. 1600 మందికిపైగా గాయాలపాలయ్యారు. ఇక దీనికి ముగింపు దిశగా చర్యలు అవసరమ'ని షీన్‌బెట్ మాజీ అధ్యక్షుడు కార్మి గిల్లన్ అన్నారు. ఈ పరిస్థితులు మారకపోతే ప్రతి ఇజ్రాయిలీ మూల్యం చెల్లుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

సమ్మె హక్కు కాపాడుకుందాం

కార్మిక వ్యతిరేక చట్టాలను తిప్పికొడదాం

బ్రిటన్ కార్మిక సంఘాల పిలుపు

చెల్టెన్‌హామ్‌లో భారీ ప్రదర్శన - కమ్యూనిస్టు పార్టీ మద్దతు

చెల్టెన్‌హామ్: కార్మికులను యాజమాన్యాలు శాశించే విధంగా, యూనియన్లను నిర్వీర్యం చేసే విధంగా తీసుకు వచ్చిన కార్మిక వ్యతిరేక చట్టాన్ని తిప్పికొట్టాలని బ్రిటన్ కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి. సమ్మె హక్కును కాపాడుకుందామన్న పిలుపుతూ గ్లౌసెస్టర్‌షైర్‌లోని చెల్టెన్‌హామ్‌లో భారీ నిరసన ప్రదర్శన నిర్వహించాయి. ప్రదర్శనలో బ్రిటన్ కమ్యూనిస్టు పార్టీ (సీపీబీ) నాయకులు పాల్గొని సంఘీభావం ప్రకటించారు. 'కార్మిక సంఘాల స్వేచ్ఛ కోసం ప్రజా ఉద్యమం తప్పబోదు. బ్రిటన్‌లోని పాలక పక్షం తీసుకొచ్చిన కార్మిక వ్యతిరక-యూనియన్ వ్యతిరేక చట్టాలన్ని రద్దు చేయాలని ప్రచారోద్యమం చేపట్టాలి. ప్రధాన కార్మిక సంఘాల అధ్వర్యంలో భారీ ప్రచారాన్ని నిర్వహించడం అవసరం. పౌర స్వేచ్ఛలు, హక్కులపై దాడులను తిప్పికొట్టాలి. టోరీ యూనియన్ వ్యతిరేక చట్టాలను ప్రతిఘటిస్తూ సమ్మె హక్కును పరిరక్షించుకోవాలి' అని బ్రిటన్ కమ్యూనిస్టు పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. తమ హక్కులు, స్వేచ్ఛను హరించే విధంగా తీసుకొచ్చిన చట్టాన్ని తిప్పికొట్టాలని బ్రిటన్ కార్మిక సంఘాలు సంకల్పించాయి. దీంతో పోరుబాట పట్టాయి. యాంటీ-స్రైక్ చట్టానికి వ్యతిరేకంగా కార్మిక సంఘాల అధ్వర్యంలో వేలాది మంది కదం తొక్కారు. 'సమ్మె హక్కును పరిరక్షించాలి' అని నినదించారు. భారీ బ్యానర్లతో ప్రదర్శనలో పాల్గొన్నారు. మార్గరెట్ టాచర్ శకంలో చెల్టెన్‌హామ్ ఇంటెలిజెన్స్ సంస్థ 'జీసీహెచ్‌క్యూ'లో యూనియన్ రద్దునకు 40ఏళ్లు అయిన సందర్భంగా నిర్వహించిన నిరసన ర్యాలీలో యునైట్ ది యూనియన్, ఫైర్ బ్రిగేడ్స్

యూనియన్ (ఎఫ్‌బీయూ), యూనివర్సిటీస్ అండ్ కాలేజెస్ యూనియన్ (యూసీసీ), పబ్లిక్ అండ్ కమర్షియల్ సర్వీసెస్ (పీసీఎస్) యూనియన్, మేరిటైమ్, ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ (ఆర్ఎంటీ), ది నేషనల్ యూనియన్ ఆఫ్ రైల్, ఏఎస్ఎల్ఈఎఫ్ యూనియన్లు సమ్మెలో పాల్గొన్నాయి. గాజాలో ఇజ్రాయిల్ మారణహోమాన్ని నిరసించాయి. పలస్తీనియన్లకు సంపూర్ణ సంఘీభావాన్ని కార్మికులు ప్రకటించాయి. 'యునైట్ ది యూనియన్' ప్రధాన కార్యదర్శి షారోన్ గ్రాహమ్ సమ్మెనుద్దేశించి మాట్లాడుతూ 'ప్రస్తుత ప్రభుత్వమే దేశ భద్రతకు నిజమైన ముప్పు. మన పరిశ్రమలను నిర్వీర్యం చేస్తోంది. మన జల-విద్యుత్ వనరులను లాభాల కోసం దారాదత్తం చేసింది. స్టీల్ పరిశ్రమ నాశనం చేసింది' అని ఆగ్రహం వ్యక్తంచేశారు. 'ది మినిమమ్ సర్వీస్ లెవన్ యాక్ట్' ద్వారా ప్రభుత్వానికి, కార్మికులకు మధ్య ప్రత్యక్ష యుద్ధం నెలకొన్నదన్నారు. యూనియన్‌ను వ్యతిరేకించే యాజమాన్యాలను అడ్డుకుంటామని తేల్చిచెప్పారు. విజయం సిద్ధించే వరకు తమ పోరు ఆగబోదని ప్రభుత్వానికి తేల్చిచెప్పారు.

15 మందికి మరణశిక్ష

(మొదటిపేజీ తరువాయి)

కార్యకర్తలు అతని ఇంట్లోకి చొరబడి చంపేశారు. ఈ ఘటనపై దర్యాప్తు చేపట్టిన పోలీసులు కొందరిని అరెస్టు చేశారు. దీనిపై విచారణ జరిపిన అదనపు సెషన్స్ కోర్టు... ఈ కేసులో 15 మందిని దోషులుగా నిర్ధారించింది. ఆ ఏడాది డిసెంబరు 18న సోషల్ డెమోక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా (ఎస్‌డీపీఐ) నాయకుడు కేఎస్ షాన్ ఇంటికి తిరిగి వస్తుండగా ఒక ముఠా చంపేసింది. ఈ ఘటన జరిగిన కొద్ది గంటలకే రంజిత్ హత్య జరగడం అప్పట్లో తీవ్ర కలకలం సృష్టించింది.

ఇమ్రాన్ ఖాన్‌కు పదేళ్ల జైలు

(మొదటిపేజీ తరువాయి)

ఉన్నారు. ఫిబ్రవరి 8న ఎన్నికలు జరగనుండగా ఆయనకు శిక్ష విధించడం చర్చనీయాంశమైంది. ఇమ్రాన్‌కు తోషాఖానా కేసులో శిక్షను ఇస్లామాబాద్ హైకోర్టు నిలిపివేసిన వెంటనే సైఫర్ కేసులో ఆయన అరెస్టు అయ్యారు. రావల్పిండిలోని అడియాలా జైల్లో ఉన్నారు. పాక్ ఫెడరల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ గతేడాది సెప్టెంబరులో ఇమ్రాన్, ఖురేషీలపై చార్జిషీట్ దాఖలు చేసింది. భద్రతా సమస్యల దృష్ట్యా జైల్లోనే ఇమ్రాన్, ఖురేషిని విచారించిన ప్రత్యేక కోర్టు జడ్జి అబ్దుల్ హస్నత్ దుల్కర్నైన్ వారిద్దరిని దోషులుగా తేల్చారు. ఇద్దరికీ పదేళ్ల శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించారు. ఇమ్రాన్ ఖాన్‌పై దాదాపు 150 కేసులున్నాయి. కాగా, అమెరికాలోని పాకిస్థాన్ రాయబార కార్యాలయం 2022 మార్చిలో ఓ కీలక అంశాన్ని పాక్‌కు చేరవేసినట్లు సమాచారం. పీటీఐ ప్రభుత్వాన్ని పడగొట్టేందుకు అమెరికా నుంచి ముప్పు పొంచి ఉందన్నది దాని సారాంశం. అదే ఏడాది అభిశంసన కారణంగా ఇమ్రాన్ ప్రధాని పదవిని పోగొట్టుకున్నారు. దీనికిముందు ఓ బహిరంగ సభ నిర్వహించారు. తమ ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరిగిన విదేశీ కుట్రకు ఆధారం ఇదిగోనంటూ కొన్ని పత్రాలను ఆయన చూపించారు. అమెరికాలోని పాక్ రాయబార కార్యాలయం నుంచి వాటిని సేకరించినట్లు ఇమ్రాన్ తెలిపారు. దీంతో అధికారిక రహస్యాల చట్టాన్ని ఉల్లంఘించారనే ఆరోపణలు ఆయనపై వచ్చాయి. ఇదే కేసులో వీరికి శిక్ష ఖరారైంది.

ఆచార్య వెలమల సిమ్మన్న రచనలు అద్భుతం

గ్రంథావిష్కరణ సభలో వక్తలు

విశాలాంధ్ర-విశాఖ: ఆచార్య వెలమల సిమ్మన్న రాసిన రావిశాస్త్రి రచనలు-అభ్యుదయ దృక్పథం అనే 90వ గ్రంథాన్ని మద్రాస్ విశ్వవిద్యాలయ తెలుగు శాఖాధ్యక్షులు ఆచార్య విస్తాలి శంకరరావు మంగళవారం ఆంధ్ర విశ్వకళాపరిషత్ తెలుగు విభాగం సమావేశమందిరంలో ఆవిష్కరించారు. సిమ్మన్న రాసిన ఇతర గ్రంథాల మాదిరగా పోటీ పరీక్షలకు ఎంతోగానో ఈ గ్రంథం ఉపయోగపడుతుందని శంకరరావు అన్నారు. రావిశాస్త్రి రచనల్లోని సామాజిక చైతన్యం గురించి వివరించారు. ఆచార్య వెలమల సిమ్మన్న ఈ గ్రంథాన్ని ఆంధ్ర విశ్వకళాపరిషత్ తెలుగు శాఖాధ్యక్షులు ఆచార్య జర్రా అప్పారావుకి అంకితం ఇచ్చారు. అప్పారావు మాట్లాడుతూ విద్యార్థులకు, పరిశోధకులకు, అధ్యాపకులకు ఎంతోగానో ఇది ఉపయోగపడుతుందన్నారు. ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు మాట్లాడుతూ సిమ్మన్న ఇలాంటి మంచి గ్రంథాలు రాసి తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేశారన్నారు. సమైక్య భారతి జాతీయ సమన్వయకర్త పి.కన్నయ్య, డా.బూసి వెంకటస్వామి, డా.అన్నంశెట్టి ఈశ్వరమ్మ, డా.పెండ్యాల లావణ్య, డా.కట్టిపోగు రత్నశేఖర్, డా.ఆతుకూరి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

'ఏటీసీ' క్లియరెన్స్ రాకుండానే టేకాఫ్...

న్యూఢిల్లీ: 'ఇండిగో' విమానయాన సంస్థ తరచూ చిక్కుల్లో పడుతోంది. ఇటీవల ముంబై ప్రయాణికులంతా విమానం పక్కనే నేలపై కూర్చొని భోజనం చేసిన ఘటన మరువకముందే ఏటీసీ క్లియరెన్స్ లేకుండానే విమానం టేకాఫ్ అయిన మరో ఘటన ఢిల్లీ విమానాశ్రయంలో చోటుచేసుకుంది. ఇండిగో విమానం (6 ఇ 1803) ఈనెల 28వ తేదీ సాయంత్రం ఢిల్లీ నుంచి అజర్‌బైజాన్ రాజధాని బాకుకు బయల్దేరింది. టేకాఫ్‌కు ముందు అవసరమైన ఏటీసీ క్లియరెన్స్‌ను పైలట్లు తీసుకోలేదు. కానీ పైలెట్లు ఆ అనుమతులు పొందలేదు. దీంతో వారిని విధుల నుంచి తప్పించినట్లు ఓ అధికారి వెల్లడించారు. ఈ వ్యవహారంలో డీజీసీఏ దర్యాప్తు జరుగుతోందన్నారు. ఏదైనా విమానం టేకాఫ్‌కు ముందుగా ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్ (ఏటీసీ) అనుమతులు తప్పనిసరిగా పొందాల్సి ఉంటుంది. డీజీసీఏ ఆదేశాలకు కట్టుబడతామని ఇండిగో వెల్లడించింది.

యుద్ధానికి సన్నద్ధం

(మొదటిపేజీ తరువాయి)

పెంచే అవకాశం ఉంది. దీంతో ప్రభుత్వంపై రూ.12 వేల కోట్ల భారం పడనుంది. ప్రస్తుత సమావేశాల్లో 19 బిల్లులు ఆమోదించే అవకాశం ఉంది. కాగా, ఆర్థిక మంత్రిగా వరసగా ఆరోసారి నిర్మలా సీతారామన్ బడ్జెట్ సమర్పిస్తున్నారు. ఐదుసార్లు పూర్తిస్థాయి బడ్జెట్ సమర్పించారు. ఈసారి ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ప్రతిపాదిస్తారు. వరసగా ఆరోసారి బడ్జెట్ సమర్పించిన మహిళా నేతగా నిర్మలా సీతారామన్ రికార్డు సృష్టించారు. మాజీ ప్రధానమంత్రి మొరార్జీ దేశాయ్ అత్యధికంగా పదిసార్లు బడ్జెట్ ప్రవేశపెట్టారు. ఆ తర్వాత స్థానంలో నిర్మలా సీతారామన్ నిలుస్తారు. అరుణ్ జైట్లీ, పి చిదంబరం, యశ్వంత్ సిన్హా, మన్మోహన్ సింగ్ ఐదుసార్లు బడ్జెట్ ప్రవేశ పెట్టారు. మాజీ ప్రధానమంత్రి ఇందిరా గాంధీ బడ్జెట్ ప్రవేశపెట్టారు. ఇందిరా తర్వాత బడ్జెట్ ప్రతిపాదించిన మహిళా నేతగా నిర్మలా సీతారామన్ నిలిచారు.

ప్రతి అంశంపై చర్చకు సిద్ధం: కేంద్రం

న్యూఢిల్లీ: జనవరి 31 నుంచి ప్రారంభం కానున్న పార్లమెంటు సమావేశాల్లో ప్రతీ అంశాన్ని చర్చించేందుకు సిద్ధంగా ఉన్నామని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో ఏర్పాటుచేసిన అఖిలపక్ష భేటీలో వివిధ పార్టీల ఫ్లోర్ లీడర్లతో ఈ విషయాన్ని ప్రభుత్వం చెప్పింది. ప్రభుత్వం తరపున రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్, పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి, మంత్రి అర్జున్‌రామ్ మేఘవాల్ హాజరయ్యారు. మల్లికార్జున ఖర్గే తరపున హాజరైన కాంగ్రెస్ నేత ప్రమోద్ తివారీ మీడియాతో మాట్లాడారు. రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో న్యాయయాత్ర సందర్భంగా అసోంలో జరిగిన ఘర్షణను ఈ భేటీలో లేవనెత్తినట్లు చెప్పారు. జార్ఖండ్ సీఎం హేమంత్ సొరెన్, ఆర్జేడీ అధినేత లాలూప్రసాద్ యాదవ్ వంటి నేతలను కేంద్ర దర్యాప్తు సంస్థలు లక్ష్యంగా చేసుకుంటున్నాయని ఆరోపించారు. సీబీఐ, ఈడీలను ప్రభుత్వం దుర్వినియోగం చేస్తోందన్నారు. ఈ భేటీలో పాల్గొన్న వివిధ పార్టీల సభ్యులు అనేక అంశాలను ప్రస్తావించారు. 31 నుంచి ఫిబ్రవరి 9 వరకు పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు నిర్వహించనున్నారు. సార్వత్రిక ఎన్నికల ముందు జరిగే చివరి సమావేశాలు ఇవే. లోక్‌సభ ఎన్నికల అనంతరం ఏర్పడే కొత్త ప్రభుత్వం పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెడుతుంది.ప్రతి పార్లమెంటు సమావేశాల ముందు అఖిలపక్ష సమావేశాన్ని కేంద్రం ఏర్పాటు చేయడం సంప్రదాయంగా కొనసాగుతోంది. కాంగ్రెస్ తరపున కె.సురేశ్, తృణమూల్ నేత సుదీప్ బందోపాధ్యాయ, డీఎంకే నేత టీఆర్ బాలు, శివసేన తరపున రాహుల్ శెవాలే, ఎస్పీ నేత ఎస్‌టీ హసన్, జేడీయూ నేత రామ్‌నాథ్ ఠాకూర్, టీడీపీ తరపున గల్లా జయదేవ్, వైసీపీ తరపున సత్యవతి తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

హోదా సాధనే లక్ష్యం

(మొదటిపేజీ తరువాయి)

వచ్చిన పార్టీ నుంచి పోటీ చేయటానికి ఎవరూ ముందుకు రారన్న విషయం ప్రజలకు తెలియదా అని ప్రశ్నించారు. ఒక వేళ అదానీ డబ్బులు ఇస్తాడనే ఆశతో సీట్లు ఆడుగుతున్నారేమోనని సందేహం వెలిబుచ్చారు. రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయంపై ముఖ్యమంత్రి స్పందించాలన్నారు. ప్రత్యేక హోదా, విభజన హామీల కోసం ఢిల్లీలో గళం వినిపిస్తామని స్పష్టం చేశారు.

వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ రామరాజ్యం తెస్తామని చెపుతున్న ముష్కరులు మహాత్మాగాంధీని హత్య చేశారని విమర్శించారు. రాముడు కుల, మత, ప్రాంత భేదాలు లేకుండా చూడాలని చెపితే... మోదీ మాత్రం దేశంలో కొందరిని సవతి తల్లి బిడ్డలుగా మార్చారని ఆందోళన వ్యక్తం చేశారు. హిందూమతాన్ని దారుణంగా వంచిస్తున్నారని మండిపడ్డారు. అభివృద్ధి స్థానంలో అయోధ్య వచ్చిందని, భక్తి పర్యాటకంగా మారిపోయిందని విమర్శించారు. బీజేపీని రాష్ట్ర ప్రజలు పక్కన పెడితే టీడీపీ, వైసీపీ, జనసేన పార్టీలు నెత్తిన పెట్టుకుంటున్నాయని దుయ్యబట్టారు. కశ్మీర్‌లో 80 శాతం యువతను ఉగ్రవాదులుగా మార్చిన మోదీ పాకిస్థాన్ ఏజెంట్‌గా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. చంద్రబాబు అయోధ్యకు వెళ్లింది రాముడ్ని దర్శించుకోవటానికి కాదని, మోదీ దర్శనం కోసమే వెళ్లారని విమర్శించారు. ప్రత్యేక హోదా సాధన కోసం జరిగే పోరాటంలో టీడీపీ, వైసీపీ, జనసేన పార్టీలు కలిసి రావాలని కోరారు. ప్రత్యేక హోదా సాధన సమితి అధ్యక్షుడు చలసాని శ్రీనివాస్ మాట్లాడుతూ మహాత్మాగాంధీ వర్ధంతిని ఆనందోత్సాహాలతో జరుపుకునే వర్గం తయారు కావటం బాధ కలిగిస్తున్నదన్నారు. పొట్టి శ్రీరాములు ప్రాణత్యాగంతో తెలుగువారికి ప్రత్యేక రాష్ట్రం, విద్యార్థుల ప్రాణ త్యాగాలతో విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ వచ్చిందన్నారు. ఉత్తరభారత బీజేపీ పాలకులకు అర్థమయ్యేలా ప్రత్యేక హోదా కోసం పోరాటాల్ని ఉధృతం చేస్తామన్నారు. రాష్ట్రంలో భవిష్యత్ తరాలు దెబ్బతినకుండా ఉండేందుకు ప్రత్యేక హోదా, విభజన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకర పద్మశ్రీ మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలోకి వస్తే ఏపీకి ప్రత్యేక హోదాపై మొదటి సంతకం చేస్తానని రాహుల్ గాంధీ వాగ్దానం చేశారని గుర్తు చేశారు. ఆమ్‌ఆద్మీ పార్టీ రాష్ట్ర నాయకులు జీఎస్ ఫణిరాజ్ మాట్లాడుతూ పద్మవిభూషణ్ అవార్డు తీసుకోనున్న మెగాస్టార్ చిరంజీవికి బీజేపీ రాజ్యసభ సీటు

ఇచ్చినట్లైతే ఏపీకి ప్రత్యేక హోదా ఇస్తేనే అభ్యర్థిగా ఉంటానని డిమాండ్ చేయాలని సూచించారు. జై భారత్ పార్టీ నాయకులు ఏకాంబరరావు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, రాష్ట్ర నాయకులు దడాల సుబ్బారావు, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెన్మెత్స దుర్గాభవానీ, సీపీఐ విజయవాడ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అశోక్, డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి రామన్న, అమరావతి జేఏసీ నాయకులు పోతుల బాలకోటయ్య, బెజవాడ బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు సోము కృష్ణమూర్తి, మట్టా జయకర్, పుప్పాల సుబ్బారావు తదితరులు ప్రసంగించారు. తొలుత ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర కోశాధికారి ఆర్.పిచ్చయ్య, ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనీల్ దేశభక్తి, అభ్యుదయ గీతాలు ఆలపించి ఆకట్టుకున్నారు. ఏఐవైఎఫ్ నాయకులు పెయ్యల పృథ్వీ వందన సమర్పణ చేశారు.

ప్రత్యేక హోదా అడగని పార్టీలకు ఓటు అడిగే హక్కు లేదు: జంగాల

ఏపీకి ప్రత్యేక హోదా అడగని ఏ పార్టీకి వచ్చే ఎన్నికల్లో ఓటు అడిగే హక్కు లేదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్ కుమార్ అన్నారు. గుంటూరు కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన దీక్ష నిర్వహించారు. సమితి జిల్లా అధ్యక్షుడు పీవీ మల్లికార్జునరావు అధ్యక్షతన జరిగిన ఈ దీక్షలను జంగాల అజయ్ కుమార్ ప్రారంభించి ప్రసంగించారు. ప్రత్యేక హోదా ఇవ్వని బీజేపీపై రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్ష పార్టీలు కనీస తిరుగుబాటు, విమర్శ కూడా చేయలేని దుస్థితిలో ఉండటం దౌర్భాగ్యమని విమర్శించారు. సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి, ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు వెలుగూరి రాధాకృష్ణమూర్తి, జిల్లా అధ్యక్షుడు ఆకిటి అరుణ్ కుమార్, కార్యదర్శి మేడా హనుమంతరావు, ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కొల్లి రంగారెడ్డి, పచ్చల శివాజీ, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి రెంటాల కుమారి, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు జంగాల చైతన్య, భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పుప్పాల సత్యనారాయణ తదితరులు దీక్షల్లో పాల్గొన్నారు.

విశాఖలో

విశాఖలో జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు అధ్యక్షతన నిరసన దీక్ష చేపట్టారు. ఈ కార్యక్రమంలో జై భారత్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు వీవీ లక్ష్మీనారాయణ, ప్రధానకార్యదర్శి పోతిన వెంకట రామారావు, సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యులు ఏజే స్టాలిన్, జిల్లా కార్యదర్శివర్గసభ్యులు ఆర్‌కే ఎస్‌వీ కుమార్, కాంగ్రెస్ నాయకులు చోడిదాసు సుధాకర్, ఆప్ రాష్ట్ర నాయకురాలు డాక్టర్ సీతల్, ఏయూ విశ్రాంత ఆచార్యులు జేఏ నాయుడు, సీపీఎం నాయకులు కృష్ణారావు, విద్యార్థి నాయకుడు హేమంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భీమవరంలో

భీమవరం ప్రకాశం చౌక్ సెంటర్‌లో రాష్ట్రానికి ప్రత్యేకహోదా, విభజన హామీలు అమలు కోరుతూ గాంధీచిత్ర పటానికి పూలమాలవేసి ఆంధ్రుల హక్కుల ఆత్మ గౌరవ దీక్షను సీపీఐ, సీపీఎం, ఫార్వర్డ్ బ్లాక్, కాంగ్రెస్ నాయకులు చేపట్టారు. సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు, కౌలు రైతుసంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఎం.హరిబాబు, జిల్లా కార్యదర్శివర్గసభ్యులు జేఎన్‌వీ గోపాలన్, సీపీఎం నాయకులు బి.వాసుదేవరావు, ఫార్వర్డ్ బ్లాక్ నాయకులు దండు శ్రీనివాసరాజు, కాంగ్రెస్ నాయకులు తమలంపూడి వంశీమోహన్ తదితరులు పాల్గొన్నారు.

జనసేనకు ఎన్ని సీట్లు ?

(మొదటిపేజీ తరువాయి)

ఎన్నికల పొత్తు, ఆ పార్టీకి ఎన్ని సీట్లు ఇవ్వాలి ? ఏ నియోజకవర్గాలు బలంగా ఉన్నాయి ? అక్కడ బలమైన టీడీపీ అభ్యర్థులను ఏ విధంగా బుజ్జగించాలి ? తదితర అంశాలపై చంద్రబాబు ముఖ్యనేతలతో మంగళవారం సుదీర్ఘ కసరత్తు చేసినట్లు తెలిసింది. ఇంకా ఏఏ రాజకీయ పార్టీలు టీడీపీతో కలసి వస్తాయి. వారికి ఎన్ని సీట్లు కేటాయించాలి? అనే అంశాలు కూడా చర్చకొచ్చాయి. జనసేనకు ఏఏ సీట్లు కేటాయిస్తే విజయం సులువు అవుతుంది? మొత్తం ఎన్ని సీట్లు కేటాయించాల్సి వస్తుంది? అనే అంశాలపై ప్రాథమిక అవగాహనకు వచ్చిన తర్వాత జనసేన అధినేత పవన్ కల్యాణ్‌తో భేటీ అవ్వాలని, సీట్ల సర్దుబాటుతో పాటు ఉమ్మడి మేనిఫెస్టో రూపకల్పనపైనా స్పష్టత ఇవ్వాలని చంద్రబాబు భావిస్తున్నారు. ఫిబ్రవరి నెలాఖరుకే ఎన్నికల షెడ్యూల్ వచ్చే అవకాశం ఉన్నందున మొదటి వారంలో సీట్ల సర్దుబాటు ప్రకటన చేస్తే తర్వాత అసంతృప్తుల్ని బుజ్జగించవచ్చని అనుకుంటున్నారు. పవన్ కల్యాణ్ ఇటీవల రెండు సీట్లు తమ పార్టీ తరపున పోటీ చేయనున్నట్లు ప్రకటించారు. అందులో ఒకటి రాజోలు, రెండోది రాజానగరం. అంతకు ముందు చంద్రబాబు ప్రచార సభల నిర్వహణ సందర్భంగా మండపేట, అరకు నియోజకవర్గాలకు అభ్యర్థుల్ని ప్రకటించారు. ఇది జనసేన పార్టీలో భిన్నాభిప్రాయాలకు కారణమైంది. పొత్తులో ఉండి ఇలా ఏకపక్షంగా సీట్లు కేటాయించుకుని అభ్యర్థుల్ని ప్రకటించుకోవడం ఏమిటని పార్టీ క్యాడర్ అసంతృప్తి వ్యక్తం చేయడంతో పవన్ వారికి సర్ది చెప్పారు. ఇందులో భాగంగా తనకు ఆర్ అంటే ఇష్టమని చెపుతూ రిపబ్లిక్ డే సందర్భంగా ఆర్ అక్షరంతో మొదలయ్యే రాజోలు, రాజానగరం నియోజకవర్గాల నుంచి జనసేన పోటీ చేస్తుందని ప్రకటించారు. దీనిపై తర్వాత పవన్ కల్యాణ్ సోదరుడు నాగేంద్రబాబు చర్య, ప్రతి చర్య అంటూ పోస్టింగ్ పెట్టడం వివాదాస్పదమైంది. ఇటువంటి విభేదాలు పెరగకుండా చూసుకోవాలని రెండు పార్టీల నేతలు ఓ అభిప్రాయానికి వచ్చినట్లుగా తెలుస్తోంది. అయితే టీడీపీ, జనసేన ఎవరెవరు ఎన్ని స్థానాల్లో పోటీ చేయాలన్న అంశంపై ఇప్పటికే ఓ అవగాహనకు వచ్చాయని, అంతర్గతంగా ఏ ఏ సీట్లు అన్నది కూడా ఖరారు చేసుకున్నారని ఆ రెండు పార్టీల్లో ప్రచారం జరుగుతోంది. అభ్యర్థుల అంశంపైనా ఓ అంచనాకు వచ్చారని చెబుతున్నారు. అయితే బీజేపీతో జనసేన పార్టీ చర్చలు జరుపుతోంది. తాము జనసేన పార్టీ పొత్తులో ఉన్నామని బీజేపీ నేతలు చెబుతూ కళ్లెం వేస్తున్నారు. బీజేపీతో పొత్తు పెట్టుకోవడం వల్ల నష్టం జరుగుతుందని టీడీపీ అంచనా వేస్తోంది. అవసరమైతే ఎన్నికల తర్వాత వైసీపీ తరహాలో బీజేపీకి మద్దతిస్తామని, ఎన్నికల పొత్తు మాత్రం కుదరదని టీడీపీ చెపుతోంది. జనసేన మాత్రం బీజేపీని కలుపుకు వెళ్లాలని ప్రయత్నిస్తోంది. ఈ నేపథ్యంలో అధికారికంగా పొత్తుల ప్రకటన చేయడంలో ఆలస్యం అవుతుంది. పవన్ కల్యాణ్ త్వరలో ఢిల్లీ వెళ్లే అవకాశం ఉందని ఆ పార్టీ నేతలు చెపుతున్నారు. ఆ తర్వాతే ఫిబ్రవరి మొదటి వారంలో పొత్తులు, సీట్ల సర్దుబాటు అంశాలపై రెండు పార్టీలు ఓ ప్రకటనచేసే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

ఐదో జాబితాపై ఉత్కంఠ

(మొదటిపేజీ తరువాయి)

ప్రకటన వచ్చాక స్పష్టమయ్యే అవకాశముంది. రాబోయే జాబితాలో అసెంబ్లీకి సంబంధించి ఒకటి, రెండు నియోజకవర్గాల్లో మార్పులు చేస్తారని తెలిసింది. ఇప్పటికే నియమించిన ఇన్‌ఛార్జిలకు వ్యతిరేకంగా సర్వేలు రావడంతో ఈ మేరకు మార్పులు జరగనున్నాయి. ఎమ్మిగనూరు నుంచి బుట్టా రేణుకను సీటు కేటాయించగా, దానిపై అధిష్ఠానం అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. ఈ తరహాగా చిన్నపాటి మార్పులతో ఐదో జాబితా విడుదలకు సీఎం జగన్ సిద్ధం చేస్తున్నారు.

టీడీపీ వైపు వసంత చూపు !

మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ టీడీపీలో చేరేందుకు సిద్ధమైనట్లు తెలిసింది. ఇటీవల ప్రభుత్వంపై ఆయన అసంతృప్తిగా మాట్లాడుతున్న విషయం విదితమే. వసంత మూడు సార్లు సీఎం క్యాంపు కార్యాలయానికి వెళ్లి జగన్‌ను కలిసినప్పటికీ ఆయన అసంతృప్తి వీడలేదు. త్వరలో తాను కార్యకర్తలతో సమావేశమై అన్ని వివరాలను మీడియాకు వెల్లడిస్తానని ప్రకటించారు. ఆయన టీడీపీలోకి వెళ్తే మైలవరం లేదా పెనమలూరు టికెట్ ఇస్తారని సమాచారం. ఇప్పటికే పెనమలూరు వైసీపీ ఎమ్మెల్యే పార్థసారథి టీడీపీలోకి వెళ్లేందుకు సిద్ధమయ్యారు. పెనమలూరు కాకుండా నూజివీడు వెళ్లాలని టీడీపీ ఆదేశించడంతో ఆయనకు దిక్కుతోచడం లేదు. పెనమలూరులో మాజీ ఎమ్మెల్యే బోడే ప్రసాద్ వర్గం సహకరించబోమని చెబుతున్నారు. నూజివీడుకు పార్థసారథి వెళ్తే... అక్కడి ఇన్‌చార్జి ముద్దరబోయిన తన పరిస్థితేమిటని అధిష్ఠానాన్ని నిలదీస్తున్నారు. నూజివీడుకు పార్థసారథి వద్దు అంటూ సామాజిక మాధ్యమాల్లో పెద్ద ఎత్తున ప్రచారం చేస్తున్నారు. దీంతో పార్థసారథి సీటుపై గందరగోళం నెలకొంది. సత్యవేడు వైసీపీ ఎమ్మెల్యే ఆదిమూలం, ఆయన కుమారుడు టీడీపీలోకి వెళ్లేందుకు సిద్ధమయ్యారు. ఆయనకు తిరుపతి ఎంపీ అభ్యర్థిగా అధిష్ఠానం ఎంపిక చేయడంపై అసంతృప్తి చెందుతున్నారు.

తేలని ఒంగోలు ఎంపీ పంచాయితీ

ఒంగోలు ఎంపీ పంచాయితీ ఇంకా కొలిక్కి రాలేదు. సిట్టింగ్ ఎంపీ మాగుంటకు టికెట్ లేదని అధిష్ఠానం తేల్చిచెప్పినప్పటికీ ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసులురెడ్డి మాత్రం ఆయనకు టికెట్ ఇప్పించే దిశగా అధిష్ఠానంపై ఒత్తిడి తెస్తున్నారు. మీ సీటు చూసుకోవాలని, ఒంగోలు ఎంపీని తమకు వదిలేయాలని అధిష్ఠానం ఆయనకు సూచించింది. అయినా ఎంపీ సీటును మాగుంటకు ఇప్పించే దిశగా బాలినేని తన ప్రయత్నాల్ని ముమ్మరం చేశారు. ఒంగోలు ఎంపీ బరిలో మంత్రి రోజా, ఎమ్మెల్యేలు చెవిరెడ్డి, మద్దిశెట్టి వేణుగోపాల్ పేర్లు పరిశీలనలో ఉన్నాయి. నరసరావుపేట ఎంపీ సీటుకు నెల్లూరు టౌన్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్ పేరు ప్రతిపాదించడంతో, ఆయన స్థానంలో ఎమ్మెల్యే అభ్యర్థి ఎంపికపై అధిష్ఠానం కసరత్తు ప్రారంభించింది. గుంటూరు ఎంపీగా కావటి మనోహర్, ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, మచిలీపట్నం ఎంపీగా అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేశ్ పేర్లను పరిశీలిస్తున్నారు. కాకినాడ, అమలాపురం ఎంపీ స్థానాలకు అభ్యర్థులు ఖరారు కావాల్సి ఉంది. కాకినాడకు చలమలశెట్టి సునీల్ పేరును అధికారికంగా ప్రకటించాల్సి ఉంది.

రూ.22,302 కోట్ల పెట్టుబడులు

(మొదటిపేజీ తరువాయి)

బొమ్మనహాళ్‌లో 850 మెగావాట్ల సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. నంద్యాల జిల్లా అవుకు మండలం కునుకుంట్ల, కర్నూలు జిల్లా ప్యాపిలి మండలం జలదుర్గం వద్ద ఇదే కంపెనీ రూ.1287 కోట్ల పెట్టుబడితో 171.60 మెగావాట్ల విండ్ పవర్ ప్రాజెక్టులు ఏర్పాటు చేయనుంది.

శ్రీ సత్యసాయి జిల్లా తలుపుల మండలం పులిగుండ్లపల్లెలో 1000 మెగావాట్ల సోలార్ ప్రాజెక్టను ఆగ్వాగ్రీన్ ఇంజినీరింగ్ మేనేజ్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్ రూ.4వేల కోట్లతో ఏర్పాటు చేయనుంది.

కర్నూలు జిల్లా ఆస్పరి వద్ద 200 మెగావాట్ల విండ్‌పవర్ ప్రాజెక్ట్‌ను ఎక్రోన్ ఎనర్జీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ రూ.1350 కోట్ల ఖర్చుతో ఏర్పాటు చేయనుంది. శ్రీ సత్యసాయి, అనంతపురం జిల్లాల్లో 600 మెగావాట్ల విండ్‌పవర్ ప్రాజెక్ట్‌లను రెన్యూ విక్రం శక్తి ప్రైవేట్ లిమిటెడ్ రూ.3600 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేయనుంది. ఈ సమావేశంలో ఉపముఖ్యమంత్రి (పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ) బూడి ముత్యాలనాయుడు, ఆర్థిక, ప్రణాళిక, శాసనసభా వ్యవహారాలశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, విద్యుత్, అటవీ, పర్యావరణ, భూగర్భగనులశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, పరిశ్రమలు, ఐటీ, పెట్టుబడులశాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్, సీఎస్ డాక్టర్ కేఎస్ జవహర్ రెడ్డి, ఇంధనశాఖ స్పెషల్ సీఎస్ కె.విజయానంద్, గృహనిర్మాణశాఖ స్పెషల్ సీఎస్ అజయ్ జైన్, పర్యాటకశాఖ స్పెషల్ సీఎస్ రజత్ భార్గవ, ఆర్థికశాఖ స్పెషల్ సీఎస్ ఎస్ఎస్ రావత్, జీఏడీ స్పెషల్ సీఎస్ కె.ప్రవీణ్ కుమార్, పరిశ్రమలశాఖ కార్యదర్శి ఎన్.యువరాజ్, పరిశ్రమలు, వాణిజ్యశాఖ ముఖ్యకార్యదర్శి (హేండ్‌లూమ్స్ అండ్ టెక్స్‌టైల్స్) కె.సునీత, రవాణాశాఖ కార్యదర్శి ప్రద్యుమ్న, పరిశ్రమలశాఖ కమిషనర్ సీహెచ్ రాజేశ్వర్‌రెడ్డి, ఎన్ఆర్ఈడీసీఏపీ వీసీ అండ్ ఎండీ ఎస్.రమణారెడ్డి ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

కోల్డ్ స్టోరేజ్ ఘటనపై

సమగ్ర విచారణ

- ముప్పాళ్ల నాగేశ్వరరావు డిమాండ్
- ప్రమాద ప్రాంతానికి అధికారుల బృందం
- మార్కెట్ యార్డులో రైతు నేతలతో భేటీ-అర్జీల స్వీకరణ

విశాలాంధ్ర-దుగ్గిరాల: గుంటూరు జిల్లాలోని శుభం మహేశ్వరి కోల్ట్‌స్టోరేజ్ ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. నష్టపోయిన రైతులకు తగిన పరిహారం ఇవ్వాలని, ప్రతి రైతుకు న్యాయం జరగాలని అన్నారు. ప్రభుత్వం, అధికారుల నుంచి హామీకి సోమవారం వరకు గడువు ఇస్తున్నామని, లేని పక్షంలో బాధిత రైతులందరితో కలసి ఆందోళన చేస్తామని హెచ్చరించారు. 11 మంది అధికారులతో కూడిన బృందం మంగళవారం ఘటనాస్థలాన్ని సందర్శించింది. జరిగిన నష్టం గురించి వివరాలు సేకరించింది. అనంతరం పసుపు మార్కెట్‌యార్డుకు వెళ్లి, అక్కడ రైతు నాయకులు, రైతులతో మాట్లాడింది. వారి అర్జీలు స్వీకరించింది. ఈ సందర్భంగా తెనాలి సబ్‌కలెక్టర్ ప్రఖర్ జైన్ మాట్లాడుతూ కోల్డ్‌స్టోరేజ్‌లో అగ్ని ప్రమాదంపై ఆరాకు ఒక కమిటీని జిల్లా యంత్రాంగం ఏర్పాటు చేసిందన్నారు. అన్ని శాఖల అధికారుల సమన్వయంతో విచారణ జరిపించి, రైతులకు న్యాయం చేస్తామని చెప్పారు. ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలన్నారు. విద్యుదాఘాతంతో ప్రమాదం జరిగిందా లేక ఇతర కారణాలు ఉన్నాయా అనేది తేల్చాలని సూచించారు. ఎంత బీమా చేశారనేదానితో సంబంధం లేకుండా కోల్డ్‌స్టోరేజ్ యజమాని, ప్రభుత్వం బాధ్యత వహించి రైతులకు పూర్తి పరిహారం అందజేయాలని ఆయన డిమాండ్ చేశారు. జిల్లా తెలుగు రైతు అధ్యక్షుడు కళ్లెం రాజశేఖర్ రెడ్డి సమగ్ర దర్యాప్తు నివేదిక త్వరగా అందజేయాలన్నారు. సమావేశంలో మార్కెటింగ్ ఏడీ బి.రాజాబాబు, జిల్లా లేబర్ అధికారి ఎ.గాయత్రీదేవి, ఉద్యాన శాఖ అధికారి బి.రవీంద్రబాబు, వ్యవసాయ శాఖ జిల్లా అధికారి ఎన్.వెంకటేశ్వర్లు, ఇండస్ట్రీస్ జీఎం ఎం.మదనమోహన్ శెట్టి, ట్రైనీ డీఎస్పీ పి.గీతాకుమారి, జిల్లా అదనపు అగ్నిమాపక అధికారి కృష్ణారెడ్డి, లీడ్ బ్యాంకు మేనేజర్ ఆర్.మహిపాల్ రెడ్డి, నాబార్డ్ జీఎం శరత్, పరిశ్రమల శాఖ అధికారి రాంబాబు, తహశీల్దార్ కె.మల్లేశ్వరి, మండల వ్యవసాయ అధికారి పి.శిరీష, మార్కెట్ యార్డ్ కార్యదర్శి ఎన్.శ్రీనివాసరావు, సూపర్‌వైజర్ రాంబాబు, పసుపు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యార్లగడ్డ వెంకటేశ్వరరావు, బాపట్ల జిల్లా రైతు సంఘం నాయకుడు వెంకటరామయ్య, జిల్లా రైతు సంఘం ఉపాధ్యక్షుడు ములక శివసామిరెడ్డి పాల్గొన్నారు.

విశ్వాస ఘాతకుడు నితీశ్ కుమార్

జేవీ సత్యనారాయణమూర్తి విమర్శ

విశాలాంధ్ర బ్యూరో-నెల్లూరు: బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ దేశ చరిత్రలో విశ్వాస రహిత రాజకీయ నాయకుడిగా మిగిలిపోతారని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి విమర్శించారు. నెల్లూరులోని రామకోటయ్య భవన్‌లో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నితీశ్ కుమార్ దేశ ప్రజలకు చేసిన ద్రోహాన్ని సీపీఐ తీవ్రంగా ఖండిస్తున్న దన్నారు. అధికారమే పరమావధిగా నితీశ్ ఎన్‌డీఏ గూటికి చేరారని విమర్శించారు. ప్రత్యర్థి పార్టీలు, నేతలను ఈడీ, సీబీఐతో బెదిరించి... లొంగదీసు కోవడం మోదీ సర్కారుకు నిత్యకృత్యమైందని మండిపడ్డారు. కుట్రలు, కుతంత్రాలు, బెదిరింపులతో ఒక్కశాతం ఓట్లు ఉన్న బీజేపీ...రాష్ట్ర రాజకీయాలను శాసిస్తున్నదన్నారు. అధికార వైసీపీ, ప్రతిపక్ష టీడీపీ...బీజేపీకి తొత్తులుగా మారాయని చెప్పారు. బీజేపీని అధికారం నుండి దింపేందుకు ఇండియా కూటమిలో చేరాలని తెలుగుదేశం పార్టీని కోరుతున్నామన్నారు. బీజేపీతో టీడీపీ పొత్తుకుదుర్చుకుంటే...తన సంప్రదాయ ఓట్లు కూడా రావని, వైసీపీ విజయం తథ్యమని ఆయన స్పష్టంచేశారు. వైసీపీ అరాచకాలు ఎదుర్కొనేందుకు సీపీఐ, సీపీఎం ఇప్పటికే చర్చలు జరిపాయని, జగన్ సీఎంగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ప్రజలపై పన్నుల భారం మోపుతున్నారని, పథకాల పేరుతో కొంచెం ఇచ్చి...ఎక్కువ లాక్కుంటున్నారని జేవీ సత్యనారాయణమూర్తి విమర్శించారు. మద్యపాన నిషేధం హామీని అటకెక్కించారన్నారు. రాష్ట్రంలో మద్యం ఏరులైపారుతోందన్నారు. దేశాన్ని, రాష్ట్రాన్ని కాపాడుకునేందుకు బీజేపీ, వైసీపీలను ఓడించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఆయన చెప్పారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డి.జగదీశ్ మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం అదానీకి రాష్ట్ర సంపదను దోచిపెడుతోందని విమర్శించారు. అందులో భాగంగా నెల్లూరు జిల్లా కృష్ణపట్నం పోర్టులో కంటైనర్ టెర్మినళ్లను తరలించేందుకు సిద్ధమవుతోందన్నారు. ఈ విషయంపై సీఈవో చేసిన ప్రకటనల్లో వాస్తవాలు లేవని జగదీశ్ అన్నారు. కృష్ణపట్నం పోర్టుకు మోదీ, జగన్ శనిగ్రహాలుగా దాపురించారని, పోర్టులో టర్నోవర్ తగ్గి...రాష్ట్ర ఆదాయానికి గండి పడుతున్నా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. పోర్టుకు అవసరమైన మౌలిక వసతులు కల్పించకపోవడం వల్లే టర్నోవర్ పడిపోయిందని తెలిపారు. జిల్లాల విభజన తరువాత నెల్లూరుకు మిగిలింది కేవలం కృష్ణపట్నం పోర్టు మాత్రమేనని, దానిని కూడా తమిళనాడు తరలించేందుకు పాలకులు సిద్ధం కావడం దారుణమన్నారు. దీనిపై ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య, సహాయ కార్యదర్శి మాలకొండయ్య, నగర కార్యదర్శి అరిగెల నాగేంద్ర సాయి పాల్గొన్నారు.

విభజన హామీలు అమలు చేయాలి

ప్రధాని మోదీకి షర్మిల లేఖ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఏపీ పునర్విభజన చట్టంలోని హామీల అమలుకు తక్షణమే కేంద్రం చర్యలు తీసుకోవాలని రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షులు వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ప్రధాని మోదీకి ఆమె లేఖ రాశారు. రాష్ట్ర విభజన సమయంలో ఇచ్చిన హామీలను ఆమె గుర్తుచేశారు. 2014లో తెలంగాణ ఏర్పాటు అత్యవసరమని గుర్తించిన కేంద్ర ప్రభుత్వం... రాష్ట్రాభివృద్ధికి అనేక హామీలిచ్చిందని తెలిపారు. విభజన జరిగి దశాబ్దకాలమవుతున్నా ఏపీకి రాజధాని నగరం లేదని వివరించారు. ఇంతకాలమైనా విభజన హామీలను కేంద్రం అమలు చేయలేకపోయినట్లు ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలతో పాటు చట్టబద్ధంగా ఏపీకి రావాల్సిన హక్కులను సైతం మోదీ సర్కారు విస్మరించిందని షర్మిల తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలను కేంద్ర ప్రభుత్వం మోసగించిందని, ఇది ప్రజలలో బలంగా నాటుకుపోయిందని తెలిపారు. నేడు రాష్ట్రం అయోమయం, గందరగోళంలో ఉందన్నారు. నాటి కాంగ్రెస్ సర్కారు పొందుపరిచిన వాగ్దానాలు అమలు చేయాలని, రాష్ట్రాన్ని ఆదుకునే బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదేనన్నారు. ప్రత్యేక హోదా, పోలవరం ప్రాజెక్టుకు జాతీయ హోదాపై నాటి ప్రభుత్వం పార్లమెంటు సాక్షిగా హామీ ఇచ్చిందని, తదుపరి వచ్చిన మోదీ ప్రభుత్వం వాటిని విస్మరించిందని ఆమె ఆరోపించారు. దీంతో ఆంధ్రప్రదేశ్‌కు అన్నిరంగాల్లో తీవ్ర నష్టం జరిగిందన్నారు. వైఎస్ఆర్ కడప జిల్లాలో స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు చేయలేదని, విశాఖ రైల్వే జోన్ అటకెక్కిందని వివరించారు. వైజాగ్-చెన్నై పారిశ్రామిక కారిడార్ నిర్మించాల్సి ఉందని, కొత్త రాజధాని నిర్మాణానికి మద్దతు ఇవ్వాలని కోరారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణపై కేంద్రం పునరాలోచించాలని విజ్ఞప్తి చేశారు.

జాతిపితకు సీఎం నివాళి

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: జాతిపిత మహాత్మాగాంధీకి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఘనంగా నివాళులర్పించారు. జాతిపిత వర్ధంతి సందర్భంగా మంగళవారం సీఎం క్యాంప్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి సీఎం జగన్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, వైసీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి వీ విజయసాయి రెడ్డి, వైసీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

మోటారు వాహనాల ప్రమాద కేసులపై అవగాహన పొందాలి

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: మోటారు వాహనాల ప్రమాద కేసుల్లో సత్వర న్యాయం అందించేందుకు సంబంధిత విభాగాలన్నీ సుప్రీం తీర్పుపై అవగాహన పొందాలని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ కార్యనిర్వాహక అధ్యక్షులు జస్టిస్ ఏవీ శేషసాయి సూచించారు. రహదారి ప్రమాదాల క్లెయిమ్‌ల పరిష్కారంలో అవగాహన కల్పించేందుకుగాను మంగళవారం అమరాతి సమీపాన కరకట్ట రోడ్డులోని చిగురు చిల్డ్రన్స్ విలేజ్‌లో సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన జస్టిస్ శేషసాయి మాట్లాడుతూ... ప్రమాద బాధితులకు గానీ, వారసులకుగానీ ఇచ్చే పరహారం సత్వరం అందించేందుకు తగిన సూచనలిచ్చారు. ఇందుకోసం సుప్రీం కోరు మార్గదర్శకాలపై పోలీస్,రోడ్డు రవాణా సంస్థ, వివిధ బీమా కంపెనీలు, జిల్లా కోర్టుల్లోని పరిపాలనాధికారులు అవగాహన పొందాలన్నారు. ఈ సదస్సుకు ఏపీ లీగల్ సర్వీసెస్ అథార్టీ సభ్య కార్యదర్శి ఎం.బబిత, ఏపీ జ్యుడిషియల్ అకాడమీ డైరెక్టర్ ఎ.హరి హరనాథశర్మ, రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి పోలీస్, రవాణా శాఖల అధికారులు, జిల్లా కోర్టుల పరిపాలనాధికారులు, వివిధ బీమా కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారు.

ఎన్‌ఆర్ఐ యశస్వికి హైకోర్టులో ఊరట

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఎన్‌ఆర్ఐ యశస్వికి ఏపీ హైకోర్టులో ఊరట లభించింది. తనపై సీఐడీ ఇచ్చిన లుక్ ఔట్ నోటీసును ఎత్తివేయాలని కోరుతూ ఉన్నత న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేశారు. పిటిషనర్‌ను ఇప్పటికే సీఐడీ అరెస్టు చేసి 41ఏ నోటీసు ఇచ్చిందని న్యాయవాది ఉమేశ్ చంద్ర వాదనలు వినిపించారు. అరెస్టు చేసి 41ఏ నోటీసు ఇచ్చిన తర్వాత లుక్ ఔట్ నోటీసు కొనసాగించటం ఆర్టికల్ 21కి విరుద్ధమని పేర్కొన్నారు. ఈ నోటీసు కారణంగా విదేశాలకు వెళ్లాలంటే పిటిషనర్‌కు ఇబ్బందులు ఉంటాయని, కొట్టివేయాలని కోర్టును కోరారు. వాదనలు విన్న ధర్మాసనం సీఐడీ జారీ చేసిన లుక్ ఔట్ నోటీసును రద్దు చేస్తూ బ్యూరో ఆఫ్ ఇమ్మిగ్రేషన్‌కు ఆదేశాలు జారీ చేసింది.

చింతలపూడి ఎత్తిపోతల పూర్తిచేయాలి

రైతు సంఘాల డిమాండ్

విశాలాంధ్ర-నూజివీడు: రెండు లక్షల ఎకరాలకు పైగా సాగుభూములకు సాగునీటిని అందించే లక్ష్యంతో గత ప్రభుత్వ హయాంలో మొదలుపెట్టిన చింతలపూడి ఎత్తిపోతల పథకం ఫేజ్-1, ఫేజ్-2 లను పూర్తి చేయడంలో వైసీపీ ప్రభుత్వం విఫలమైందని రైతు సంఘాల నాయకులు విమర్శించారు. చింతలపూడి ఎత్తిపోతల పథకం పూర్తి చేయాలని కోరుతూ ఏపీ రైతు సంఘం(ఏఐకేఎస్) అధ్వర్యంలో మంగళవారం నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన దీక్ష చేశారు. రైతు సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి కేవీవీ ప్రసాద్, కౌలు రైతు సంఘం కార్యదర్శి పీ జమలయ్య నిరసన కార్యక్రమాన్ని ప్రారంభించగా... టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ ముద్దరబోయిన వెంకటేశ్వరరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ కాపా శ్రీనివాసరావు, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త బర్మా ఫణిబాబు, సీపీఎం రైతు సంఘం జిల్లా నాయకులు నిమ్మగడ్డ నర్సింహ తదితరులు హాజరై తమ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా కేవీవీ ప్రసాద్ మాట్లాడుతూ వైసీపీ పాలనలో ఒక్క ఎకరాకు కూడా అదనంగా నీరందించిన దాఖలాలు లేవన్నారు. ప్రాజెక్టుల కోసం అంటూ బడ్జెట్‌లు ప్రవేశపెడుతూ కాకి లెక్కలు చెబుతున్నారని విమర్శించారు. వేల టీఎంసీల గోదావరి నీరు సముద్రం పాలవుతున్నా పోలవరంపై దృష్టి సారించలేదన్నారు. రాష్ట్రంలోని ప్రధాన ప్రాజెక్టులలో నీటి పరిస్థితి ఆందోళనకరంగా ఉందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా భూగర్భ జలాలు 1.75 మీటర్ల లోతుకు పడిపోయాయని, సరైన జల నిర్వహణ చేయలేని పాలకుల తీరు వల్ల రైతులు తీవ్ర నీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. జమలయ్య మాట్లాడుతూ రివర్స్ టెండర్ల పేరుతో ప్రభుత్వం ప్రాజెక్టు పనులకు బ్రేకులు వేసిందన్నారు. ఈ ప్రభుత్వానికి ప్రజల సమస్యలు, ప్రాజెక్టుల నిర్మాణంపై నిబద్ధత లేదన్నారు. ప్రభుత్వాలు మారినప్పుడు జరుగుతున్న పనులపై సమీక్షలు జరిపి పనులను పూర్తి చేయడానికి ప్రయత్నించాలి కాని పాత ప్రభుత్వంపై ద్వేషంతో ప్రజలను నాశనం చేయకూడదన్నారు. రానున్న రోజులలో తమను వంచించిన ప్రభుత్వానికి బుద్ధి చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య మాట్లాడుతూ పోలవరం ప్రశ్నార్థకంగా మారిందని,చింతలపూడి ఎత్తిపోతల ఊసే లేదన్నారు. ఏ అంశంలోనూ ప్రభుత్వానికి చిత్తశుద్ధిలేదని, ఆదాయమార్గాలు చూడకుండా రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెడుతున్నారన్నారు. రైతు సంఘం సీనియర్ నాయకులు కొమ్మన నాగేశ్వరరావు మాట్లాడుతూ నాబార్డు రుణం ఇవ్వడానికి ముందుకు వచ్చినా చింతలపూడి పథకాన్ని పూర్తి చేయలేకపోయారని, ఈ పథకం లేకుంటే నూజివీడు ప్రాంతానికి భవిష్యత్తు ఉండదని పేర్కొన్నారు. తొలుత మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్రసమితి సభ్యులు చలసాని వెంకటరామారావు, ఏలూరు జిల్లా రైతు సంఘం అధ్యక్ష,కార్యదర్శులు సోమశేఖర్, రాయంకుల లక్ష్మణరావు, కౌలు రైతు నాయకులు దొంతు కృష్ణ, నూజివీడు నియోజకవర్గ రైతు సంఘం కార్యదర్శి మదుపల్లి నాగేంద్రరావు, రైతు నాయకులు కూచిపూడి నాగేశ్వరరావు, బత్తుల వెంకటేశ్వరరావు, సీపీఎం నాయకులు జి.రాజు వివిధ రాజకీయపక్షాలకు చెందిన రైతు నాయకులు పాల్గొన్నారు.

ఏపీఎస్ఆర్టీసీ క్లాస్2 సూపర్‌వైజర్ల డైరీ ఆవిష్కరణ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఏపీఎస్ఆర్టీసీ) క్లాస్2 సూపర్ వైజర్ల డైరీని సంస్థ ఎండీ ద్వారకా తిరుమలరావు మంగళవారం తన ఛాంబరులో ఆవిష్కరించారు. ప్రజా రావాణాలో ఆర్టీసీ పాత్ర ప్రముఖమైనదని, పని తీరులో ఇతర రోడ్డు రవాణా సంస్థల కంటే ఆదర్శనీయమని ఆయనన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ జనరల్ సెక్రటరీ సీహెచ్.వెంకటేశ్వర్లు, అధ్యక్షుడు ఎ.విష్ణారెడ్డి, కార్య నిర్వాహక అధ్యక్షుడు ఎం.సతీశ్ కుమార్‌రెడ్డి, కోశాధికారి బి.పూర్ణచంద్రరరావు, ఉద్యోగులు పాల్గొన్నారు.

'హిట్ అండ్ రన్' నిబంధన రద్దు చేయాలి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: మోటారు వాహనాలకు సంబంధించి ఇటీవల కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన భారతీయ న్యాయ సంహిత 106.2. (హిట్ అండ్ రన్)ను రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జయహో రథసారథి డ్రైవర్ల అసోసియేషన్ కోరింది. ఈ మేరకు విజయవాడ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో మాజీ మంత్రి పల్లంరాజు, ఏఐసీసీ నాయకులు కొప్పుల రాజుకు అసోసియేషన్ అధ్యక్షుడు యేటేటి వాసు, ట్రెజరర్ కిషోర్, గద్దల శ్రీను, నాగరాజు, ఉపేంద్ర, కాజా, శేషు సతీష్, సహదేవరావు, దుర్గా రావు, సాయి, బీముడు, మధు వినతిపత్రం అందజేశారు. కేంద్ర ప్రభుత్వం డ్రైవర్ల సంక్షేమ బోర్డు ఏర్పాటు, డ్రైవర్లను గుర్తించి డ్రైవర్ల దినోత్సవం నిర్వహించేలా కృషి చేయాలని వారు కాంగ్రెస్ నేతలను కోరారు.

15,046 కోర్టు ధిక్కరణ కేసులు

టీడీపీ నేత కాలవ శ్రీనివాసులు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: నాలుగున్నరేళ్ల జగన్‌మోహన్ రెడ్డి పాలనలో 15,046 కోర్టు ధిక్కరణ కేసులు, 30 వేల రిట్ పిటిషన్లు నమోదయ్యాయని, దీనిపై సీఎం సమాధానం చెప్పాలని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు కాలవ శ్రీనివాసులు డిమాండ్ చేశారు. తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడుపై ఇన్నర్ రింగ్ రోడ్ కేసు, ఇసుక, మద్యం కేసులన్నీ అక్రమమేనని ప్రజలు గ్రహించారని తెలిపారు. చంద్రబాబు ప్రతిష్ఠను దెబ్బతీయాలన్న దురుద్దేశంతోనే జగన్ ప్రభుత్వం ఇన్నర్ రింగ్ రోడ్ కేసులో ఆయన బెయిల్ పిటిషన్‌పై సుప్రీంకోర్టుని ఆశ్రయించిందని,. ఒకే కేసులో నిందితులుగా ఉన్న ఇద్దరిలో న్యాయస్థానంలో ఒకరికి లభించిన మినహాయింపు, మరోవ్యక్తికీ లభిస్తుందనే చిన్న విషయం, పెద్దపెద్ద న్యాయనిపుణులు, ప్రజలసొమ్ము జీతంగా తీసుకునే సలహాదారులకు తెలియదా అని ప్రశ్నించారు. ఇప్పటివరకు చంద్రబాబుపై పెట్టిన కేసులు...చేసిన ఆరోపణల్లో ఒక్కదాన్నైనా జగన్ నిరూపించగలిగారాఅని నిలదీశారు. ప్రజలిచ్చిన అధికారాన్ని దుర్వినియోగం చేస్తున్న జగన్ రెడ్డి ప్రజాధనంతో తన దురుద్దేశాలు, రాజకీయ కక్షసాధింపులు నెరవేర్చుకుంటూ అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని ఆరోపించారు. వివిధ సందర్భాల్లో న్యాయస్థానాలు చేసిన వ్యాఖ్యలే అందుకు నిదర్శనమని ఆయన తెలిపారు. అధికారం అడ్డుపెట్టుకొని జగన్ రెడ్డి చేస్తున్న అవినీతి, అక్రమాలు, విధ్వంసాలు, అరాచకాలను ప్రజలు గమనిస్తున్నారని, ఆయనకు త్వరలోనే తగిన గుణపాఠం తప్పదని కాలువ హెచ్చరించారు.

మూడు నెలల్లో జగన్ జైలుకే!

మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: మరో మూడు నెలల్లో ముఖ్యమంత్రి జగన్ జైలుకు వెళ్లడం ఖాయమని టీడీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు అన్నారు. మంగళవారం విశాఖ టీడీపీ కార్యాలయంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగన్ పక్కా 420 అని, జైలుకు వెళ్లడానికే ఆయన భీమిలిలో 'సిద్ధం' సభను నిర్వహించారన్నారు. సభలో జగన్ 'శిలువ' మీద క్యాట్ వాక్ చేశారని ఎద్దేవా చేశారు. ఓటమి పాలవుతానని తెలిసే అర్జునుడినంటూ పైకి గంభీరంగా మాట్లాడారన్నారు. జగన్‌ని విడిచిపెట్టమని హెచ్చరించారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే జగన్ తిన్న డబ్బులన్నింటినీ కక్కిస్తామన్నారు. దళిత యువకుడిని చంపిన వ్యక్తిని పక్కన పెట్టుకొని అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తారా? అని అయ్యన్నపాత్రుడు మండిపడ్డారు. రాజధాని చేస్తానని చెప్పి విశాఖను జగన్ పూర్తిగా దోచేశారని, చివరికి విశాఖ కోడిపుంజులను కూడా పట్టుకుపోయారన్నారు. మేనిఫెస్టోలోని 98 శాతం హామీలు ఎక్కడ అమలు చేశారని ప్రశ్నించారు. ప్రత్యేక హోదా, రైల్వే జోన్ సాధించలేదని... సీపీఎస్ రద్దు, జాబ్ క్యాలెండర్, మద్యపాన నిషేధం వంటివి ఏమీ అమలు చేయలేదన్నారు.

సజ్జల రామకృష్ణ రెడ్డి ఒక దొంగని, అతడు చెప్పేవన్నీ అబద్ధాలే అన్నారు. విశాఖలో గాదిరాజు ప్యాలెస్ మీద కూడా కన్నేశారని, భారతికి నచ్చితే ఆ ప్యాలెస్‌ని కొట్టేస్తారా అని అయ్యన్న ప్రశ్నించారు. అనకాపల్లిలో వైసీపీ నేతలు 1200 ఎకరాలకు భూ కుంభకోణాలకు పాల్పడ్డారని, తాను కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయిందని వాపోయారు. ఈ భూ కుంభకోణాలపై సీబీఐ పూర్తి స్థాయిలో విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. అవసరమైతే న్యాయం కోసం న్యాయస్థానానికి కూడా వెళ్తానన్నారు.

షర్మిలను కూడా చంపేస్తారేమో...

జగన్ చాలా దుర్మార్గుడని... అతనికి తల్లి, చెల్లి, బాబాయ్ అందరూ ఒక్కటేనని, అధికారం కోసం ఏమైనా చేస్తాడని అయ్యన్న పాత్రుడు అన్నారు. జగన్‌కు వ్యతిరేకంగా షర్మిల గట్టిగా మాట్లాడుతున్నారని, బాబాయిని చంపినట్లు షర్మిలను చంపుతారని నాకు అనుమానం ఉందని అయ్యన్న సంచలన వ్యాఖ్యలు చేశారు. షర్మిలకు వెంటనే భద్రతను పెంచాలన్నారు. సొంత బాబాయిని చంపేశారని, అందుకే తమకు జగన్ మీద అనుమానం ఉందన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు పీల గోవింద్ సత్యనారాయణ, గండి బాబ్జి, పలువురు టిడిపి నేతలు పాల్గొన్నారు.

మావోయిస్టుల కాల్పుల్లో ముగ్గురు పోలీసుల మృతి

విశాలాంధ్ర- చింతూరు: చత్తీస్‌గఢ్‌లో మావోయిస్టుల పంజా విసిరారు. కూంబింగ్ నిర్వహించేందుకు వెళుతున్న పోలీసులపై కాల్పులు జరిపారు. ఈ ఘటనలో ముగ్గురు పోలీసులు అక్కడికక్కడే మృతి చెందగా... 15 మంది జవాన్లకు గాయాలయ్యాయి. అందులో రావత్ ఓం ప్రకాష్, మల్కిత్ సింగ్, మధు కుమార్, అవినాష్ అనబడే జవాన్లు తీవ్రంగా గాయపడ్డారు. తొలుత వీరిని సిలిగేర్ క్యాంపుకి తరలించి ప్రాథమిక చికిత్స చేశాక... మెరుగైన చికిత్స కోసం హెలికాప్టర్‌లో రాయపూర్ కు తరలించారు. బీజాపూర్ జిల్లా టేకులగూడెంలో కొత్తగా పోలీస్ క్యాంప్ ఏర్పాటు చేశారు. మంగళవారం ఈ క్యాంపునుండి సీఆర్పీఎఫ్, ఎస్టీఎఫ్,కోబ్రా దళాలు, జిల్లా పోలీసులు సమీపంలోనీ జోనగూడ బి అలిగుడ అడవుల్లోకి వెళుతుండగా... మాటువేసిన మావోయిస్టులు ఒక్కసారిగా మెరుపు దాడి చేసి కాల్పులు జరపడంతో ముగ్గురు పోలీసులు మృతి చెందారు. వీరిని 201 బెటాలియన్ కు చెందిన సీ దేవం, పవన్ కుమార్, సీఆర్పీఎఫ్ జవాను లందేర్ సింహగా గుర్తించారు. ఈ ఘటనను బస్తర్ రేంజ్ ఐజీ సుందర్ లాల్ పట్వా ధ్రువీకరించారు. 2021 లో టేకులగూడెంలోనే మావోయిస్టులు జరిపిన కాల్పుల్లో 23 మంది పోలీసులు దుర్మరణం చెందారు.

శ్రీ అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వర స్వామి దేవాలయం
కార్వేటినగరం (గ్రామం & మండలం), చిత్తూరుజిల్లా
e-Procurement Tender
NIT No.P1/COE/1406/2023 Date :24.01.2024
దేవాలయ అభివృద్ధి పనుల కొరకు e-Procurement ద్వారా టెండర్లు కోరడమైనది. వివరములకు htts:tender.apeprocurement.gov.in వెబ్‌సైట్‌ను చూడగలరు.
సం/- కార్యనిర్వహణాధికారి

మిరబెల్ ఆగ్రో మ్యానుఫ్యాక్చరింగ్ ప్రైవేట్ లిమిటెడ్
మిరబెల్ ఆగ్రో మ్యానుఫ్యాక్చరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ తమ 100% నీటిలో కలిగే మిశ్రమ ఎరువుల ఉత్పత్తుల్ని ఈ క్రింది వివరాల ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో విక్రయించాలని ఆశిస్తుంది.

సం.	సాధారణ పేరు	లభ్యమగు పోషకములు
1.	మిరబెల్ 100% నీటిలో కలిగే మిశ్రమ ఎరువు NPK 20:20:20	• నత్రజని 'N' రూపంలో : 20.00% • నీటిలో కలిగే భాస్వరం 'P_2O_5' రూపంలో : 20.00% • నీటిలో కలిగే పొటాషియం 'K_2O' రూపంలో : 20.00% • 100% నీటిలో కరుగుతుంది
2.	మిరబెల్ 100% నీటిలో కలిగే మిశ్రమ ఎరువు NPK 00:16:16	• నీటిలో కలిగే భాస్వరం 'P_2O_5' రూపంలో : 16.00% • నీటిలో కలిగే పొటాషియం 'K_2O' రూపంలో : 16.00% • మెగ్నీషియం (చిలేటెడ్ రూపంలో) : 2.00% • కాల్షియం (చిలేటెడ్ రూపంలో) : 2.00% • బోరాన్ 'B' రూపంలో : 0.50% • సల్ఫర్ 'S' రూపంలో : 2.00%
3.	మిరబెల్ 100% నీటిలో కలిగే మిశ్రమ ఎరువు (గోధుమ పంట కోసం సూత్రీకరించబడింది) NPK 00:15:15	• భాస్వరం 'P_2O_5' రూపంలో : 15.00% • పొటాషియం 'K_2O' రూపంలో : 15.00% • మాంగనీస్ 'Mn' రూపంలో : 15.00% • జింక్ 'Zn' రూపంలో : 2.50% • సల్ఫర్ 'S' రూపంలో : 12.00% • 100% నీటిలో కరుగుతుంది
4.	మిరబెల్ 100% నీటిలో కలిగే మిశ్రమ ఎరువు ([illegible] పంట కోసం సూత్రీకరించబడింది) NPK 00:20:13	• భాస్వరం 'P_2O_5' రూపంలో : 20.00% • పొటాషియం 'K_2O' రూపంలో : 13.00% • జింక్ 'Zn' రూపంలో : 10.00% • మెగ్నీషియం 'Mg' రూపంలో : 2.00% • బోరాన్ 'B' రూపంలో : 0.50% • సల్ఫర్ 'S' రూపంలో : 8.00% • 100% నీటిలో కరుగుతుంది
5.	మిరబెల్ 100% నీటిలో కలిగే మిశ్రమ ఎరువు (ప్రత్తి పంట కోసం సూత్రీకరించబడింది) NPK 00:12:18	• నీటిలో కలిగే భాస్వరం 'P_2O_5' రూపంలో : 12.00% • నీటిలో కలిగే పొటాషియం 'K_2O' రూపంలో : 18.00% • కాల్షియం (చిలేటెడ్ రూపంలో) : 2.00% • మెగ్నీషియం 'Mg' రూపంలో : 2.00% • బోరాన్ 'B' రూపంలో : 0.20% • కాపర్ 'Cu' రూపంలో : 1.00% • మాంగనీస్ 'Mn' రూపంలో : 1.00% • జింక్ 'Zn' రూపంలో : 2.50% • సల్ఫేట్ సల్ఫర్ 'S' రూపంలో : 8.00%
6.	మిరబెల్ 100% నీటిలో కలిగే మిశ్రమ ఎరువు (మొక్కజొన్న పంట కోసం సూత్రీకరించబడింది) NPK 00:14:18	• నీటిలో కలిగే భాస్వరం 'P_2O_5' రూపంలో : 14.00% • నీటిలో కలిగే పొటాషియం 'K_2O' రూపంలో : 18.00% • బోరాన్ 'B' రూపంలో : 1.00% • కాపర్ 'Cu' రూపంలో : 1.00% • మాంగనీస్ 'Mn' రూపంలో : 2.00% • జింక్ 'Zn' రూపంలో : 2.50% • ఐరను (చిలేటెడ్ రూపంలో) : 2.50% • సల్ఫేట్ సల్ఫర్ 'S' రూపంలో : 5.00%
7.	మిరబెల్ 100% నీటిలో కలిగే మిశ్రమ ఎరువు (మిరప పంట కోసం సూత్రీకరించబడింది) NPK 00:16:16	• నీటిలో కలిగే భాస్వరం 'P_2O_5' రూపంలో :16.00% • నీటిలో కలిగే పొటాషియం 'K_2O' రూపంలో :16.00% • మెగ్నీషియం (చిలేటెడ్ రూపంలో) : 2.00% • కాల్షియం (చిలేటెడ్ రూపంలో) : 2.00% • జింక్ 'Zn' రూపంలో : 1.00% • బోరాన్ 'B' రూపంలో : 0.10% • సల్ఫర్ 'S' రూపంలో : 2.50%
8.	మిరబెల్ 100% నీటిలో కలిగే మిశ్రమ ఎరువు (వేరుశనగ పంట కోసం సూత్రీకరించబడింది) NPK 00:10:21	• నీటిలో కలిగే భాస్వరం 'P_2O_5' రూపంలో : 10.00% • నీటిలో కలిగే పొటాషియం 'K_2O' రూపంలో : 21.00% • బోరాన్ 'B' రూపంలో : 0.30% • కాపర్ 'Cu' రూపంలో : 1.00% • మాంగనీస్ 'Mn' రూపంలో : 4.00% • జింక్ (చిలేటెడ్ రూపంలో) : 3.50% • ఐరను (చిలేటెడ్ రూపంలో) : 1.00% • మాలిబ్డినం 'Mo' రూపంలో : 0.001% • సల్ఫేట్ సల్ఫర్ 'S' రూపంలో : 7.00%
9.	మిరబెల్ 100% నీటిలో కలిగే మిశ్రమ ఎరువు NPK 13:40:13	• నీటిలో కలిగే భాస్వరం 'P_2O_5' రూపంలో : 40.00% • నీటిలో కలిగే పొటాషియం 'K_2O' రూపంలో : 13.00% • నత్రజని 'N' రూపంలో : 13.00%

పైన పేర్కొన్న 100 శాతం నీటిలో కలిగే మిశ్రమ ఎరువులు, వ్యవసాయ మరియు రైతు సంక్షేమ మంత్రిత్వశాఖ, న్యూఢిల్లీ (భారతదేశం) ద్వారా జారీ చేయబడిన నోటిఫికేషన్ నెం. S.O. 2900 (E) తేది : 24.10.2015, సవరించిన నోటిఫికేషన్ నెం. S.O.4120 (E) తేది: 30.12.2017కు అనుగుణంగా ఆమోదితంగా ఉంటాయి.
మార్కెటెడ్ బై : M/s. **మిరబెల్ ఆగ్రో మ్యానుఫ్యాక్చరింగ్ ప్రైవేట్ లిమిటెడ్**
డోర్ నెం. 8-221/3, సర్వే నెం. 69/1C, CIPET కాలేజ్ ఎదురుగా ఉన్న రోడ్డు, సూరంపల్లి గ్రామం, గన్నవరం మండలం, కృష్ణాజిల్లా, ఆంధ్రప్రదేశ్ - 521212.
తేది. 31-01-2024

సంపాదకీయం

చాతుర్యంతో పాటు సంయమం

బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ దొంగ దెబ్బ తీసి బీజేపీ నాయకత్వంలోని ఎన్.డి.ఎ. కూటమిలో చేరిపోవడం "ఇండియా" ఐక్య సంఘటనను ఒక్క కుదుపు కుదిపిన మాట నిజమే. "ఇండియా" ఐక్య సంఘటనకు తానే సూత్రధారి అయి ఉండి నితీష్ ఏ సాధించాలనుకుని బీజేపీ అండన చేరారో తెలియదు. ఇలాంటి పల్టీలు ఆయన ఇంతకు ముందు కూడా కొట్టారు. పైకి గొప్ప ఆకాంక్షలు ఏమీ లేనట్టు కనిపించినా అంతరాంతరాల్లో ఆయనకు ప్రధానమంత్రి కావాలన్న ఆలోచన ఉండేది. కానీ మాటల్లో మాత్రం సర్వసంగ పరిత్యాగిలా ఉండే వారు. బీహార్‌లోని మహా ఘట్బంధన్‌లో అంతా సవ్యంగా సాగడం లేదని మాత్రమే ఆయన చెప్పారు. కానీ ఇటీవల "ఇండియా" ఐక్య సంఘటన సమావేశం జరగడానికి ముందే ఈ ఐక్య సంఘటన గెలిస్తే కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖడ్గే ప్రధానమంత్రి అభ్యర్థి కావాలని మమత ఏకపక్షంగా ప్రకటించేశారు. ఇందులో ఆమెకు నితీశ్ కుమార్ విషయంలో ఉన్న వ్యతిరేకతే ప్రధాన కారణం. నిజానికి "ఇండియా" కూటమిలో ప్రధానమంత్రి అభ్యర్థి ఎవరు అన్న చర్చే జరగలేదు. ఎన్నికల ఫలితాలు వెలువడి "ఇండియా" ఐక్య సంఘటనకు ప్రభుత్వం ఏర్పాటు చేసే అవకాశం వస్తే అప్పుడు ఆ విషయం ఆలోచించవచ్చు, తాను ప్రధానమంత్రిని కాదలుచుకోలేదని రాహుల్ గాంధీ స్పష్టంగానే ప్రకటించారు. అందువల్లే మమత ఖడ్గే పేరు ప్రతిపాదించారు. అంతేకాకుండా "ఇండియా" సమన్వయ కర్తగా నితీశ్‌ను నియమించాలన్న ఆలోచనను మమత బహిరంగంగా చెప్పకుండానే అడ్డం కొట్టారు. ఈ పరిణామాల తరవాత "ఇండియా"లో తనకు పెద్ద ప్రయోజనం ఏమీ లేదని నితీశ్ భావించారు. పైకి నీతులు చెప్తూనే లోపాయికారీగా బీజేపీతో మంతనాలు జరిపి చివరకు చేరిపోయారు. ఈ నిర్ణయంతో నితీశ్ కుమార్ మీద సద్భావన ఘోరంగా దెబ్బతిన్నది. తాను నమ్మిన సిద్ధాంతాలను ఆయన ఒక్క ఉదుటున వదిలేశారు. బీజేపీతో ఆయన చేతులు కలపడం కొత్తేమీ కాదు. కానీ సైద్ధాంతికంగా నితీశ్ సోషలిస్టు భావజాలం ఉన్న వారన్న నమ్మకం ఏ మూలనో అందరిలో దాగి ఉండేది. ఆయనలో పదవీ కాంక్ష తప్ప సోషలిస్టు, సెక్యులర్ భావాలు ఇసుమంత కూడా లేవని తేలిపోయింది. నితీశ్ పార్టీలో సీనియర్ నాయకుడైన కె.సి.త్యాగీ అయితే "ఇండియా" నాయకత్వాన్ని లాగేసుకోవాలని చూస్తోంది అని తీవ్రమైన వ్యాఖ్యే చేశారు. దీన్ని నితీశ్ ఖండించలేదంటే ఈ వ్యాఖ్యలకు ఆయన మద్దతు ఉన్నట్టే లెక్క. మళ్లీ నితీశ్ ఎన్.డి.ఎ. సరసన చేరాలని నిర్ణయించుకోవడం ఆయన మీద సదభిప్రాయాన్ని మంట గలిపింది. 2013లో మోదీని బీజేపీ ప్రధానమంత్రి అభ్యర్థిగా ప్రకటించినందుకే ససేమిరా సమ్మతం కాదని కరడుగట్టిన సెక్యులర్ వాదినన్న అభిప్రాయం కలిగించి ఆ తరవాత కొన్నాళ్లకే బీజేపీని ఆలింగనం చేసుకున్న వ్యక్తి నితీశ్. ఆయన ఎప్పుడు ఏ నిర్ణయం తీసుకుంటారో ఎప్పుడూ అంతుపట్టని వ్యవహారమే. రాజకీయంగా పైకి ఎదగాలన్న కోరిక ఎవరికైనా ఉండొచ్చు. కానీ లక్ష్య సాధనకు అనుసరించే మార్గం కూడా సవ్యమైంది అయి ఉండాలి. అవసరార్థం కప్పగంతులు వేస్తే నితీశ్ కుమార్‌లాంటి వారి కీర్తి కూడా అడుగంటుతుంది. ప్రతిపక్షాలతో తెగతెంపులు చేసుకుని వెళ్లి పోయినా నితీశ్ ప్రతిపక్ష నాయకులను దుయ్యబట్టక పోయినా తన పరువు నిలబెట్టడానికి ఏ మాత్రం ప్రయత్నం చేయలేదు.

రాహుల్ గాంధీ భారత్ జోడో న్యాయ యాత్ర బీహార్‌లో ప్రవేశించనున్న సమయంలోనే ఈ పరిణామాలన్ని జరిగాయి. నితీశ్ విద్రోహం తలపెట్టినా కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖడ్గే కానీ రాహుల్ గాంధీ కానీ అనుచితమైన, పరుషమైన వ్యాఖ్యలు చేయలేదు. ఇది అక్షరాలా సమంజసమైన వైఖరి. ప్రతిపక్ష ఐక్య సంఘటన లోని పక్షాలన్నింటినీ ఒక్క తాటి మీద నడిపించవలసిన బాధ్యత ఆ సంఘటనలో అతి పెద్ద పక్షంగా కాంగ్రెస్ మీదే ఉంది. "ఇండియా" నిర్వహణ ప్రజాస్వామ్య బద్ధంగా ఉండాలి. కాంగ్రెస్ అహంకార పూరితమైందన్న గుసగుసలు కూడా వినిపిం చకుండా చూసుకోవడం కాంగ్రెస్ బాధ్యత. "ఇండియా" సమన్వయకర్తగా నితీశ్‌ను నియమించడం కొన్ని పక్షాలకు సమ్మతం కాలేదు. ఏకాభి ప్రాయంతో ఈ పని జరిగితే మంచిదని అగ్ర నాయకులు భావించారు. ఏకాభిప్రాయ సాధనకు అవకాశం ఇవ్వకుండానే నితీశ్ నిష్క్రమించారు. మమతతో చర్చించడం ఏమిటి, ఆమెను ఒప్పించడం ఏమిటి అన్న ధోరణిలో నితీశ్ వ్యవహరించారు. నితీశ్ ఫిరాయింపు "ఇండియా" ఐక్య సంఘటనలోని ఏ పక్షానికీ రుచించలేదు. కేజ్రీవాల్, శరద్ పవార్ కూడా నితీశ్ నిర్ణయాన్ని మెచ్చలేదు. పద్నాలుగేళ్లు ముఖ్యమంత్రిగా ఉన్నా అధికార దాహం తీరని నితీశ్ అమాంతం ఫిరాయించడంతో ఆయన మీద ఉన్న గౌరవం ఒక్క సారిగా తగ్గిపోయింది. ఆయన నమ్మదగిన వారు కాదన్న అభిప్రాయం సర్వత్రా వెల్లడైంది. "ఇండియా"లో ఇప్పటికీ సీట్ల పంపిణీలో అనేక అడ్డంకులున్నాయి. వీటిని సంయమంతో, లక్ష్య సాధన మీద దృష్టి ఉంచి సర్దుబాటు చేసుకోవాలి. అవసరమైతే కొంత మేర త్యాగాలు చేయడానికి కూడా సిద్ధ పడాలి. ఇవేవీ నితీశ్ పట్టించుకోలేదు. తనకు పెద్ద పీట వేయలేదన్న కారణంగా ప్రతిపక్ష నావను నట్టేట ముంచాలన్న దుష్ట చింతన ప్రదర్శించారు. బెంగాల్‌లో ఒంటరిగా పోటీ చేస్తుందని తృణమూల్ అధినాయకురాలు ప్రకటించినప్పుడు, పంజాబ్‌లో సీట్ల పంపిణీ గురించి ఆమ్ ఆద్మీ పార్టీ ఇదే వైఖరి అనుసరించినా కాంగ్రెస్ కానీ ఇతర "ఇండియా" పక్షాలు కానీ తొందరపడి విమర్శలు గుప్పించలేదు. అన్ని పక్షాలూ సంయమం పాటించి తమ బలాబలాలపై వాస్తవ ఆధారితమైన అంచనాతో ముందుకు వస్తే తప్ప బీజేపీని ఓడించాలన్న ప్రయత్నం సఫలం కాదు. రామ మందిర ఆవిష్కరణ తరవాత 2024లో బీజేపీ విజయం సునాయాసం అన్న ప్రచారం జరుగుతూ ఉండవచ్చు. కానీ మోదీతో సహా చాలా మంది గ్రహించని, అంచనా వేయడానికి ప్రయత్నించని అంశం ఒకటుంది. మోదీ ఎన్ని మాయాజాలాలు చేసినా ఆయనను వ్యతిరేకించే, ఈ సారి ఆయనకు అధికారం దక్కకుండా చూడాలన్న భావన ఉన్న ప్రజల సంఖ్య అంతకంతకూ పెరుగుతూ ఉంది. బెంగాల్‌లో మమతా బెనర్జీ బెట్టు చేస్తూ ఉండవచ్చు. మమతతో తనకు గతం నుంచీ ఉన్న పేచీలను పెద్దవి చేసి రాద్ధాంతం చేస్తున్న అధీర్ రంజన్‌కు కాంగ్రెస్ అగ్ర నాయకత్వం కళ్లెం వేసి తీరవలసిందే. వ్యక్తిగత అంశాలు అసలు లక్ష్యానికి విఘాతం కలిగించకూడదు. కాంగ్రెస్ మరింత సంయమంతో, లక్ష్యాన్ని ఛేదించడం మీద దృష్టి పెడ్తే తప్ప నితీశ్ లాంటి వారి విద్రోహం వల్ల కలిగే నష్టాన్ని పూరించడం కుదరదు. ఈ సారి మళ్లీ మోదీ గెలిస్తే ఆ తరవాత ఎన్నికలే ఉండవు అని ఖడ్గే చేసిన హెచ్చరిక అవాస్తవం కాదు. ప్రస్తుతావసరం చాతుర్యంతో పాటు సంయమం.

అర్హులైన భార్యాభర్తలకు పెన్షన్ ఇవ్వాలి

ముప్పాళ్ల నాగేశ్వరరావు

తరతరాలుగా శ్రామిక ప్రజల కృషి, మేధోపరమైన ఆలోచన, సంపద సృష్టిలో వారి పోరాటం, నేటి ఆధునిక వ్యవస్థ ఏర్పాటుకు మూలం. పాత రాతియుగం నుంచి నేటి అణుయుగం వరకు జరిగిన ప్రతి "వృద్ధి" మానవ శ్రమ, వివేచనతో ముడిపడినదే. అలాంటి మానవుని వృద్ధాప్యం కడుదీనంగా, దైన్యంగా నిరాదరణకు గురికావటాన్ని సమాజ వైఫల్యంగా పరిగణించాలి. సిరిమంతుల కుటుంబాలలో తల్లిదండ్రులకు ఆర్థికేతర ఇబ్బందులు ఎదురుకావచ్చు. కాని కోట్లాది పేద, దిగువ, మధ్యతరగతి కుటుంబాలలోని వృద్ధులు తీవ్రమైన ఆరోగ్య సమస్యలతోపాటు మానసిక, సంరక్షణ, ఆర్థికపరంగా వర్ణనాతీతమైన బాధలతో కొందరు మృత్యువు కోసం ఎదురుచూడటాన్ని మనం గమనిస్తుంటాం. వృద్ధాప్యం శాపం కారాదు. పరిణతిచెందిన సీనియర్ సిటిజన్లు జాతి సంపదగా గుర్తించి గౌరవప్రదమైన, ఆరోగ్యవంతమైన, కనీస ఆర్థిక గ్యారంటీలతో కూడి హుందాగా జీవించే పరిస్థితులను కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై వుంది.

వృద్ధులకు, వితంతువులైన అభాగ్యులకు, వివిధ కారణాలతో ఒంటరి మహిళలుగా కుటుంబ సంరక్షణ పొందలేని వారికి, విభిన్న ప్రతిభావంతులకు, ట్రాన్స్‌జండర్స్‌కు, దీర్ఘకాలిక వ్యాధులకు గురైనవారికి నేటి వరకు సరైన చట్టాల రక్షణ లేకపోవడం బాధాకరం. కనీస ఆదాయంలేని కీలకమైన కొన్ని వృత్తులలో ఉపాధి పొందుతున్న వారికి ఆర్థిక ప్రోత్సాహకాల్ని కల్పించి కాపాడవలసిన బాధ్యత కూడా మన ప్రభుత్వాలపై వుంది.

సమాజంలో సంపద సృష్టికర్తలైన కార్మికులు, సమస్త ప్రజలకు తిండిపెట్టే రైతులు లేకుండా మానవాభివృద్ధిని ఊహించలేం. అలాంటి రైతులు, కార్మికులతోపాటు పశుపోషకులు, జీవాల పెంపకందారులు, భవన నిర్మాణ కార్మికులు, హమాలీలు, రవాణా కార్మికులు, ఆటో డ్రైవర్లు, షాపు గుమస్తాలు, చేతివృత్తులతో జీవించే చేనేత, గీత, మత్స్య, కమ్మరి, కుమ్మరి, వడ్రంగి, మేదరి, పాదరక్షలుకుట్టే లాంటి చేతివృత్తులలోను, నిర్మాణ, ఉత్పత్తి రంగాలలో రెక్కలు ముక్కలు చేసుకుని, కుటుంబ పోషణతోపాటు సమాజాభివృద్ధికి, దేశాభివృద్ధికి పాటుపడేవారికి పదవీవిరమణకు నిర్ణీత కాలమంటూ లేదుగదా? అసంఘటిత రంగాలలో బతుకులీడుస్తున్న కార్మిక శ్రేణులు, షాపు గుమస్తాలు, సేల్స్ గరల్స్, ఇతర సేవారంగాలలోని అల్పాదాయ వర్గాలవారు, రెక్కాడితేగాని డొక్కాడదన్నట్లు కాళ్లు చేతులు పనిచేసినంత కాలం శ్రమిస్తూ జీవించేవారి వృద్ధాప్య రక్షణకు మన దేశంలో సరైన పథకాలేమీ లేవు. వీరితోపాటు సీనియర్ సిటిజన్లుగా ఉన్నవారికి కల్పిస్తున్న ప్రయోజనాలు, రక్షణలు కూడా సరిగ్గా లేవు. సమాజంలో 36 శాతంగా వున్న వృద్ధులతోపాటు విభిన్న ప్రతిభావంతులు, వితంతువులు, ఒంటరి మహిళలు, పేద కళాకారులు, దీర్ఘకాలిక వ్యాధులతో అవస్థలు పడుతున్నవారు కనీస పెన్షన్ 10 వేల రూపాయలు వుండాలని కోరుకుంటున్నారు. ప్రభుత్వ ఉద్యోగులుగా వున్న భార్యాభర్తలిద్దరికీ చట్టబద్ధంగా పెన్షన్ ఇస్తున్నప్పుడు శారీరక శ్రమచేసే పై వర్గాలవారికి "కుటుంబంలో ఒక్కరికి పెన్షన్ ఇచ్చి పండగ చేసుకోండి" అనటంలో అర్థం లేదు. పైగా ఈ వర్గాలు పనిచేసే కేంద్రాల పరిసరాల పరిశుభ్రతా లోపాలు, వాయు, వాతావరణ కాలుష్యాలు, పోషక విలువలతో కూడిన

ఆహారం కొనలేని ఆర్థిక పరిస్థితుల్లో శరీర పటుత్వం 50 సంవత్సరాలకే సన్నగిల్లుతుందనటం నిర్వివాదాంశం. గత నాలుగు సంవత్సరాల కాలంలో నిత్యావసర వస్తువులు, వైద్య సేవలు, మందులు తదితరాల ధరలు అపరిమితంగా పెరిగి జీవన వ్యయం అందుకోలేనంత అయింది. ప్రభుత్వాలు ఇస్తున్న పెన్షన్లు మాత్రం పాలకుల దయా దాక్షిణ్యాలపై ఆధారపడి భిక్ష పొందుతున్నట్లు కాక, చట్టబద్ధ హక్కులతో కూడిన పెన్షన్లుగా సామాజిక పెన్షన్లను అమలుపరచాలి. ధరల పెరుగుదల, ఇతర పరిస్థితులను లెక్కించి ఎప్పటికప్పుడు ప్రభుత్వ ఉద్యోగుల్లాగా గుణించి పెన్షన్ పద్ధతి అమలుచేయాలి.

ఇటీవల పెంచిన 3 వేల రూపాయల పెన్షన్ పెరిగిన ధరవరల రీత్యా ఏమాత్రమూ సరిపోదు. కనీస పెన్షన్ 6 వేల రూపాయలకు పెంచి అందించడంతోపాటు అర్హత కలిగిన భార్యాభర్తలు ఇద్దరూ జీవించివుంటే ఇద్దరికీ పెన్షన్ సదుపాయం కల్పించాలి. పెన్షన్ పొందు అర్హత వయస్సు 50 సంవత్సరాలుగా నిర్ధారించడం సమంజసంగా వుంటుంది. విభిన్న ప్రతిభావంతులు లేక వికలాంగులకు ఇస్తున్న పెన్షన్‌ను నెలకు రూ. 3,000 నుంచి రూ. 6,000కు తగ్గకుండా పెంచి వారికి కనీస మెరుగైన పరిస్థితులు కల్పించాలి. సీనియర్ సిటిజన్ల రక్షణార్థం తల్లిదండ్రుల పోషణ, వృద్ధుల సంరక్షణ చట్టం 2007ని సక్రమంగా అమలుచేసి తగు రక్షణలు కల్పించాలి. స్వార్జిత ఆస్తులు కలిగి ఉన్న సీనియర్ సిటిజన్స్ తమ బిడ్డల నిరాదరణకు గురైన సందర్భాలలో బ్యాంకులు రివర్స్ మార్ట్‌గేజ్ స్కీము అమలుచేసి ఆర్థిక వెసులుబాటు ఉండేలా చూడాలి. వృద్ధుల సంక్షేమం కోసం ప్రత్యేక మంత్రిత్వశాఖతోపాటు ప్రత్యేక కమిషనరేటును ఏర్పాటుచేసి వృద్ధులు, వికలాంగుల సంక్షేమానికి ప్రత్యేక శ్రద్ధతో చర్యలు తీసుకోవాలి. ఉచిత వైద్య సదుపాయాలు, మందులు, ఆరోగ్య పరీక్షలు చేయించుకునేందుకు ప్రతి పెన్షన్‌దారునికి ఆధార్ కార్డువలే ప్రత్యేక ఆరోగ్య గుర్తింపు కార్డు అందించాలి. చట్టంలో పేర్కొన్న విధంగా ప్రతి జిల్లా కేంద్రంలో ప్రభుత్వ ఆధ్వర్యంలో ఆధునిక సదుపాయాలతో కూడిన వృద్ధాశ్రమాలు ఏర్పాటుచేసి ఉన్నతంగా నిర్వహించాలి. గ్రామీణ, పట్టణ వృద్ధులకు అవసరాన్నిబట్టి కుటుంబ, సమాజ వ్యవస్థల్లో చోటుచేసుకుంటున్న పరిస్థితుల నేపథ్యంలో తగినన్ని వృద్ధాశ్రమాల ఏర్పాటును ప్రోత్సహించాలి. ఈ పెన్షన్లు పొందేవారందరికీ ప్రత్యేక ఆరోగ్య బీమా సదుపాయం కల్పించాలి. ఒంటరి మహిళలకు ఇస్తున్న పెన్షన్ వయసును 50 సంవత్సరాలకు పెంచడం సరైనది కాదు. తల్లిదండ్రుల రక్షణ కోల్పోకముందే 30 సంవత్సరాలు నిండిన ఒంటరి మహిళలందరికీ పెన్షన్ సదుపాయం కల్పించాలి. వివిధ పెన్షన్లు పొందుతున్న వారిలో 60 సం॥లు నిండిన వారందరికీ రైళ్లల్లోనూ, ఆర్టీసి బస్సుల్లోను ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించి అందుకు తగిన పాసులు ఇవ్వాలి. విమాన ప్రయాణాలలో గతంలో ఉన్నట్లు సీనియర్ సిటిజన్లకు 50 శాతం రాయితీని పునరుద్ధరించాలి. వృద్ధులందరికీ చివరి శ్వాస వరకు బీమా సదుపాయం కల్పించాలి. ప్రీమియంలు ప్రభుత్వమే భరించాలి. సీనియర్ సిటిజన్లు బ్యాంకుల్లో దాచుకునే డబ్బుకు పదే పదే వడ్డీ రేట్లు తగ్గించటం సరైనది కాదు. అదనపు వడ్డీ రేట్లు కల్పించి వారి మెరుగైన ఆర్థిక స్థితికి తోడ్పడాలి.

రాష్ట్రంలో 28 రకాల సామాజిక పెన్షన్లు పొందుతున్న సుమారు 65 లక్షల మందిలో కుంటిసాకులు చూపి పెన్షన్లను రద్దుచేయరాదు. అర్హత కలిగిన కొత్తవారి అర్జీలను వారం రోజుల్లో పరిశీలించి అదే నెలలో మంజూరు చేయాలి. సంఘటిత రంగంలో వున్నవారు తమ సంఘటిత శక్తి ద్వారా ఎన్నో ప్రయోజనాలను పొందుతున్న విషయం మనం గమనిస్తూనే వున్నాం. రైతులు, రైతు కూలీలు, వివిధ అసంఘటిత రంగ కార్మికులు సంఘటిత రంగంలో వుండి నామమాత్రంగా కూడా పెన్షన్లు పొందలేని వారందరికీ గౌరవప్రదమైన జీవనానికి తగినంత స్థాయిలో పెన్షన్ల మొత్తాలను పెంచి ఇచ్చేవిధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సత్వర చర్యలు తీసుకోవాలి. పదవీవిరమణ అనంతరం నామమాత్రంగా పెన్షన్లు పొందుతున్న వివిధ విభాగాలలో పనిచేస్తున్న కార్మికవర్గం, ఇతర జీవన రంగాలలో ఉన్నవారు తమ పెన్షన్ పెంపు డిమాండ్ల సాధనకు సాగిస్తున్న ఆందోళనలకు ఏపీ సామాజిక పెన్షనర్ల, సీనియర్ సిటిజన్ల ఉద్యమం బలపరుస్తుంది.

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి,
కన్వీనర్, ఏ.పీ. సామాజిక పెన్షనర్ల సంక్షేమ సంఘం.

యూరప్‌లో మతవాద శక్తులపై పోరు

సాత్యకి చక్రవర్తి

యూరప్‌లోని అనేక దేశాల రాజధానులలో సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా నిరసన ప్రదర్శనలు వెల్లువెత్తుతున్నాయి. పాలకపార్టీల నిరంకుశ సామ్రాజ్యవాద విధానాలకు వ్యతిరేకంగా కొద్ది రోజులుగా ప్రజలు ఉద్యమించారు. ఈ ప్రదర్శనల్లో మహిళలు, యువత భారీ సంఖ్యలో పాల్గొన్నారు. జర్మనీలోని ప్రధాన నగరాలతో సహా యూరప్‌లోని అనేక ప్రధాన నగరాల్లో జరిగిన నిరసన ప్రదర్శనలో లక్షలాదిమంది ప్రజలు పాల్గొన్నారు. ప్రజా వ్యతిరేక, ప్రభుత్వ నయా వలసవాద విధానాలకు వ్యతిరేకంగా ప్రజలు గళమెత్తారు. జర్మనీలో రైట్‌వింగ్ ఆల్టర్నేటివ్ ఫర్ జర్మనీ పార్టీ విధి విధానలకు వ్యతిరేకంగా దేశవ్యాప్త నిరసనలు వెల్లువెత్తాయి. విదేశీ మూలాలు ఉన్న వ్యక్తులను భారీగా బహిష్కరించాలన్న విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమించారు. శరణార్థులను, వలసదారులను సామూహికంగా అరికట్టాలని, దేశంలో ఉన్న శరణార్థులను బహిష్కరించే విధివిధానాలపై జరిగిన నయా ఉదారవాద, నియంతృత్వ చర్యలను ప్రజలు ముక్తకంఠంతో ఖండించారు. ఈ సమావేశానికి అతిమితవాద పార్టీ ఫార్ రైట్ ఆల్టర్నేటివ్ ఫర్ జర్మనీ(ఏఎఫ్‌డీ)కి చెందిన సభ్యులు హాజరయ్యారు. వలసదారులను, ఆశ్రయం కోసం వచ్చిన వారిని సామూహికంగా బహిష్కరించే విధానాలపై పాలకపార్టీల చర్యలు అత్యంత హేయమైనవిగా ప్రజాసంఘాలు పేర్కొన్నాయి. అయితే జర్మన్ పార్లమెంటులో ప్రభుత్వానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ఏఎఫ్‌డీ పార్టీ దేశ రాజ్యాంగ విధానాలకు కట్టుబడి ఉన్నట్లు పేర్కొంది. జర్మనీలో ఏఎఫ్‌డీ పార్టీ ఈ విధానానికి పూర్తిస్థాయిలో తన తోడ్పాటునందిస్తోంది. ఏఎఫ్‌డీ పార్టీ మధ్యేవాద మితవాద రాజకీయ పార్టీల మద్దతుతో రానున్న ఎన్నికల్లో జర్మనీలో అధికారం చేపట్టేందుకు ప్రయత్నిస్తోంది. జర్మనీతో పాటు ఇతర యూరోపియన్ దేశాలలో వలసదారులను పూర్తిస్థాయిలో బహిష్కరించాలని పిలుపునిచ్చే అతివాద గ్రూపులున్నాయి. ప్రభుత్వంలోని కొందరు అధికార ప్రతినిధులు దేశంలో మితవాద నిరంకుశ ధోరణులకు వ్యతిరేకంగా జరుగుతున్న ప్రజా నిరసనలకు మద్దతు పలికారు. జర్మనీలో యూరోపియన్ సోషలిస్టు పార్టీలు ప్రజా నిరసనలకు తమ సంఘీభావం ప్రకటించారు. ప్రభుత్వ జాత్యహంకార విధానాలకు వ్యతిరేకంగా జర్మన్ ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. తమ ప్రజాస్వామ్యాన్ని రక్షించుకునేందుకు కట్టుబడి ఉన్నామని ప్రకటించారు. జర్మనీ అధ్యక్షుడు ఫ్రాంక్-వాల్టర్ స్టైయిన్‌మీర్ వీడియో ప్రకటన విడుదల చేస్తూ మన ప్రజాస్వామ్య భవిష్యత్తు ప్రత్యర్థుల పరిమాణంపై ఆధారపడి ఉండదని, ప్రజాస్వామ్యాన్ని రక్షించుకునే వారి లక్ష్యాలమీద ఆధారపడి ఉంటుందన్నారు. ఫ్రీ డెమోక్రాట్‌ల మద్దతుతో అధికారంలో ఉన్న జర్మన్ సోషల్ డెమొక్రాటిక్ పార్టీ మితవాదుల విధానాలకు వ్యతిరేకంగా చర్యలు తీసుకోవాలని తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటోంది. అయితే ఈ నేపథ్యంలో రెండు పార్టీలుగా చీలిపోయిన జర్మన్ వామపక్షాలు కూడా తమ మద్దతుదారులను పెద్ద సంఖ్యలో సమీకరించాయి. ఫ్రాన్స్‌లో ప్రభుత్వ వలస విధానాలపై అధ్యక్షుడు మాక్రాన్ తీసుకున్న నిర్ణయాలకు వ్యతిరేకంగా జరిగిన భారీ ప్రదర్శనలో వామపక్షాలు, సోషలిస్టు పార్టీ సభ్యులు భారీ సంఖ్యలో పాల్గొన్నాయి. ఫ్రాన్స్‌లో జాతివివక్ష, క్సినోఫోబియా, అసహనం, వలసదారుల ప్రయోజనాలకు సంబంధించిన బిల్లు ఫ్రెంచ్ రాజ్యాంగానికి విరుద్ధంగా ఉందని యుఎన్ తాజా నివేదిక వెల్లడించింది. ఈ విషయంలో అతి మితవాద లీ పెన్స్ పార్టీ నుంచి మాక్రాన్ ప్రభుత్వం ఒత్తిడిని ఎదుర్కొంటోంది. మాక్రాన్ ప్రభుత్వం అక్రమ వలసదారుల నిలుపుదలపై చేపట్టిన చర్యలు లీపెన్స్ పార్టీ తమ మద్దతు ఉపసంహరణకు దారితీస్తుందని ఆందోళన చెందుతోంది. నూతన వలసవాద చట్టం ప్రతిపాదన ఫ్రెంచ్ రాజ్యాంగ ప్రాథమిక లక్ష్యాలను ఉల్లంఘించే విధంగాఉందని ఈ చట్టంపై సంతకాలు చేయవద్దని అధ్యక్షుడుని నిరసనకారులు కోరారు. ఫ్రెంచ్ కమ్యూనిస్ట్ పార్టీకి చెందిన ట్రేడ్ యూనియన్ సిజిటి ఈ ప్రదర్శనకు ప్రధాన బాధ్యత వహించారు. సీజీటీ జాతీయ కార్యదర్శి సోఫీ బినెట్ మాట్లాడుతూ 'నిత్య జీవితంలో ఫ్రాన్స్‌లో లేని సంఘీభావం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం, కలిసి జీవించే చట్టాన్ని ఖండించడమే లక్ష్యంగా పేర్కొన్నారు. డిసెంబరులో పార్లమెంటు ఆమోదించిన చట్టంలోని అన్ని నివేదికలు ఫ్రెంచ్ రాజ్యాం గానికి అనుగుణంగా ఉన్నాయో లేదో రాజ్యాంగ మండలి నిర్ణయించడానికి ముందు ప్రజా నిరసనలు దేశమంతటా వెల్లువెత్తాయి. అయితే మెరైన్ లీ పెన్ నేతృత్వంలోని జాతీయ ర్యాలీ ప్రతిపాదిత ఈ కొత్త చట్టాన్ని స్వాగతించింది. పారిస్‌లో జరిగిన నిరసన కార్యక్రమంలో ఫ్రెంచ్ కమ్యూనిస్ట్ పార్టీ జాతీయ కార్యదర్శి ఫేబియన్ రస్సెల్ మాట్లాడుతూ, ఈ మార్చ్ "ఈ అమానవీయ వలసవాద చట్టాన్ని రద్దు చేయడమే" లక్ష్యంగా పెట్టుకుందని పేర్కొన్నారు. అధ్యక్షుడు మాక్రాన్ ప్రతిపాదించిన ఈ వలసల ప్రతిపాదనపై ఫ్రెంచ్ వామపక్షాలు, ఫ్రెంచ్ మితవాద శక్తులు భిన్నాభి ప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. యూరోపియన్ పార్లమెంట్‌కు జూన్‌లో జరిగే ఎన్నికల కోసం లీ పెన్ ప్రధాన ఎన్నికల ప్రణాళికలో విదేశీయులను బహిష్కరించడంపై దృష్టి సారించకపోవడం ఎన్నికల ఫలితాలు ఆశాజన కంగా ఉన్నాయి. నిజానికి, ఐరోపాలోని అన్ని మితవాద పార్టీలకు, యూరోపియన్ పార్లమెంటు ఎన్నికలు ప్రధాన సమస్యగా ఉండనున్నాయి.

41 శాతం జనాభాకు కట్టెల పొయ్యే

తాము అధికారంలోకి వచ్చిన పదేళ్ల కాలంలో దేశం ఎంతో అభివృద్ధి చెందిందనీ, దేశం అమృతకాలంలో పయనిస్తోందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఒక పక్క ప్రచారహోరెత్తిస్తున్నారు. మరోపక్క ఎన్డీయే అధికారంలోకి వచ్చిన తరువాత దేశం ఏమాత్రం అభివృద్ధి చెందలేదని నివేదికలు ఘోషిస్తున్నాయి. దేశంలోని 41 శాతం మంది జనాభా వంటకు ఇంధనంగా ఇప్పటికీ కట్టెలు, ఆవు పేడ, పిడకల వంటి ఇతర బయోమాస్ పదార్థాలను వినియోగిస్తున్నారని తాజా అధ్యయనం తెలిపింది. దీని వల్ల ఏటా 34 కోట్ల టన్నుల కార్బన్‌డై ఆక్సైడ్ వాయువు వాతావరణంలోకి విడుదల అవుతున్నదని, ఇది భారత కర్బన ఉద్గారాల్లో దాదాపు 13 శాతమని సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ (సీఎస్ఈ) అనే మేధో సంస్థ 'ఇండియాస్ ట్రాన్సిషన్ టూ ఈ-కుకింగ్' నివేదికలో వెల్లడించింది. దేశంలో 99.8 శాతం మందికి వంటగ్యాస్ అందుబాటులో ఉన్నదని కేంద్ర పెట్రోలియంశాఖ చెపుతున్న దానిలో ఏమాత్రం వాస్తవంలేదనీ, 41 శాతం మంది ఇంకా బయోమాస్‌పై వంట చేస్తున్నట్టు జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే(ఎన్ఎఫ్‌హెచ్ఎస్-5)లో తేటతెల్లమైందని ఆ నివేదిక తెలిపింది. 50 కోట్ల మంది భారతీయులతో సహా ప్రపంచ జనాభాలో దాదాపు మూడో వంతు(సుమారు 240 కోట్లు) మందికి వండుకునేందుకు ఇంకా పరిశుభ్రమైన వసతులు అందడం లేదని, దీని వలన పర్యావరణంతో సహా ఆర్థిక వ్యవస్థ, ప్రజారోగ్యానికి తీవ్ర ముప్పు కలుగుతోందని పేర్కొన్నది. అంతర్గత వాయు కాలుష్యం కారణంగా ప్రతి ఏడాది దాదాపు 30 లక్షల మంది ప్రజలు ముందస్తుగా మరణిస్తున్నారని, వీటిల్లో అధికంగా వంటచెరకు ఆధారిత వంట వలనేనని ఈ నివేదిక తెలిపింది. దేశంలోని 99.8 శాతం గృహాలకు వంటగ్యాస్ అందుబాటులో ఉందని పెట్రోలియం సహజ వాయువు మంత్రిత్వ శాఖ (ఎంఓపీఎన్‌జీ) ప్రకటనలు గుప్పిస్తోంది. అయితే, 2019-21లో నిర్వహించిన జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే (ఎన్ఎఫ్‌హెచ్ఎస్-5) జనాభాలో ఇప్పటికీ 41 శాతం మందికి వంటగ్యాస్ అందుబాటులో లేదని తెలిపింది. వీరంతా ఇప్పటికీ వంట కోసం కట్టెలు, పిడకలు, కర్రలు, చెక్కను కోయగా వచ్చే పొట్టు ఇతర బయోమాస్ వినియోగిస్తున్నారు. కలప, ఆవు పేడ లేదా ఇతర జీవపదార్థాలను వినియోగించి ఈ 41 శాతం మంది ప్రజలు వంట చేయడంతో ప్రతి సంవత్సరం 340 మిలియన్ టన్నుల కార్బన్ డయాక్సైడ్ (సీఓ2) పర్యావరణంలోకి విడుదలకావడంతో వాయు కాలుష్యం ఏర్పడుతుంది. వాతావరణ మార్పులపై ఐక్యరాజ్యసమితి ముసాయిదా సమావేశానికి భారతదేశం అందజేసిన చివరి ద్వైవార్షిక నవీకరణ నివేదిక (బీయూఆర్-3) పై సమీక్ష ఈ నిర్దిష్టరంగాల ఉద్గారాలను జాతీయ ఉద్గారాలలో భాగంగా పరిగణించలేదని పేర్కొంటోంది.

భారత్‌లో ఎల్పీజీ సదుపాయం త్వరగా పొందడానికి ప్రధాన మంత్రి ఉజ్వల యోజన పథకం(పీఎంయూవై) బాగా ఉపయోగపడుతోందని, సీఎస్ఈ నివేదిక తెలిపింది. అయితే ఈ పథకం నుంచి లబ్దిపొందిన వారి ఇళ్లలో 'క్లీన్ కుకింగ్' దిశగా నిరంతర పరివర్తనకు ఈ పథకం హామీ ఇవ్వలేకపోయిందన్న అభిప్రాయం వ్యక్తం చేసింది. 2016 మేలో ప్రారంభించిన పీఎంయూవై పథకం ద్వారా 2023 మార్చి వరకు దేశంలోని 10కోట్లకు పైగా కుటుంబాలు ఎల్పీజీ సిలిండర్లను పొందాయి. అయితే, పీఎంయూవై కింద కొత్త ఎల్పీజీ గ్యాస్ సిలిండర్లు పొందిన వారిలో 50 శాతానికి పైగా కుటుంబాలు కనీసం ఒక్కసారి కూడా రీఫిల్ చేయించుకోలేదని సీఎస్ఈ తన నివేదికలో పేర్కొన్నది. దీనికి వంటగ్యాస్ ధర అధికంగా ఉండడం, తాము నివసిస్తున్న ప్రాంతాల్లో ఎల్పీజీ పంపిణీ నెట్‌వర్క్ లేకపోవడం, ఇతర నమ్మకాలు వంటివి ప్రధాన కారణాలుగా ఉన్నాయని తెలిపింది. గత ఏడాది మార్చి వరకు గృహ వినియోగ సిలిండర్ ధరలు మండిపోయిన విషయం తెలిసిందే. వివిధ రాష్ట్రాలలో అసెంబ్లీ ఎన్నికలు జరగడం, ఇతర కారణాల వల్ల ప్రభుత్వం వంట గ్యాస్ ధరలను భారీగా పెంచలేదు. సగటు భారతీయ కుటుంబానికి ఏడాదిలో వంట చేయడానికి అలాంటి ఎనిమిది సిలిండర్లు అవసరం. అంటే కేవలం వంట గ్యాస్ కోసమే సంవత్సరానికి సుమారు రూ.8,800 ఖర్చు అవుతుంది. సాధారణ ప్రజానీకం ఇంత మొత్తం భరించలేకున్నారు.

నీతిఆయోగ్ పదవ పంచవర్ష ప్రణాళిక ప్రకారం, దారిద్ర్య రేఖకు దిగు వన ఉన్న (బీపీఎల్) కుటుంబం సగటు వార్షిక ఆదాయం రూ. 27,000కి పరిమితం చేశారు. పీఎంయూవై పథకం ప్రాథమిక లబ్దిదారులు వీరే. అంటే వీరి సగటు వార్షిక ఆదాయంలో మూడింట ఒక వంతు వంటగ్యాస్ కోసమే ఖర్చు చేయాల్సి ఉంటుందని సీఎస్ఈ తెలిపింది. వాస్తవ పరిస్థితులు ఇలా ఉండగా, మోదీ ప్రభుత్వం దేశంలో దారిద్ర్యాన్ని అదుపులోకి తీసుకు వచ్చాం, 98 శాతానికి పైగా ప్రజలకు వంటగ్యాస్ అందజేస్తున్నాం వంటి తప్పుడు ప్రచారం చేసుకుంటూ రానున్న సార్వత్రిక ఎన్నికలలో లబ్ధిపొందాలని చూస్తోంది.

ఎం. మురళీకృష్ణ

గత నవంబరు నుంచే నితీశ్‌కు వల

2024 లోకసభ ఎన్నికల్లో ఓటమి చెందవచ్చునన్న భయంతో బిహార్ ప్రభుత్వాన్ని కూల్చి వేసేందుకు 2023 నుంచే మోదీ-షాలు కుట్రపన్నారని విశ్వసనీయ వర్గాలు చెప్తున్నాయి. బీజేపీ నాయకత్వంలో నరేంద్రమోదీ ప్రధానిగా ప్రభుత్వం ఏర్పాటుచేసిన తర్వాత రాష్ట్రాలలో ప్రభుత్వాలను మార్చివేయడం పరిపాటి అయింది. బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి సంఖ్య తగ్గితే ఎంఎల్ఏలను కొనుగోలు చేయడం కూడా జరుగుతోందని దేశమంతటా చెప్పుకుంటున్నదే. బిహార్ ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్ ఇండియా కూటమి ఏర్పాటుకు మొదట ప్రతిపాదిం చారు. ఇండియా కూటమి మొదటి సమావేశం పట్నాలో నిర్వహించారు. అనేక సార్లు పార్టీలు మార్చి నితీశ్‌కుమార్ పరువు పోగొట్టుకున్నారు. ఉదయం ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసి, సాయంత్రం బీజేపీ ఎంఎల్ఏలను కలుపుకుని ప్రభుత్వం ఏర్పాటు చేయడం ఇదే మొదటిసారి కావచ్చు ఇండియా కూటమి బలహీనపడుతుందని మోదీకి లొంగిపోయిన మీడియా ప్రచారంలో పెట్టింది. బిహార్‌లో ఆర్‌జేడీ నాయకులు, లాలూప్రసాద్, ఉప ముఖ్యమంత్రిగా పనిచేసిన తేజస్వీలపై ఉన్న కేసుల విషయంలో సీబీఐ ఉపయోగించి శిక్ష విధించి జైలుకు పంపాలని మోదీ వ్యూహం పన్నారు. ఆర్‌జేడీ, ఇతర కూటమి పార్టీలు కలిసి పోటీ చేసినా జేడీ(యు), బీజేపీ కూటమిని గట్టిగా ఎదుర్కొంటాయి. బిహార్‌లో ఆర్‌జేడీ కూటమికి సీట్లు తగ్గవచ్చు. ఇతర రాష్ట్రాల్లో బీజేపీతో నువ్వా నేనా అని గెలుపు ఉంటాయి. నితీశ్ పదే పదే పార్టీలు, ప్రజలను మోసం చేస్తున్నారని బిహార్‌లో ఇరత రాష్ట్రాల్లో ప్రజలు ఈసడించుకుంటున్నారు. ఇండియా కూటమి కన్వీనర్ చేయలేదన్న ఆక్రోశం కూడా నితీశ్‌కు ఉందంటున్నారు. నిన్న మొన్నటి వరకు, మోదీ-షాలను దూషించిన నితీశ్ ఒక్కసారిగా ఆశ్చర్యకరంగా పార్టీని మార్చడంతో బిహార్ ప్రజలు సహించరని, తగిన గుణపాఠం చెప్తారని ఎన్నికల విశ్లేషకులే గాకుండా ప్రజలు సైతం శాపనార్థాలు పెడుతున్నారు. రాజకీయంగా ఇదే చివరి అవకాశమని, రాజకీయపతనం అవుతుందని చెప్తున్నారు. ఇది క్రూరమైనదని అనుకుంటున్నారు. జేడీ(యు) బీజేపీ కలిసి రాష్ట్రంలో ఉన్న మొత్తం సీట్లను గెలుచుకుంటామని ఆశిస్తుండగా, ప్రజలు ఇందుకు భిన్నంగా ఆలోచిస్తున్నారు. రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. మహాఘట్ బంధన్ ప్రభుత్వం ఏర్పడటానికి ముందు బీజేపీతో ఉన్న పొత్తు నుండి వైదొలిగారు. అప్పుడు జీవితంలో నితీశ్‌తో కలిసి ప్రభుత్వం ఏర్పాటు చేయబోమని మోదీ శపథం చేశారు. అయితే మోదీ ఏ విషయంలోనూ మాటకు కట్టుబడి ఉండే అలవాటులేదు. అబద్ధాలు చెప్పడానికే ప్రాధాన్యం ఇస్తారు. ఇండియా కూటమిని నితీశ్ తీవ్రంగా దెబ్బతీశారని చెప్తున్నారు. నితీశ్ వెళ్లిపోయినప్పటికీ ఇతర రాష్ట్రాల్లో ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాల్లో బీజేపీకి పెద్దగా సీట్లు రాబోవని అంచనా వేస్తున్నారు. నితీశ్ అనేకసార్లు పొత్తు కుదుర్చుకుని ముఖ్యమంత్రి పదవికి ఆరాటపడు తున్నారు. ఇంతవరకు వ్యక్తిత్వం ఉన్నదని భావిస్తుండగా, ప్రభుత్వం కావాలని కోరుకుంటున్న ప్రజలకు ద్రోహం చేశారు. దాదాపు పదేళ్లుగా పాలిస్తున్న మోదీ సామాన్య ప్రజలకు ఏ మాత్రం ప్రయోజనం కలిగించలేదు. కార్మికులకు, కర్షకుల, సామాన్య ప్రజల జీవనాన్ని దుర్భరం చేశారు. నల్లధనులను మరింత సంపన్నులను చేశారు. రాజకీయ మిత్రపక్షాలకు ద్రోహం చేసిన నితీశ్ ప్రజలకు ముఖం చూపలేని స్థితి ఏర్పడింది. నిన్నటి వరకు నితీశ్ ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శిస్తూ బీజేపీ నాయకుడు ఇప్పుడు పొగుడుతున్నారు. రాజకీయాలు ఎంత దిగజారిపోయాయో కనిపిస్తోంది. మోదీ ప్రభుత్వం వచ్చిన తర్వాత రాజకీయాలు మరింత భ్రష్టుపట్టాయి. బిహార్ అసెంబ్లీలో మొత్తం 243 సీట్లున్నాయి. ఆర్‌జేడీకి 79 సీట్లున్నాయి. అన్నిటి కంటే ఇదే పెద్దపార్టీ. బీజేపీ-78 సీట్లు, జేడీ(యు)కి 45 సీట్లు ఉన్నాయి. బీజేపీ, ఎన్‌డీఏ కలిస్తే 128 సీట్లున్నాయి. ఇండియా కూటమికి 114 సీట్లున్నాయి. నితీశ్ ప్రభుత్వానికి, ఇండియా కూటమికి మధ్య సీట్ల తేడా ఎక్కువగా లేదు. స్పీకర్ ఆర్‌జేడీకి చెందిన ఎంఎల్ఏ. ఒకవేళ ఆర్‌జేడీ కొంతమంది ఇతర పార్టీల ఎంఎల్ఏలను ఆకట్టుకుని నితీశ్ ప్రభుత్వాన్ని ఓడించవచ్చునని, అందుకు స్పీకర్ అవాధ్ బిహారి చౌదరి సహకరించ వచ్చునన్న సందేహంతో స్పీకర్‌ను తప్పించే ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పుడు బిహార్‌లో పరిస్థితి మరింత క్లిష్టంగా ఉంది.

టి.వి.ఎస్

నితీశ్ మాకు అక్కర్లేదు

- కుల గణన కోసం ఒత్తిడి తెస్తే సీఎం యూటర్న్
- సామాజిక న్యాయం కోసం మహాకూటమి పోరు ఆగదు
- పూర్ణియా ర్యాలీలో రాహుల్ గాంధీ
- అవకాశమిస్తే రైతులు మళ్లీ ప్రభుత్వాన్ని నమ్మేలా చేస్తామని హామీ

పూర్ణియా: బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ తమకు అసలు అక్కర్లేదని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఉద్ఘాటించారు. రాష్ట్రంలో సామాజిక న్యాయం కోసం మహాకూటమి తన పోరాటాన్ని కొనసాగిస్తుందని, అందుకోసం నితీశ్ అవసరం లేదన్నారు. దొడ్డిదారిన ఎన్డీయేలోకి జేడీయూ అధినేత జారుకున్నారని వ్యాఖ్యానించారు. 'ఆయన (నితీశ్) యూటర్న్ వెనుక కారణాన్ని అర్థం చేసుకోండి. బీహార్‌లో కులగణన జరగాల్సిందే అని కచ్చితంగా చెప్పా. సర్వే నిర్వహించమని నితీశ్ మీద ఆర్జేడీతో పాటు కాంగ్రెస్ ఒత్తిడి తేవడంతో భయపడిన బీజేపీ మా ప్రణాళికను అడ్డుకుంది. దీంతో నితీశ్ ఇరకాటంలో పడ్డారు. ఈ పరిస్థితిని తప్పించుకునేందుకు ఆయనకు దొడ్డిదారిని బీజేపీ చూపింది. కొద్దిపాటి ఒత్తిడిని తట్టుకోలేక నితీశ్ యూటర్న్ తీసుకున్నారు' అని రాహుల్ అన్నారు. భారత్ జోడో న్యాయ యాత్ర మంగళవారం పూర్ణియా జిల్లాలోకి ప్రవేశించింది. రంగ్‌భూమి మైదానంలో ర్యాలీని ఉద్దేశించి మాట్లాడుతూ నితీశ్ కుమార్ తీరును కాంగ్రెస్ ఎంపీ దుయ్యబట్టారు. నితీశ్ కుమార్ పిల్లిమొగ్గలు వేస్తుంటారు. ప్రమాణ స్వీకారం కోసం రాజ్‌భవన్‌కు వెళ్లారు. ఆ తర్వాత అక్కడ నుంచి వెళ్లిపోయారు. అయితే కారులో ఉన్నప్పుడు తన షాల్‌ను మర్చిపోయినట్లు గ్రహించి తిరిగి రాజ్‌భవన్‌కు చేరుకున్నారు. అప్పుడే వచ్చారేమిటని గవర్నర్ ఆయనను అడిగారు' అని రాహుల్ వ్యాఖ్యానించారు. ప్రజా సమస్యలను తమ కూటమి లేవనెత్తుతుండటం వల్లే ఆయనపై కులగణన కోసం ఒత్తిడి తెచ్చినట్లు తెలిపారు. దేశంలోని అన్ని రంగాల్లో దళితులు, వెనుకబడిన వర్గాలకు సముచిత ప్రాతినిధ్యం లభించడం లేదన్నారు. కులగణన దేశానికి అత్యవసరమని, అప్పుడే దళితులు, ఓబీసీలు, గిరిజనులు, ఇతర వర్గాల సంఖ్య తేలుతుందని చెప్పారు. మోదీ ప్రభుత్వంపైనా రాహుల్ విమర్శలు గుప్పించారు. రైతుల నమ్మకాన్ని మోదీ ప్రభుత్వం పోగొట్టుకున్నదన్నారు. తాము అధికారంలోకి వస్తే ప్రభుత్వంపై రైతులు తిరిగి విశ్వసించేలా చేస్తామని హామీనిచ్చారు. రైతుల మాదిరి తలకు తుండు చుట్టుకొని రైతులు, కూలీలతో రాహుల్ ముచ్చటించారు. రైతుల భయాలను తొలగించడంలో మోదీ ప్రభుత్వం విఫలమైందని, వారి నమ్మకాన్ని కోల్పోయిందన్నారు. 'మాకు ఒక అవకాశమివ్వండి. మీ నమ్మకాన్ని తిరిగి పొందుతాం' అని రైతులతో రాహుల్ అన్నారు. తానవి ఒట్టిమాటలు... డొల్ల హామీలు కాదని చెప్పారు. రైతుల కోసం భూ సేకరణ బిల్లును తెచ్చామని, రూ.72వేల కోట్ల రుణమాఫీ చేశామని, చత్తీస్‌గఢ్, రాజస్థాన్ (పార్టీ అధికారంలో ఉన్నప్పుడు) రాష్ట్రాల్లో పంటలకు మద్దతు ధర కల్పించినట్లు రాహుల్ గుర్తుచేశారు. మణిపూర్ అంశాన్ని ప్రస్తావిస్తూ ఆ రాష్ట్రంలో యుద్ధం జరుగుతోందన్నారు. ప్రధాని ఇంత వరకు ఆ రాష్ట్రానికి వెళ్లలేదని రాహుల్ వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తన విమానం ఆలస్యమైనందున ర్యాలీలో పాల్గొనలేకపోయినట్లు కాంగ్రెస్ బీహార్ అధ్యక్షుడు అఖిలేశ్ ప్రసాద్ తెలిపారు. అయితే బహిరంగ సభనుద్దేశించి ఖర్గే వర్చువల్‌గా ప్రసంగించారు. అలాగే చత్తీస్‌గఢ్ మాజీ సీఎం భూపేశ్ బాఘెల్, సీపీఐ(ఎంఎల్) ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య కూడా మాట్లాడారు. 28 విపక్ష పార్టీల ఇండియా కూటమిలో కాంగ్రెస్, టీఎంసీ, ఆప్, సీపీఐ(ఎంఎల్) ఉన్న విషయం తెలిసిందే.

పాకిస్థానీ నావికులను కాపాడిన భారత్

ముంబై: అరేబియా సముద్రంలో 36 గంటల వ్యవధిలో భారత్ మరోసారి సాహసోపేత ఆపరేషన్ చేపట్టింది. సోమాలియా సముద్రపు దొంగల చెర నుంచి 19 మంది పాకిస్థానీ నావికులను రక్షించింది. యుద్ధనౌక ఐఎన్ఎస్ సుమిత్రను రంగంలోకి దింపి సముద్రపు దొంగలను తరిమికొట్టింది. ఈ మేరకు భారత నావికాదళం మంగళవారం వెల్లడించింది. సోమవారం సోమాలియా తీరంలో ఇరాన్ జెండాతో ఉన్న అల్ నయీమీ ఫిషింగ్ నౌకను సాయుధ సముద్రపు దొంగలు చుట్టుముట్టారు. 19 మంది పాకిస్థానీ నావికులను బంధించారు. దీనిపై సమాచారం అందుకున్న భారత యుద్ధనౌక... ఓడను అడ్డగించి, బందీలను విడిపించింది. కొద్ది గంటల ముందు కూడా భారత్ ఇదే తరహా ఆపరేషన్ చేపట్టింది. శనివారం రాత్రి అరేబియా సముద్రంలో ఇరాన్ చేపల బోటు ఇమాన్‌ను సోమాలియా దొంగలు అపహరించారు. రక్షించమంటూ ఈ బోటు నుంచి ఆదివారం భారత్ నౌకాదళానికి అత్యవసర సందేశం అందింది. ఐఎన్ఎస్ సుమిత్ర, అడ్వాన్స్‌డ్ లైట్ హెలికాప్టర్ ధ్రువ్ రంగంలోకి దిగి... 17 మంది మత్స్యకారులను రక్షించిన సంగతి తెలిసిందే. హమాస్ లక్ష్యంగా ఇజ్రాయిల్ దాడుల నేపథ్యంలో హౌతీ తిరుగుబాటుదారులు కొద్ది రోజులుగా ఎర్రసముద్రంలో వాణిజ్య నౌకలే లక్ష్యంగా దాడులు చేస్తున్న సంగతి తెలిసిందే. ఇటీవల గల్ఫ్ ఆఫ్ ఎడెన్‌లో ఆయిల్ ట్యాంకర్లతో వెళుతున్న మార్లిన్ లాండ నౌకపై క్షిపణితో దాడి చేశారు. ఆ నౌక నుంచి వచ్చిన అత్యవసర సందేశానికి స్పందించిన భారత నేవీ... సమీపంలోని 'ఐఎన్ఎస్ విశాఖపట్నం'ను రంగంలోకి దింపి, సహాయ చర్యలు చేపట్టింది.

కర్నాటకలో మరో దారుణం
విద్యార్థులతో మరుగుదొడ్లు కడిగించిన టీచర్లు

బెంగళూరు: విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పాల్సిన పాఠశాలలు, అందులో పనిచేస్తున్న ఉపాధ్యాయులు మానవత్వం మరిచి ప్రవర్తిస్తున్నారు. కర్నాటకలోని కొన్ని పాఠశాలలు విద్యార్థుల పట్ల మూర్ఖంగా ప్రవర్తిస్తున్నాయి. విద్యాబుద్ధులు నేర్పించకుండా... కూలీల తరహాలో పనులు చేయిస్తున్నాయి. కొన్ని రోజుల క్రితమే... ఓ స్కూల్ ప్రిన్సిపాల్ విద్యార్థులతో పాఠశాలలోని మరుగుదొడ్లు కడిగించడమే కాకుండా తన ఇంటి పనులు కూడా చేయించుకున్న ఘటన వెలుగులోకి వచ్చింది. ఇది మరువకముందే...అలాంటిదే మరో ఘటన కర్నాటకలో చోటుచేసుకుంది. ఇద్దరు విద్యార్థినులు మరుగుదొడ్లు కడుగుతున్న వీడియో ఒకటి బయటపడింది. చిక్కబళ్లాపూర్‌లో ఉన్న ఓ ప్రభుత్వ పాఠశాలలో ఈ ఘటన జరిగింది. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ కాగా...నెటిజన్లు ఆ పాఠశాల యాజమాన్యంపై దుమ్మెత్తిపోస్తున్నారు. చదువు చెబుతారన్న నమ్మకంతో తల్లిదండ్రులు తమ పిల్లలను స్కూలుకి పంపితే... ఇదా మీరు చేయించేదని మండిపడ్డారు. ఈ వ్యవహారంపై ప్రభుత్వం వెంటనే స్పందించాలని, పిల్లలతో ఇలాంటి పనులు చేయిస్తున్న టీచర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఇది ప్రభుత్వం దృష్టికి చేరడంతో... ఒక బృందం రంగంలోకి దిగింది. ఆ పాఠశాలను సందర్శించి, అక్కడి పరిస్థితులను సమీక్షించింది. అయితే.. ఆ స్కూల్ టీచర్లపై చర్యలు తీసుకున్నారా? లేదా? అనే విషయం తెలియదు. ఈ ఘటన కర్నాటకలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న దుర్భర పరిస్థితులను ఎత్తిచూపుతోంది. కాగా... గతంలో కోలార్‌లోని యలవల్లి మొరార్జీ దేశాయ్ రెసిడెన్షియల్ స్కూల్‌లో, బెంగళూరులోని అందరహళ్లి ప్రభుత్వ పాఠశాలలోనూ పిల్లలతో ఇలాంటి పనులు చేయించారు. అందుకు సంబంధించిన వీడియోలు వైరల్ అవ్వడంతో... అధికారులు రంగంలోకి దిగి తగిన చర్యలు తీసుకున్నారు. గతేడాది డిసెంబరులోనూ శివమొగ్గలో ఇలాంటిదే మరో ఘటన వెలుగు చూసినప్పుడు... కర్నాటక విద్యాశాఖ ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలిని వెంటనే సస్పెండ్ చేసింది. ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ కూడా తీవ్రంగా స్పందించారు. ఇలాంటి పనులు చేయమని పిల్లలను బలవంతం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రాజ్యసభకు సత్నామ్ సింగ్ సంధూ
నామినేట్ చేసిన రాష్ట్రపతి

న్యూఢిల్లీ: పంజాబ్‌కు చెందిన విద్యావేత్త, చండీగఢ్ యూనివర్సిటీ వ్యవస్థాపకుడు సత్నామ్ సింగ్ సంధూ రాజ్యసభకు నామినేట్ అయ్యారు. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆయనను ఎగువసభకు నామినేట్ చేసినట్లు తెలుపుతూ కేంద్ర హోంమంత్రిత్వశాఖ మంగళవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. పంజాబ్‌కు చెందిన ఓ మధ్యతరగతి రైతు కుటుంబంలో సత్నామ్ సింగ్ సంధూ జన్మించారు. చిన్నతనంలో చదువుకునేందుకు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తనలా ఎవరూ బాధలు అనుభవించకూడదని అప్పుడే ఆయన నిర్ణయించుకున్నారు. ప్రపంచస్థాయి నైపుణ్యాలతో విద్య అందించేందుకు 2001లో మొహాలీ ప్రాంతంలో చండీగఢ్ గ్రూప్ ఆఫ్ కాలేజీలు స్థాపించారు. ఆ తర్వాత 2012లో చండీగఢ్ యూనివర్సిటీని ఏర్పాటుచేశారు. 2023 సంవత్సరానికిగానూ క్యూఎస్ వరల్డ్ రికార్డ్స్‌లో ఈ విశ్వవిద్యాలయం చోటు దక్కించుకుంది. ఆసియాలోనే అత్యుత్తమ ప్రైవేటు వర్సిటీగా తొలిస్థానంలో నిలిచింది. ప్రస్తుతం ఈ వర్సిటీకి ఆయన ఛాన్సలర్‌గా వ్యవహరిస్తున్నారు. దేశంలోనే ప్రముఖ విద్యావేత్తగా ఎంతో పేరు తెచ్చుకున్న సంధూ... దాతృత్వంలోనూ ముందువరుసలో ఉంటారు. లక్షల మంది విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ఆర్థికసాయం చేస్తున్నారు. రెండు ఛారిటీ సంస్థలు నిర్వహిస్తున్నారు. విద్యారంగంలో ఆయన సేవలను గుర్తించి కేంద్రం ఆయనకు రాష్ట్రపతి కోటాలో రాజ్యసభ సభ్యత్వం కల్పించింది. కాగా, సంధూకు ప్రధాని నరేంద్రమోదీ అభినందనలు తెలిపారు. 'సత్నామ్‌జీ గొప్ప విద్యావేత్త. అట్టడుగు స్థాయి ప్రజలకు సేవ చేస్తూ సామాజిక కార్యకర్తగానూ గుర్తింపు తెచ్చుకున్నారు. దేశ సమైక్యత కోసం విస్తృతంగా పనిచేస్తున్నారు. ఆయన పార్లమెంటరీ ప్రయాణం ఉత్తమంగా ఉండాలని కోరుకుంటున్నా' అని ప్రధాని సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు.

ప్రతిపక్ష నేతలే లక్ష్యంగా ఈడీ దాడులు

- దిల్లీలో జార్ఖండ్ సీఎం ఇంట సోదాలు
- రూ.25 లక్షలు, కారు స్వాధీనం చేసుకున్నామని వెల్లడి

న్యూఢిల్లీ/పాట్నా: కేంద్రంలోని మోదీ సర్కారు దేశంలోని దర్యాప్తు సంస్థలను ప్రతిపక్షనేతలను వేధించడానికి ఆయుధాలుగా మార్చుకుంది. మోదీ చేతిలో ఈడీ, సీబీఐ కీలుబొమ్మలుగా మారాయి. ప్రత్యేకించి ప్రతిపక్ష పార్టీలు పాలిస్తున్న రాష్ట్రాలపై మోదీ సర్కారు కక్షకట్టింది. ఈ విధంగా గత కొన్నేళ్లుగా ప్రతిపక్ష పార్టీల నాయకులు మొత్తుకుంటూనే ఉన్నారు. అయినా మోదీ సర్కారు దర్యాప్తుసంస్థలను ప్రతిపక్ష పార్టీలపైకి ఉసిగొల్పుతూనే ఉంది. తాజాగా భూకుంభకోణానికి సంబంధించి మనీ లాండరింగ్ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ దిల్లీ నివాసంలో సోదాలు జరిపిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు రూ. 36 లక్షలు, బీఎమ్‌డబ్ల్యూ ఎస్‌యూవీ, కొన్ని అభ్యంతరకర పత్రాలను స్వాధీనం చేసుకున్నాయి. ఈ మేరకు ఈడీ అధికారిక వర్గాలు మంగళవారం వెల్లడించాయి. ఈడీ అధికారులు సోమవారమే దక్షిణ దిల్లీలోని జేఎంఎం నాయకుడి 5/1 శాంతి నికేతన్ భవనంలో సోదాలు నిర్వహించింది. వారం రోజుల క్రితం సోరెన్ రాంచీ నుంచి దిల్లీకి వెళ్లినట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే ఆయన్ను విచారించేందుకు సోమవారం దిల్లీలోని సోరెన్ ఇంటికి వెళ్లింది ఈడీ. సోరెన్ అందుబాటులో లేని నేపథ్యంలో ఆయన రాక కోసం దాదాపు 13 గంటల పాటు ఎదురుచూసింది. అయితే, సోరెన్ అక్కడ లేకపోవడం వల్ల ఇంట్లో సోదాలు నిర్వహించింది. హరియాణా రిజిస్ట్రేషన్ నెంబర్ ఉన్న ఓ బీఎండబ్ల్యూ సహా మరో కారు, రూ.36 లక్షల నగదును స్వాధీనం చేసుకుంది. బీఎండబ్ల్యూ కారు బినామీ పేరు మీద ఉందని ఈడీ వర్గాలు తెలిపాయి. నేరానికి సంబంధించి కొన్ని పత్రాలను సైతం స్వాధీనం చేసుకున్నట్లు వివరించాయి. కాగా, సోరెన్ వ్యక్తిగత పని మీద వెళ్లారని సమాచారం. మంగళవారం మధ్యాహ్నానికి ఆయన రాంచీ చేరుకునే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. విచారణ కోసం జనవరి 31న రాంచీలోని తన నివాసానికి రావాలని ఇప్పటికే ఈడీకి సందేశం పంపించారు సోరెన్. బుధవారం మధ్యాహ్నం ఒంటి గంటకు అందుబాటులో ఉంటానని తెలిపారు.

ఈడీ ఎదుట తేజస్వి హాజరు

బీహార్‌లో 'ల్యాండ్ ఫర్ జాబ్స్' కేసులో మంగళవారం ఈడీ ఎదుట ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ కుమారుడు తేజస్వియాదవ్ హాజరయ్యారు. మంగళవారం ఉదయం 11.30 గంటల సమయంలో పాట్నాలోని ఈడీ కార్యాలయానికి చేరుకున్నారు. దీంతో ఈడీ కార్యాలయం ముందు పెద్ద సంఖ్యలో ఆర్జేడీ కార్యకర్తలు గుమిగూడారు. తమ నేతకు మద్దతుగా, మోదీ సర్కారుకు వ్యతిరేకంగా నినదించారు. ఈ కేసులో తేజస్వీ యాదవ్ నివాసంలో ఈడీ సోదాలు నిర్వహించింది. ఈ కేసులో లాలు, తేజస్విని ప్రశ్నించేందుకు ఈ నెల 19న ఈడీ తాజాగా సమన్లు జారీ చేసింది. సహా సోమవారం లాలూని 9 గంటలపాటు ఈడీ అధికారులు ప్రశ్నించారు. ల్యాండ్ ఫర్ జాబ్స్ కేసులో తమ ఆరోపణలు నిజమేనని ఈడీ చెబుతోంది. అక్రమంగా రైల్వే ఉద్యోగాలు ఇచ్చి లంచాలు తీసుకున్నట్లు ఈడీ అధికారులు ఆరోపించారు. మాజీ ముఖ్యమంత్రి, లాలూ ప్రసాద్ భార్య రాబ్డీ దేవి గోశాలలో పనిచేసే వ్యక్తి పేరుపై మొదట రైల్వే ఉద్యోగుల నుంచి లంచాలు తీసుకున్నారని ఈడీ చెబుతోంది. అనంతరం ఆ ఆస్తుల్ని లాలూ కుమార్తె హేమా యాదవ్‌కు బదిలీ చేశారని ఆరోపించింది. ఏకే ఇన్ఫోసిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్, ఏబీ ఎక్స్‌పోర్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ షెల్ కంపెనీలకు నిధుల్ని బదిలీ అయినట్లు గుర్తించామని ఈడీ అధికారులు అంటున్నారు. ఆయా కంపెనీల షేర్లు లాలూ కుటుంబ సభ్యులకు బదిలీ అయ్యాయని పేర్కొన్నారు. అమిత్ కత్యాల్ అనే వ్యక్తి లాలూ ప్రసాద్ యాదవ్ కోసం ఈ కంపెనీలను నిర్వహించాడని తమ దర్యాప్తులో వెల్లడైనట్లు ఈడీ చెబుతోంది.

ఇది రాజకీయ వేధింపే: ఆర్జేడీ

బీజేపీ అధిష్ఠానం ప్రతిపక్ష పార్టీలను చీల్చేందుకే ఈడీ, సీబీఐ, ఐటీ శాఖలను ప్రయోగిస్తోందని ఆర్జేడీ ఎంపీ మనోజ్ ఝా పేర్కొన్నారు. ఇది పూర్తిగా రాజకీయ కక్షసాధింపుగానే చూస్తామన్నారు. ఇటువంటి బెదిరింపులకు ఆర్జేడీ బెదిరిపోయే ప్రశ్నే లేదన్నారు. ఈడీ కుంభకోణం జరిగినట్లు చెబుతున్న సమయంలో తేజస్వి మైనర్ అన్న విషయం తెలిసిందేనని ఆర్జేడీ ఎమ్మెల్సీ శక్తి సింగ్ పేర్కొన్నారు.గత మహాకూటమి ప్రభుత్వంలో అతను యువతకు పెద్ద సంఖ్యలో ఉద్యోగాలు కల్పించడంతో బీజేపీ నాయకులు ఓర్వలేకపోతున్నారని చెప్పారు.

గవర్నర్లా? బీజేపీ అధికార ప్రతినిధులా?
తమిళనాడు మంత్రి రేగుపతి విమర్శలు

చెన్నై: రాష్ట్రప్రభుత్వాలను విమర్శించడం ద్వారా తమిళనాడు, తెలంగాణ, కేరళ గవర్నర్లు రవి, తమిళిసై సౌందరరాజన్, ఆరిఫ్ మహమ్మద్ ఖాన్ నిత్యం మీడియా దృష్టిని ఆకర్షించడానికి ప్రయత్నిస్తున్నారని తమిళనాడు న్యాయశాఖ మంత్రి ఎస్ రేగుపతి విమర్శించారు. తాము గవర్నర్లన్న సంగతి మర్చిపోయి బీజేపీ అధికార ప్రతినిధులలా ప్రవర్తిస్తున్నారని దుయ్యబట్టారు. నాగపట్నం జిల్లాలో పాలనాపరమైన ఉదాసీనత, ప్రధానమంత్రి ఆవాస్ యోజన అమలులో అవినీతికి పాల్పడ్డారని గవర్నర్ రవి విమర్శలు చేయడాన్ని ఆయన ఖండించారు. ఏ ప్రాతిపదికన గవర్నర్ ఇలాంటి ఆరోపణలు చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ పథకానికి సంబంధించి స్పష్టత కావాలంటే ప్రభుత్వంతో విచారణ చేయించి ఉండేవారని రేగుపతి అన్నారు. గవర్నర్‌గా ఉంటూ రాజకీయాలు చేయడం కంటే... బీజేపీ నాయకత్వం అనుమతిస్తే రాజకీయాల్లోకి రావచ్చునన్నారు. గవర్నర్ రాజ్యాంగ పరంగా తన పరిధి దాటి వ్యవహరిస్తున్నారని రేగుపతి విమర్శించారు. కుటుంబ నిశ్చితార్థాల కోసం రవి తరచుగా దిల్లీకి వెళుతుంటారని, తమిళనాడు ప్రజల కోసం గవర్నర్ ఎప్పుడైనా దిల్లీకి వెళ్లారా అని మంత్రి ప్రశ్నించారు. గవర్నర్ రవి రాష్ట్రానికి ఎలాంటి మేలు చేయలేదన్నారు. అలాగే తమిళనాడు అభివృద్ధికి, ప్రజల అభివృద్ధికి కృషి చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌కు ఆయన ఎటువంటి సహకారం అందించరన్నారు. అన్నింటికి మించి రాష్ట్రాభివృద్ధికి రవి అడ్డంకులు సృష్టిస్తున్నారని రేగుపతి ఆరోపించారు.

భారత్ న్యాయ యాత్రలో భాగస్వాములు కండి: కాంగ్రెస్



న్యూఢిల్లీ: భారత్ జోడో యాత్ర మాదిరిగానే భారత్ జోడో న్యాయ్ యాత్రలో కూడా ప్రజలు కృత నిశ్చయంతో భాగస్వాములు కావాలని కాంగ్రెస్ పార్టీ పిలుపునిచ్చింది. ఈ సందర్భంగా ఇదేరోజు (జనవరి 30, 2023)న రాహుల్ గాంధీ కశ్మీర్‌లో జోడో యాత్ర ముగింపు సందర్భంగా జాతీయ పతాకాన్ని ఎగురవేయడాన్ని గుర్తుచేసింది. ఈ మేరకు కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ 'ఎక్స్'లో ఉంచిన పోస్ట్‌లో ఇల్లా అన్నారు: "ఒక సంవత్సరం క్రితం ఇదే రోజున కన్యాకుమారి నుండి కాశ్మీర్ వరకు సాగిన చారిత్రాత్మక భారత్ జోడో యాత్రను ముగించి... రాహుల్ గాంధీ లాల్ చౌక్ వద్ద భారత జెండాను ఆవిష్కరించారు. మంచుతో నిండిన శ్రీనగర్‌లో ఉద్వేగభరిత ప్రసంగం చేశారు. ఇప్పుడు మేము దేశంలో అన్యాయానికి వ్యతిరేకంగా మా గళం వినిపిస్తున్నాం. మేము మరోసారి భారత్ జోడో న్యాయ్ యాత్ర ద్వారా ప్రజల మధ్య ఉన్నాము. ఈ ప్రయాణంలో కోట్లాది మంది భారతీయులు మాతో ఉన్నారు - ఈ యాత్రలో చేరిన లేదా మద్దతు ఇచ్చిన వారందరికీ మేము హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నాము" అని పేర్కొన్నారు. సమ్మిళిత, న్యాయమైన, సుసంపన్నమైన భారతదేశం కోసం కాంగ్రెస్ కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. 'న్యాయం కోసం జరుగుతున్న ఈ పోరాటంలో మేము మీ నిరంతర, దృఢమైన భాగస్వామ్యాన్ని కోరుకుంటున్నాము' అన్నారాయన. జనవరి 14న మణిపూర్‌లో ప్రారంభమైన భారత్ జోడో న్యాయ్ యాత్ర ప్రస్తుతం బీహార్‌లో కొనసాగుతోంది. జనవరి 31న మాల్దా మీదుగా పశ్చిమ బెంగాల్‌లోకి తిరిగి ప్రవేశించనుంది. యాత్ర 67 రోజుల పాటు 6,713 కి.మీ.లు 15 రాష్ట్రాల్లోని 110 జిల్లాల మీదుగా సాగనుంది. మార్చి 20 లేదా 21 తేదీల్లో ముంబైలో ముగుస్తుంది.

కర్నాటక నుంచి ప్రియాంక గాంధీ?
దక్షిణాదిపై పట్టు కోసం కాంగ్రెస్ ఎత్తులు

బెంగళూరు: త్వరలో జరిగే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ముఖ్యనేత ప్రియాంక గాంధీ కర్నాటక నుంచి పోటీ చేస్తారని రెండురోజులుగా చర్చ జరుగుతోంది. దిల్లీ నుంచి బెంగళూరు దాకా ఇదే ప్రధాన అంశమైంది. ప్రియాంకగాంధీని రాష్ట్రం నుంచి పోటీ చేయించడం ద్వారా ఎక్కువ స్థానాల్లో విజయం సాధించవచ్చునని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నేతలు ఆలోచనగా ఉన్నట్లు తెలుస్తోంది. అందుకే సురక్షితమైన నియోజకవర్గాన్ని ఎంపిక చేసినట్లు సమాచారం. రాష్ట్ర నేతలకు సమాచారం లేకుండానే దిల్లీ ముఖ్యుల పర్యవేక్షణలోని బృందాలు కొప్పళ నియోజకవర్గంలో సర్వే జరిపినట్లు తెలిసింది. ప్రియాంకగాంధీని తెలంగాణ నుంచి కూడా పోటీ చేయించాలనే డిమాండ్ ఉంది. ప్రస్తుతం దక్షిణాదిన రెండు రాష్ట్రాల్లో పటిష్టమైన కాంగ్రెస్ ప్రభుత్వాలు ఉన్నందున ఇక్కడి నుంచే పోటీ చేయించాలని, తద్వారా ఇక్కడ ఎక్కువ ఎంపీ స్థానాలు కైవసం చేసుకోవాలని పార్టీ పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ పార్టీ నాయకులు, క్రియాశీలక కార్యకర్తలు సోషల్ మీడియా వేదికగా ప్రియాంకగాంధీని ఆహ్వానిస్తున్నారు. రాష్ట్రానికి చెందిన ముఖ్యనేతలకు సమగ్ర సమాచారం లేకపోవడంతో ఈ ప్రచారంపై ఎటువంటి వ్యాఖ్యలు చేయడం లేదు. బీజేపీకి చెందిన కొప్పళ లోక్‌సభ సభ్యుడు కరడి సంగణ్ణకు సొంతపార్టీలోనే తీవ్ర వ్యతిరేకత వచ్చింది. అతడికి కాకుండా మరెవరికైనా టికెట్ ఇవ్వాలని బహిరంగంగానే నియోజకవర్గ ముఖ్యులు డిమాండ్ చేస్తున్నారు. ఇటీవలే బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్రను కలిసిన స్థానిక ముఖ్యులు మరోసారి సంగణ్ణకు టికెట్ ఇస్తే సహకరించేది లేదని తేల్చి చెప్పినట్లు సమాచారం. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉండటం, పైగా ఎన్నికలకు ముందు ప్రకటించిన ఐదు గ్యారెంటీలు అమలు చేస్తుండటంతో లోక్‌సభ ఎన్నికలలోను గెలుపు సునాయాసమని కాంగ్రెస్ వర్గాలు భావిస్తున్నాయి. కొప్పళ పరిధిలో 8 శాసనసభ నియోజకవర్గాలు ఉండగా ఆరుచోట్ల కాంగ్రెస్ విజయం సాధించింది. ఒక స్థానంలో గాలి జనార్దనరెడ్డి, మరోస్థానంలో బీజేపీ విజయం సాధించాయి. ప్రస్తుతం కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఎక్కువ ఉన్నందున విజయం సాధ్యమనే అంచనాలతోనే ప్రియాంకగాంధీని ఆహ్వానిస్తున్నట్లు సమాచారం. రాష్ట్రానికి గాంధీ కుటుంబంతో దశాబ్దాలుగా ప్రత్యేక సంబంధాలు ఉన్నాయి. ఇందిరాగాంధీకి రాజకీయంగా పునర్జన్మ ఇక్కడి నుంచే సాధ్యమైంది. చిక్కమగళూరు నుంచి ఇందిరాగాంధీ విజయం సాధించగా 1999లో సోనియాగాంధీ బళ్లారి నుంచి పోటీ చేసి విజయం నమోదు చేశారు. అదే తరహాలోనే ప్రియాంకగాంధీని కూడా రాష్ట్రం నుంచి పోటీ చేయించాలని అధిష్ఠానం ఆలోచనగా ఉన్నట్లు తెలుస్తోంది. ప్రియాంకగాంధీ పోటీపై రెండు వారాలలో స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

నిరుద్యోగంతో యువత అగచాట్లు

దేశంలో అసలు సమస్య నిరుద్యోగం, ద్రవ్యోల్బణమని, వాటికి మోదీ ప్రభుత్వం వద్ద పరిష్కారం లేదని, దీనికి నిదర్శనం ఇజ్రాయిల్‌కి కార్మికులను పంపేందుకు చేపట్టిన రిక్రూట్‌మెంట్ డ్రైవ్ కోసం యువత క్యూలైన్లలో గంటల పాటు వేచి చూడటమేనని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ మంగళవారం మండిపడ్డారు. వారంతా మన దేశ పిల్లలు కాదా అని కేంద్రాన్ని నిలదీశారు. 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ గురించి చర్చ, మోదీ హామీలు అన్నీ కేవలం జుమ్లా (తప్పుడు వాగ్దానాలు) అని తెలిపారు. వాస్తవానికి ఎక్కడైనా యుద్ధ పరిస్థితులు ఏర్పడితే... మొదట అక్కడి నుండి మన దేశ ప్రజలను కాపాడి తిరిగి దేశానికి తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తామని, . కానీ నేడు యుద్ధంలో దెబ్బతిన్న ఇజ్రాయిల్‌కు వెళ్లే ప్రమాదం నుండి వేలాది మంది నిస్సహాయ యువతను మోదీ ప్రభుత్వం రక్షించడం లేదని, మన దేశంలో నిరుద్యోగం తీవ్రమైందనడానికి ఇదే నిదర్శనమని ప్రియాంక ఆరోపించారు. దీంతో 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ, ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు, మోదీ హామీలు అన్నీ ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు కేవలం జుమ్లా అని మండిపడ్డారు. దేశంలో యువతకు ఉద్యోగాలు ఎందుకు లభించడం లేదని మోదీ ప్రభుత్వాన్ని నిలదీశారు. ఇంత భయంకరమైన యుద్ధం మధ్యలోకి వారిని పంపడానికి సిద్ధమయ్యామని, రెండు రోజుల పాటు క్యూలో నిల్చున్న ఆ యువత మన పిల్లలు కాదా అని ప్రశ్నించారు. మోదీ ప్రభుత్వం ఎంత తెలివిగా దీన్ని దేశ యువత వ్యక్తిగత సమస్యగా మార్చిందో గమనించాలని యువతను హెచ్చరించారు. ఇందులో ప్రభుత్వ పాత్ర ఏమిటి? భారత యువతను బలితీసుకోవడానికి ఇజ్రాయిల్‌కు భారత ప్రభుత్వం ఏ ప్రాతిపదికన అనుమతి ఇచ్చింది? యువకుల ప్రాణాలను, ఆస్తులను రక్షించే బాధ్యత ఎవరు తీసుకుంటారు? వారి ప్రాణాలకు ముప్పు వాటిల్లితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నలు సంధించారు.

చండీగఢ్ మేయర్ పీఠం బీజేపీ వశం
ఈ గెలుపు మోసపూరితం: ఆప్, కాంగ్రెస్ కౌన్సిలర్ల విమర్శ

చండీగఢ్: చండీగఢ్ మేయర్ ఎన్నికలో నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. అధికార ఆమ్‌ఆద్మీ, కాంగ్రెస్ పార్టీకి కౌన్సిల్‌లో తగిన మెజారిటీ ఉన్నప్పటికీ మేయర్‌గా బీజేపీ అభ్యర్థి మనోజ్ సోంకర్ విజయం సాధించారు. మంగళవారం జరిగిన ఈ ఎన్నికల్లో ఆమ్‌ఆద్మీ, కాంగ్రెస్ ఉమ్మడి అభ్యర్థి కులదీప్ కుమార్‌పై మనోజ్ గెలుపొందారు. పంజాబ్, హరియాణా హైకోర్టు ఆదేశాలకు అనుగుణంగా మేయర్ ఎన్నిక జరిగింది. భారీ భద్రత నడుమ జరిగిన ఈ ఎన్నికల్లో మేయర్ పీఠం బీజేపీ కైవసం చేసుకుంది. కాగా ఫలితాలు వెలువడగానే సభలో తీవ్ర గందరగోళం నెలకొంది. బీజేపీ మోసపూరితంగా మేయర్ పదవిని దక్కించుకుందని, ఎన్నికల నియమావళిని ఉల్లంఘించిదని కాంగ్రెస్, ఆప్ కౌన్సిలర్లు ఆరోపించారు. మొత్తం పోలైన 36 ఓట్లలో మనోజ్ సోంకర్‌కు 16 ఓట్లు వచ్చాయి. చండీగఢ్ ఎంపీ కిరణ్ ఖేర్ ఎక్స్-అఫీషియో మెంబర్‌గా బీజేపీ అభ్యర్థికి ఓటు వేశారు. ఆమ్‌ఆద్మీ, కాంగ్రెస్ ఉమ్మడి అభ్యర్థికి కేవలం 12 ఓట్లు లభించాయి. 8 ఓట్లు చెల్లుబాటు కాకపోవడం గమనార్హం. ఆప్-కాంగ్రెస్ మధ్య కుదిరిన పొత్తులో భాగంగా మేయర్ పదవి కోసం ఆమ్‌ఆద్మీ , సీనియర్ డిప్యూటీ మేయర్, డిప్యూటీ మేయర్ పదవుల కోసం కాంగ్రెస్ అభ్యర్థులను నిలబెట్టాయి. ఐతే సీనియర్ డిప్యూటీ మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నికల్లో ఓట్లు వేసేందుకు ఆమ్‌ఆద్మీ, కాంగ్రెస్ పార్టీల కౌన్సిలర్లు నిరాకరించారు. దీంతో బీజేపీ అభ్యర్థి రాజేందర్ కుమార్ డిప్యూటీ మేయర్‌గా గెలుపొందారు. కాగా, చండీగఢ్ మున్సిపల్ కార్పొరేషన్‌లో మొత్తం 35 మంది సభ్యులు ఉన్నారు.

వచ్చే ఎన్నికల్లో వాళ్లు ఎంతకైనా తెగిస్తారు: కేజ్రీవాల్

చండీగఢ్ మేయర్ ఎన్నికల్లో బీజేపీ అప్రజాస్వామిక పద్ధతుల ద్వారా విజయం సాధించిందని ఆప్ ఆరోపించింది. మేయర్ ఎన్నికల్లో పట్టపగలే మోసం జరిగిందని దిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ విమర్శించారు. ఇది ఆందోళన చెందాల్సిన అంశమన్నారు. చండీగఢ్ మేయర్ ఎన్నిక చూశాక సార్వత్రిక ఎన్నికల్లో వారు ఎంతవరకైనా వెళ్లేందుకు వెనకాడరని సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో కేజ్రీవాల్ అనుమానం వ్యక్తంచేశారు. మరోవైపు ఆప్ ఆరోపణలను బీజేపీ తరపున మేయర్‌గా ఎన్నికైన మనోజ్ సోంకర్ తోసిపుచ్చారు. తమకు అనుకూల పరిస్థితులు లేకుంటే ఆరోపణలు చేయటం ఆప్‌కు అలవాటేనన్నారు. ప్రతిదీ కెమెరాలో రికార్డ్ అయిందన్న బీజేపీ మేయర్ మనోజ్ సోంకర్... ఓటమిని జీర్ణించుకోలేకే ఆప్ ఆరోపణలు చేస్తోందన్నారు. 35 మంది సభ్యులున్న చండీగఢ్ మున్సిపల్ కార్పొరేషన్‌లో బీజేపీకి 14 మంది కౌన్సిలర్లు ఉన్నారు. ఆప్‌కు 13 మంది, కాంగ్రెస్‌కు ఏడుగురు కౌన్సిలర్లు ఉన్నారు. శిరోమణి అకాలీదళ్‌కు ఒక కౌన్సిలర్ ఉన్నారు. రానున్న లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి పంజాబ్‌లో ఆప్-కాంగ్రెస్ మధ్య సీట్ల పంపకంపై ఇంకా అంగీకారం కుదరనప్పటికీ ఈ ఎన్నికల్లో ఈ రెండు పార్టీలు అవగాహనతో బరిలోకి దిగడం ప్రాధాన్యత సంతరించుకుంది.

భారీ భద్రతా ఏర్పాట్లు : చండీగఢ్ మేయర్ ఎన్నిక నేపథ్యంలో భారీగా భద్రతా ఏర్పాట్లు చేశారు. శాంతిభద్రతల నిర్వహణకు పారా మిలటరీ దళాలు సహా 700మంది పోలీస్ బలగాలను మోహరించారు. ఎన్నికలు నిజానికి ఈనెల 18నే జరగాల్సి ఉండగా... ప్రిసైడింగ్ అధికారి అస్వస్థతకు గురికావడంతో చండీగఢ్ డిప్యూటీ కమిషనర్ ఫిబ్రవరి6వ తేదీకి వాయిదా వేశారు. దీంతో కాంగ్రెస్, ఆప్ పార్టీలు పెద్ద ఎత్తున నిరసనలకు దిగాయి. కమిషనర్ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ కుల్దీప్ కుమార్ హైకోర్టును ఆశ్రయించారు. దీంతో హైకోర్టు జనవరి 30 ఉ.10గంటలకు మేయర్ ఎన్నిక నిర్వహించాలని ఆదేశించింది.

కాంగ్రెస్ వర్గాల కొట్లాట

భోపాల్: మధ్యప్రదేశ్‌లోని పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ నేతల మధ్య ఘర్షణ జరిగింది. మాజీ ముఖ్యమంత్రి దిగ్విజయ్‌సింగ్‌పై కాంగ్రెస్ సీనియర్ నేత కమల్‌నాథ్ మద్దతుదారులు తప్పుడు ఆరోపణలు చేయడంతో ఈ పరిణామం చోటుచేసుకొంది. రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల సమయంలో టికెట్ల పంపిణీ విషయంలో దిగ్విజయ సింగ్‌పై కమల్‌నాథ్ మద్దతుదారుడైన పార్టీ షెడ్యూల్డ్ కులాల విభాగం మాజీ అధ్యక్షుడు ప్రదీప్ అహిర్వార్ తప్పుడు ఆరోపణలు చేశారు. ఇది ఆయనకు, పార్టీ అధికార ప్రతినిధి షహర్యార్ ఖాన్ మధ్య వాగ్వాదానికి దారితీసింది. అనంతరం కార్యాలయంలోనే ఒకరినొకరు దూషించుకొని దాడికి దిగారు. పరస్పరం కుర్చీలతో కొట్టుకున్నారు. నిందించుకున్నారు. చొక్కాలు చింపుకున్నారు. దీనికి సంబంధించిన వీడియోను బీజేపీ నేత ఒకరు సోషల్‌మీడియాలో షేర్ చేస్తూ తీవ్ర విమర్శలు చేశారు.

సీఎంగా సోరెన్ సతీమణి?

- మిత్రపక్షాలతో జేఎంఎం మంతనాలు
- జార్ఖండ్‌లో కీలక పరిణామాలు

రాంచీ: జార్ఖండ్ రాజకీయాలు రసవత్తరంగా మారాయి. భూకుంభ కోణం ఆరోపణలకు సంబంధించి మనీల్యాండరింగ్ కేసులో సీఎం హేమంత్ సోరెన్‌ను ప్రశ్నించేందుకు ఈడీ ప్రయత్నిస్తుండటం, ఆయన సమాధానం చెప్పకుండా తప్పించుకుంటున్న నేపథ్యంలో కీలక పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. హేమంత్‌ను ఈడీ అరెస్ట్ చేయవచ్చంటా ఊహాగానాలు వెలువడుతున్న వేళ సోరెన్ భార్య కల్పనా సోరెన్‌ని ముఖ్యమంత్రి చేసే యోచనలో ఉన్నారని ప్రచారం మొదలైంది. ఈ మేరకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారంటూ బీజేపీ ఎంపీ, జార్ఖండ్ నేత నిషికాంత్ దూబే సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈడీ సాగిస్తున్న వేట కారణంగా సొంత పార్టీ జేఎంఎం, కాంగ్రెస్, మిత్రపక్ష ఎమ్మెల్యేలను రాంచి రావాల్సిందిగా సోరెన్ ఆహ్వానించినట్లు...వారంతా రాష్ట్ర రాజధానికి చేరుకున్నట్లు తెలుస్తోంది. తన వద్ద ఉన్న సమాచారం ప్రకారం కల్పనా సోరెన్‌ని ముఖ్యమంత్రి చేయాలనే ప్రతిపాదన ఉందని 'ఎక్స్' వేదికగా దూబే పేర్కొన్నారు. జేఎంఎం, కాంగ్రెస్, ఆర్జేడీలతో కూడిన అధికార కూటమి ఎమ్మెల్యేలంతా రాంచీ చేరుకోవాలని ఆదేశాలు వెళ్లడంతో ఈ ఊహాగానాలు తెరపైకి వచ్చాయి. భూకుంభ కోణం కేసులో హేమంత్ సోరెన్‌ను అరెస్ట్ చేయడం ఖాయమని భావిస్తున్నందున ఈ పరిణామాలు ఉత్కంఠ రేపుతున్నాయి. దీంతో జార్ఖండ్ రాజకీయాల్లో తదుపరి పరిణామాలపై ఆసక్తి రేగుతోంది. కాగా, ఆదివారం దిల్లీలో ప్రత్యక్షమైన హేమంత్ సోరెన్ ఆ తర్వాత కనిపించలేదు. మనీల్యాండరింగ్ కేసులో ప్రశ్నించేందుకు ఈడీ అధికారులు సోరెన్ నివాసానికి వెళ్లగా ఆయన కనిపించకుండా పోయారు. దాదాపు 24 గంటలపాటు సోరెన్ ఆచూకీని ఈడీ అధికారులు పసిగట్టలేకపోయారు. దిల్లీలో విమానం ఎక్కాల్సి ఉన్నప్పటికీ ఆయన ఆచూకీని ఈడీ అధికారులు గుర్తించలేదు. దీంతో సోరెన్ పారిపోయారని బీజేపీ ఎద్దేవా చేసింది. మరోవైపు, తాము ముఖ్యమంత్రితో టచ్‌లో ఉన్నామని జేఎంఎం పార్టీ నేతలు చెబుతున్నారు. ఈ వ్యవహారంపై రాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ ఆసక్తికరంగా స్పందించారు. రాష్ట్రంలో పరిస్థితులను నిశితంగా పరిశీలిస్తున్నానని, తన బాధ్యత నిర్వర్తిస్తున్నానని, సరైన సమయం వచ్చినప్పుడు స్పందిస్తానని ఆయన అన్నారు. చట్టానికి ఎవరూ అతీతులు కాదని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించే దిశగా బీజేపీ కుట్రలు చేస్తోందని జేఎంఎం మిత్రపక్షమైన కాంగ్రెస్ ఆరోపించింది. ఈ ఆసక్తికర పరిణామాల మధ్య చివరిసారిగా ఆదివారం రాత్రి దిల్లీలో కనిపించిన హేమంత్ సోరెన్ మంగళవారం రాంచీలోని తన నివాసంలో ప్రత్యక్షమయ్యారు. ఎమ్మెల్యేల సమావేశానికి తన ఇంటి నుంచే బయలుదేరి వెళ్లారు. దీంతో జార్ఖండ్ రాజకీయాలు రసవత్తరంగా మారాయి.

పార్లమెంటు భద్రతపై సమాధానమేది?

కేంద్రాన్ని నిలదీసిన సీపీఐ ఎంపీ సంతోశ్ కుమార్

న్యూదిల్లీ: పార్లమెంటు భద్రతా వైఫల్యంపై ఇన్ని రోజుల తర్వాత కేంద్రం వద్ద ఎలాంటి సమాధానం లేకపోవడం గర్హనీయమని సీపీఐ ఎంపీ పి.సంతోశ్ కుమార్ అన్నారు. ఈ ఘటన జరిగి చాలాకాలమైందని, అయినా ఇంతవరకు దర్యాప్తు నివేదికను ప్రభుత్వం వెల్లడించలేదని ఆయన అన్నారు. హోంమంత్రి అమిత్‌షా ప్రకటన కోసం డిమాండ్ చేసినందుకు 146 మంది ప్రతిపక్ష ఎంపీలు సస్పెన్షన్‌కు గురి కావడాన్ని మరువలేమని సంతోశ్ కుమార్ వ్యాఖ్యానించారు. పార్లమెంటు బడ్జెట్ సమావేశాల ప్రారంభం నేపథ్యంలో మంగళవారం ప్రభుత్వం ఏర్పాటు చేసిన అఖిలపక్ష సమావేశంలో సంతోశ్‌కుమార్ మాట్లాడారు. పార్లమెంటు భద్రతా వైఫల్యం, మణిపూర్‌లో అశాంతి అంశాలను ప్రస్తావించారు. పార్లమెంటుపై దాడి...విపక్ష ఎంపీలను సస్పెండ్ చేసినప్పటికీ ఆ ఘటనకు సంబంధించిన దర్యాప్తు అంశాలను ప్రభుత్వం ఎందుకు బయటపెట్టలేదని ప్రశ్నించారు. బీజేపీ ఎంపీ ప్రతాప్ సింహా పాత్రను ఎందుకు విస్మరించారని నిలదీశారు. ప్రభుత్వానిదే జవాబుదారీతనం అన్నందుకు ప్రతిపక్ష ఎంపీలు శిక్ష అనుభవించారు. ఈ పరిణామాలతో పార్లమెంటు భద్రతపై బీజేపీ ప్రభుత్వానికి ఎంత చిత్తశుద్ధి ఉందో స్పష్టమైందని ఎంపీ వ్యాఖ్యానించారు. మణిపూర్ అంశాన్ని ప్రస్తావిస్తూ నేటికీ అక్కడ అనిశ్చితి కొనసాగుతోందన్నారు. హింసను కట్టడి చేయడంలో డబుల్ ఇంజిన్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ఆ రాష్ట్రంలో సామాన్య పరిస్థితులను, శాంతిని నెలకొల్పడం అత్యవసరమైనప్పటికీ ప్రజాసమస్యల నుంచి దృష్టి మళ్లించే చర్యలకే బీజేపీ ప్రాధాన్యత ఇస్తోందని సంతోశ్ కుమార్ దుయ్యబట్టారు.

భారత్‌లో భారీగా అవినీతి

- ప్రపంచ అవినీతి సూచీలో 93వ స్థానం
- ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ నివేదిక వెల్లడి

న్యూదిల్లీ: ప్రపంచ అవినీతి సూచీలో భారత్ మరింత దిగజారింది. గత ఏడాది (2022) కంటే ఈ ఏడాది (2023) ఎనిమిది స్థానాలు దిగువకు పడిపోయింది. ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ రిపోర్టు ప్రకారం 2023 ఏడాదికిగాను మొత్తం 180 దేశాల్లో భారత్ 93వ స్థానంలో నిలిచింది. 2022లో భారత్ ర్యాంక్ 85గా ఉంది. ప్రపంచంలోని వివిధ దేశాల్లో ప్రభుత్వ రంగ అవినీతి స్థాయిల ఆధారంగా ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ ప్రతి ఏడాది ఈ నివేదికను రూపొందిస్తుంది. తాజాగా 2023కు సంబంధించిన నివేదికను వెల్లడించింది. అవినీతి స్థాయిని బట్టి దేశాలకు 0 నుంచి 100 వరకు స్కోర్ ఇస్తుంది. అత్యంత అవినీతి ఉన్న దేశానికి 0 స్కోర్, అవినీతి రహిత దేశానికి 100 స్కోర్‌ను కేటాయిస్తుంది. ఈ ఏడాది ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ భారత్‌కు 39 స్కోర్ ఇచ్చింది. దాంతో భారత్ 93వ ర్యాంక్‌లో నిలిచింది. గత ఏడాది భారత్ 40 స్కోర్‌తో 85వ ర్యాంక్‌లో ఉంది. ఇక దక్షిణాసియా దేశాల్లో పాకిస్థాన్, శ్రీలంక అత్యంత అవినీతి దేశాలుగా నిలిచాయి. శ్రీలంక 115వ ర్యాంకులో, పాకిస్థాన్ 133వ ర్యాంకులో ఉన్నాయి. బంగ్లాదేశ్ 149వ ర్యాంకులో ఉన్నప్పటికీ... గతంతో పోల్చితే ఇప్పుడు అవినీతి భారీగా తగ్గుతోంది. ఇక అవినీతి నిర్మూలన కోసం చైనా శరవేగంగా చర్యలు తీసుకుంటోంది. గడిచిన దశాబ్ది కాలంలో చైనా ఏకంగా 30.70 లక్షల మంది ప్రభుత్వ అధికారులకు శిక్షలు విధించింది. దాంతో ప్రస్తుతం చైనా 76వ ర్యాంకుకు ఎగబాకింది. మరోవైపు న్యూజిలాండ్, సింగపూర్ దేశాలు వరుసగా 3, 5 ర్యాంకులతో జాబితాలో అగ్రస్థానంలో నిలిచాయి. అవినీతి నిర్మూలన చర్యలతో ఆస్ట్రేలియా (14), హాంగ్‌కాంగ్ (14), జపాన్ (16), భూటాన్ (26), తైవాన్ (28), దక్షిణకొరియా (32) కూడా తమ ర్యాంకులను మెరుగుపర్చుకున్నాయి. ఇకపోతే అత్యంత అమానవీయ పాలన వల్ల అఫ్గానిస్థాన్ 162వ ర్యాంకుతో జాబితాలో అడుగున ఉన్నది. మైన్మార్ కూడా శ్రీలంకతో సమంగా 162వ ర్యాంకులోనే కొనసాగుతున్నది. నియంత కిమ్ పాలనలోని ఉత్తరకొరియా 172వ ర్యాంకుతో జాబితాలో మరింత దిగువన ఉన్నది.

కార్మికులందరికీ సమ్మె వేతనం చెల్లించండి

మంత్రి సురేశ్‌కు ఏఐటీయూసీ లేఖ

విశాలాంధ్ర–విజయవాడ: సమ్మెలో పాల్గొన్న మున్సిపల్ కార్మికులందరికీ సమ్మె కాలపు వేతనాలు చెల్లించాలని ఏఐటీయూసీ అనుబంధ ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్య దర్శులు ఆసుల రంగనాయకులు, పోరుమామిళ్ల సుబ్బ రాయుడు మున్సిపల్‌శాఖ మంత్రి ఆదిమూలపు సురేశ్‌కు మంగళవారం లేఖ రాశారు. మున్సిపల్ సమ్మెలో పాల్గొన్న పారిశుధ్య, పారిశుధ్యేతర శాశ్వత, ఒప్పంద కార్మికులకు, క్లాప్ డ్రైవర్లకు, కరోనా సమయంలో తీసుకున్న అదనపు వర్కర్లకు అందరికీ జీవో నెంబర్ 17 వర్తించేలా మార్పులు చేయాలని కోరారు. జనవరి 3 నుండి 10 వరకు రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ శాఖలోని ఆయా విభాగాల కార్మికులు సమ్మెలో పాల్గొన్నారని పేర్కొన్నారు. సమ్మె కాలపు వేతనాలను అందరికీ అమలు చేస్తామని మంత్రివర్గ ఉప సంఘంతో జరిగిన చర్చల్లో అంగీకరించారని తెలిపారు. అయితే ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెంబర్ 17 లో క్లాప్, స్కూల్ స్వీపర్లు, కరోనా సమయంలో అదనంగా తీసుకున్న వర్కర్లకు సమ్మె కాలపు వేతనం చెల్లింపు వర్తింపచేయకపోవడం దారుణం అన్నారు. చాలీచాలని వేతనాలు తీసుకుంటున్న ఈ కార్మికులు నష్టపోతారని... వారికి కూడా వర్తించేలా చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ నాయకులు కోరారు.

సీపీఐకి విరాళం అందజేత

విశాలాంధ్ర–విజయవాడ: సీపీఐ కృష్ణాజిల్లా సీనియర్ నాయకుడు మోదుమూడి రామారావు... వామపక్ష అభిమానులు, శ్రేయోభిలాషుల ద్వారా 'భారత కమ్యూనిస్టు పార్టీ నిధి' కోసం సేకరించిన మొత్తం రూ.44,500లను పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణకు అందజేశారు. మంగళవారం విజయవాడలోని దాసరి భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కేవీవీ ప్రసాద్, రాష్ట్ర సమితి సభ్యులు వై.చెంచయ్య తదితరులు పాల్గొన్నారు.

బాబు-పవన్ దేనికి సిద్ధం?

అంబటి రాంబాబు ప్రశ్న

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: ఎన్నికల సమరశంఖాన్ని భీమిలి నుంచి వైసీపీ పూరించిందని, 'సిద్ధం' సభకు భారీ స్పందన వచ్చిందని మంత్రి అంబటి రాంబాబు అన్నారు. ఈ సభ విజయంతో టీడీపీ, జనసేన వెన్నులో వణుకు మొదలైందని విమర్శించారు. ఆ పార్టీల అధ్యక్షులు చంద్రబాబు, పవన్ కల్యాణ్ సర్దుకునేందుకు సన్నద్ధమయ్యారని ఎద్దేవా చేశారు. మీ సీట్లే ప్రకటించుకోలేని మీరు దేనికి సిద్ధమని అంబటి ప్రశ్నించారు. చంద్రబాబు, లోకేశ్‌ను మోయటానికి, ప్యాకేజీ పుచ్చుకోవడానికి పవన్ సిద్ధమని విమర్శించారు. చంద్రబాబు పాలనపై ప్రజలకు వివరించడమే కాకుండా టీడీపీ అనుసరించిన విధానాలపై సీఎం జగన్ సభాముఖంగా నిలదీశారని చెప్పారు. ప్రత్యర్థుల గుండెల్లో దడ పుట్టించేలా... పార్టీ శ్రేణుల్లో నూతనోత్సం నింపేలా వైసీపీ సభ జరిగిందని అంబటి రాంబాబు తెలిపారు. జగన్ సంక్షేమ పాలనను తిరిగి తెచ్చుకోవడానికి రాష్ట్ర ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఆయన అన్నారు.

హెచ్-1బీ వీసా రెన్యువల్...

అందుబాటులోకి పైలట్ ప్రోగ్రామ్

వాషింగ్టన్: హెచ్-1బీ వీసా రెన్యువల్ విధానాన్ని మరింత సరళీకరించేలా అమెరికా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నది. విదేశీ వృత్తి నిపుణులు తమ హెచ్-1బీ వీసాలను అమెరికాలోనే రెన్యువల్ చేసుకునేలా ఓ పైలట్ ప్రోగ్రామ్‌కు బైడెన్ సర్కారు ఇటీవల పచ్చజెండా ఊపింది. తాజాగా ఇది అందుబాటులోకి వచ్చింది. అమెరికా కాలమానం ప్రకారం జనవరి 29 నుంచి ఈ పైలట్ ప్రోగ్రామ్ ప్రారంభమైనట్లు అమెరికా విదేశాంగ శాఖ వెల్లడించింది. ఇందులోభాగంగా 20వేల వీసాలను అమెరికాలోనే రెన్యువల్ చేయనున్నారు. తొలిదశ ఈ అవకాశాన్ని కేవలం భారతీయులు, కెనడియన్లకు మాత్రమే కల్పించారు. ఐదు వారాల పాటు ఈ ప్రోగ్రామ్ అందుబాటులో ఉంటుంది. ప్రతివారం 4వేల చొప్పున వీసాలను రెన్యువల్ చేయనున్నారు. 2020 జనవరి 1 నుంచి 2023 ఏప్రిల్ 1 మధ్య మిషన్ కెనడా జారీ చేసిన వీసాలు, 2021 ఫిబ్రవరి 1 నుంచి 2021 సెప్టెంబరు 30 మధ్య మిషన్ ఇండియా జారీ చేసిన వీసాలను మాత్రమే రెన్యువల్ చేసుకునేందుకు వీలు కల్పించారు. కాగా, అమెరికా కంపెనీలు విదేశీ నిపుణులను నియమించుకునేందుకు హెచ్-1బీ వీసా అవకాశం కల్పిస్తుంది. ఈ వీసాలను వినియోగిస్తున్న వారిలో భారతీయులే అధికం. సాధారణంగా వీటి గడువు మూడేళ్లలో తీరిపోతుంది. గతంలో హెచ్-1బీ వీసా గలవారు రెన్యువల్ కోసం అమెరికాను విడిచి బయటకు వెళ్లాల్సిన అవసరం ఉండేది కాదు. 2004 వరకు ఇదే విధానం అమలయ్యేది. ఆ తర్వాత దీనిలో మార్పు చేయడంతో... రెన్యువల్ కోసం స్వదేశం తిరిగిరావడమో లేక మరేదైనా దేశానికి వెళ్లి పునరుద్ధరించుకోవడమో చేయాల్సివస్తోంది. అయితే, గతేడాది జూన్‌లో ప్రధాని మోదీ అమెరికా పర్యటనకు వచ్చినపుడు హెచ్-1బీ వీసాలను అగ్రరాజ్యంలోనే పునరుద్ధరిస్తామని బైడెన్ ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఈ క్రమంలోనే తాజాగా పైలట్ ప్రోగ్రామ్‌ను అందుబాటులోకి తెచ్చారు.

ఫిరాయింపు ఎమ్మెల్యేలకు మళ్లీ నోటీసులు

5లోగా స్పందించాలన్న స్పీకర్

విశాలాంధ్ర బ్యూరో– అమరావతి: అనర్హత పిటిషన్ల వ్యవహారంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలకు అసెంబ్లీ స్పీకర్ తమ్మినేని సీతారాం నోటీసులు జారీ చేశారు. ఎమ్మెల్యేల అభ్యర్థన మేరకు ఫిబ్రవరి 8వ తేదీన స్వయంగా విచారణకు హాజరు కావాలని నోటీసుల్లో పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం సాయంత్రం ఏపీ స్పీకర్ కార్యాలయం నుంచి నోటీసులు వారికి వెళ్లాయి. ఫిబ్రవరి 5వ తేదీలోగా ఈ నోటీసులకు స్పందించాలని స్పీకర్ కార్యాలయం కోరింది. వైఎస్సార్‌సీపీ నుంచి ఫిరాయించిన నలుగురు ఎమ్మెల్యేలతో పాటు పిటిషనర్ అయిన ఏపీ ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాద రాజుకు కూడా నోటీసులు పంపించారు. ఈ ఐదుగురిని ఒకేసారి కలిపి విచారణ చేయనున్నారు. ఎమ్మెల్యేల వివరణ తీసుకోనున్న తర్వాతే వారిపై అనర్హత పిటిషన్ విషయంలో ఓ స్పష్టమైన నిర్ణయం ప్రకటించే అవకాశాలున్నాయి.

నేనున్నంత వరకు ఎవరి పౌరసత్వం పోదు: మమత

కోల్‌కతా: తన కంఠంతో ప్రాణమున్నంత వరకు ఏ ఒక్కరూ తమ పౌరసత్వాన్ని కోల్పోబోరని తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి, బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఉద్ఘాటించారు. లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తుండటంతో సీఏఏ, యూసీసీ అమలు గురించి మాట్లాడుతూ బీజేపీ రాజకీయం చేస్తోందని విమర్శించారు. ఉత్తర దినాజ్‌పూర్‌లో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో మమత మాట్లాడుతూ ఎన్నికల దృష్ట్యా బీజేపీ అవకాశవాద రాజకీయాలు చేస్తోందని, పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ), ఉమ్మడి పౌరస్మృతి (యూసీసీ) అంశాలను లేవనెత్తిందని ఆరోపించారు. 'ఇది కేవలం రాజకీయం. అనేక మందికి పౌరసత్వం ఇచ్చాం. వాళ్లు దేశ పౌరులే. అందుకే ఓటు వేసేందుకు వారిని అనుమతిస్తున్నారు. ఒక్క విషయం స్పష్టంగా చెప్పదలచుకున్నా. నేను బతికున్నంత కాలం పశ్చిమ బెంగాల్‌లో సీఏఏ, ఎన్‌ఆర్‌సీని అమలు చేసే ప్రసక్తే లేదు. ఏ ఒక్కరి పౌరసత్వం తీసివేయడానికీ అనుమతించను' అని మమతా బెనర్జీ అన్నారు. వారంలో సీఏఏను దేశమంతటా అమలు చేస్తామని కేంద్ర మంత్రి శాంతను ఠాకూర్ ప్రకటించడంపై మమత మండిపడ్డారు. సరిహద్దు ప్రాంతాల్లో నివాసమున్న వారికి సైన్యం ప్రత్యేక కార్డులు జారీ చేస్తుందనే వార్తలపైనా ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితులు ప్రమాదకరమన్నారు. కాగా, సీఏఏ చట్టం ప్రకారం పాకిస్థాన్, బంగ్లాదేశ్, అఫ్గానిస్థాన్‌లో వేధింపులకు గురై 2014 డిసెంబరు 31కి ముందు భారత్‌కు వచ్చిన ముస్లింయేతరుల (హిందువులు, సిక్కు, బౌద్ధ, జైన, పార్సీ, క్రైస్తవులు)కు దేశ పౌరసత్వాన్ని కల్పిస్తారు.

16 మందితో ఎస్పీ తొలి జాబితా

లక్నో: రానున్న లోక్‌సభ ఎన్నికలకు ఉత్తరప్రదేశ్ నుంచి పోటీ చేసే 16 మంది అభ్యర్థులను సమాజ్‌వాదీ పార్టీ మంగళవారం అధికారికంగా వెల్లడించింది. విపక్ష ఇండియా కూటమి కాంగ్రెస్ కోసం 11 సీట్లు పక్కనపెడతామని ఎస్పీ అధినేత అఖిలేశ్ యాదవ్ ప్రకటించిన మరుసటి రోజు ఎస్పీ తమ ఎంపీ అభ్యర్థులను ప్రకటించింది. ఎస్పీ విడుదల చేసిన 16 మంది అభ్యర్థుల జాబితాను పరిశీలిస్తే... మెయిన్‌పురి నుంచి అఖిలేశ్ యాదవ్ భార్య డింపుల్ యాదవ్ పోటీ చేయనుండగా, రవిదాస్ మెహ్రోత్రా లక్నో నుంచి, షఫీకుర్ రెహ్మాన్ బర్ సంభాల్ నుంచి బరిలో నిలుస్తారు. ఎస్పీ జాబితాలో 11 మంది ఓబీసీలు ఉండగా, ఒక ముస్లిం, ఒక దళిత, ఒక ఠాకూర్, ఒక టాండన్ అభ్యర్థి ఉన్నారు. ఖత్రి వర్గానికి చెందిన అభ్యర్థికి కూడా చోటు దక్కింది. 11 మంది ఓబీసీల్లో నలుగురు కుర్మి, యాదవులు ముగ్గురు, ఇద్దరు సఖ్యా, నిషాద్ ఒకటి, పాల్ వర్గానికి చెందిన అభ్యర్థి ఒకరు ఉన్నారు.

లౌకికవాదానికి బీజేపీ తూట్లు: ఏచూరి

తిరువనంతపురం: లౌకికవాదానికి బీజేపీ చరమగీతం పాడిందని సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి విమర్శించారు. ఎన్నికలే లక్ష్యంగా మత అజెండాను అమలు చేస్తోందని, ఇందులో భాగంగానే అయోధ్యలో ప్రాణప్రతిష్ఠ చేసి లౌకికవాదానికి తూట్లు పొడించిందని వ్యాఖ్యానించారు. ఏచూరీ మంగళవారం కేరళ, తిరువనంపురంలో సీపీఎం కేంద్ర కమిటీ సమావేశం అనంతరం విలేకరులతో మాట్లాడుతూ మోదీ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. 'అయోధ్య ఎపిసోడ్ ముగిసింది. ఇక మధురపై బీజేపీ దృష్టి పెట్టింది. కృష్ణుడి జన్మస్థలంలో ఆలయాల ప్రచారాన్ని చేపట్టింది' అని దుయ్యబట్టారు. రాజకీయ ప్రయోజనాల కోసం మత విశ్వాసాలతో బీజేపీ ఆటలు ఆడుతోందని విమర్శించారు. విపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ఈడీ దాడులు చేయిస్తుందన్నారు. హిందూత్వ అజెండాకు దీటైన సమాధానాన్ని ఇండియా కూటమి ఇవ్వగలదని, ఇందుకోసం సమ్మిళితంగా ముందుకు సాగడం ముఖ్యమని నొక్కిచెప్పారు. కేరళ ప్రభుత్వంపై రాజకీయ ప్రేరేపిత హింసకు గవర్నర్ బాధ్యత వహించాలని, అత్యున్నత పదవికి ఆయన అనర్హుడని ఏచూరి వ్యాఖ్యానించారు.

నాలుగో స్పిన్నర్‌గా కుల్‌దీప్‌ను ఆడించాలి: అనిల్ కుంబ్లే

న్యూదిల్లీ: హైదరాబాద్‌లోని ఉప్పల్ స్టేడియంలో ఇంగ్లాండ్‌తో జరిగిన తొలి టెస్టులో ఓటమి చవి చూసిన టీమ్‌ఇండియా విశాఖలో జరిగే రెండో టెస్టుపై దృష్టిపెట్టింది. తొలి టెస్టులో చేసిన తప్పులపై సమీక్షించుకుంటోంది. ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా, బ్యాటర్ కేఎల్ రాహుల్ గాయాల కారణంగా ఈ మ్యాచ్‌కు దూరమయ్యారు. సర్ఫరాజ్ ఖాన్, ఎడమ చేతివాటం స్పిన్నర్ సౌరభ్ కుమార్, ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్‌లను వీరి స్థానంలో ఎంపిక చేశారు. దీంతో జట్టు కూర్పు ఎలా ఉంటుందోనని ఆసక్తి నెలకొంది. ఈ మ్యాచ్‌లో నాలుగో స్పిన్నర్ అవసరమని భావిస్తే కుల్‌దీప్ యాదవ్ మంచి ఎంపిక అని భారత మాజీ కెప్టెన్ అనిల్ కుంబ్లే అభిప్రాయపడ్డాడు. "టీమ్‌ఇండియాకు నాలుగో స్పిన్నర్ అవసరమా.. లేదా..? అనేది నాకు కచ్చితంగా తెలియదు. ఒక్క ఫాస్ట్ బౌలర్ మాత్రమే అవసరమని భావిస్తే నాలుగో స్పిన్నర్‌గా కుల్‌దీప్ యాదవ్‌ను తీసుకోవడం భారత్‌కు ఉపకరిస్తుంది. అతడి బౌలింగ్‌లో వేరియేషన్స్ ఉంటాయి. ఇంగ్లాండ్ తొలి టెస్టు జట్టునే రెండో టెస్టులో కొనసాగించొచ్చు. పిచ్ స్పిన్‌కు అనుకూలంగా ఉండొచ్చు. ఉప్పల్ కంటే పేస్ బౌలింగ్‌కు కాస్త ఎక్కువ సహకరిస్తుందని భావిస్తున్నా. ఈ పిచ్ నెమ్మదిగా ఉన్నా.. సరిగ్గా బౌలింగ్ చేస్తే బాగా వికెట్లు తీయొచ్చు. స్పిన్ బౌలింగ్‌లో భారత్ జాగ్రత్తగా ఆడాలి. తొలి టెస్టులో దీనితోనే ఇబ్బంది పడ్డారు. కొంత మంది బ్యాటర్ల ఫుట్‌వర్క్ కూడా సరిగా లేదు" అని అనిల్ కుంబ్లే పేర్కొన్నాడు. ఫిబ్రవరి 2 నుంచి విశాఖలో రెండో టెస్టు ప్రారంభంకానుంది. కుల్‌దీప్ యాదవ్ చివరి టెస్టు 2022 డిసెంబరులో బంగ్లాదేశ్‌తో ఆడాడు. రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి ఎనిమిది వికెట్లు పడగొట్టాడు. మొత్తం 8 టెస్టులు ఆడి 34 వికెట్లు తీశాడు.

'వేధింపులు ఎదుర్కొన్నా'

దివ్యా దేశ్‌ముఖ్

న్యూదిల్లీ: ఇటీవల జరిగిన టోర్నమెంట్‌లో కొందరు వీక్షకుల నుంచి తాను చేదు అనుభవాన్ని ఎదుర్కొన్నానని భారత చదరంగ క్రీడాకారిణి దివ్యాదేశ్‌ముఖ్ ఆవేదన వ్యక్తం చేశారు. వారు అనవసర విషయాలపై దృష్టిపెట్టారని వాపోయారు. ఇటీవల నెదర్లాండ్స్‌లో జరిగిన టాటా స్టీల్ మాస్టర్స్ టోర్నమెంట్‌లో ఆమె పాల్గొన్నారు. మహారాష్ట్రలోని నాగ్‌పుర్‌కు చెందిన దివ్య తాను ఎదుర్కొన్న అనుభవాన్ని ఇన్‌స్టా వేదికగా వెల్లడించారు. 'ఈ విషయాన్ని ఎప్పటినుంచో చెప్పాలని అనుకుంటున్నా. అయితే నా టోర్నీ ముగిసేవరకు వేచి ఉన్నాను. క్రీడాకారిణులతో వీక్షకులు ఎలా వ్యవహరిస్తారో నేను గమనించాను. వారు ఆట మీద కంటే నా కురులు, దుస్తులు, యాస వంటి అనవసర విషయాలనే పట్టించుకుంటున్నారని తెలిసింది' అని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. క్రీడలో సామర్థ్యంతో సంబంధం లేకుండా తమపై ఓ అభిప్రాయానికి వస్తుంటారని... అలాంటివారి తీరు బాధించిందని ఆమె అన్నారు. అలాగే పురుషులతో పాటు మహిళలకు కూడా క్రీడల్లో సమాన హోదా దక్కాలని పేర్కొన్నారు. 18 ఏళ్ల దివ్య గత ఏడాది ఆసియా మహిళల చెస్ చాంపియన్‌షిప్ గెలుచుకున్నారు.



మాల్దీవులకు తగ్గిన భారత పర్యాటకులు

న్యూదిల్లీ: మాల్దీవులకు వెళ్లే భారతీయ పర్యాటకుల సంఖ్య గణనీయంగా పడిపోయింది. ఈ మేరకు ఆ దేశ ప్రభుత్వ గణాంకాలు చెబుతున్నాయి. గతేడాది డిసెంబరు 31 వరకు భారత్ నుంచి 2,09,198 మంది మాల్దీవులను సందర్శించగా పర్యాటక మార్కెట్‌లో 11 శాతంతో భారత్ అగ్రస్థానంలో ఉంది. ఆ తర్వాత స్థానాల్లో రష్యా, చైనా, బ్రిటన్ నిలిచాయి. అయితే ప్రధాని మోదీ లక్షద్వీప్ పర్యటన క్రమంలో జరిగిన పరిణామాలతో రెండు దేశాల మధ్య దౌత్యపరమైన సంబంధాలను దెబ్బతిన్నాయి. దీంతో మాల్దీవుల పర్యాటక మార్కెట్‌లో నంబర్ వన్ నుంచి ఐదో స్థానానికి భారత్ పడిపోయింది. 13,989 మంది మాత్రమే ఆదేశానికి వెళ్లారు. 18,561 మంది పర్యాటకులతో రష్యా మొదటి స్థానంలో నిలిచింది. 18,111 మందితో ఇటలీ రెండో స్థానానికి ఎగబాకింది. చైనా (16,529), బ్రిటన్ (14,588) మూడు, నాలుగు స్థానాల్లో ఉన్నాయి.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.